
ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ

fb/prajasakti | Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu | www.prajasakti.com

సంపుటి : 37 సంచిక : 234 | విజయవాడ, గురువారం 24 ఆగస్టు 2017 | 12 + 12 పేజీలు వెల : 4.00





- జాతి చిరకాల స్వప్నమైన నదుల అనుసంధానం పట్టిసీమ ద్వారా కృష్ణా-గోదావరి పవిత్రసంగమంతో సాకారంచేసిన ఘనత అపర భగీరథుడైన మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారాచంద్రబాబునాయుడు గారిదే. ఈ పట్టిసీమ ద్వారా 2015 ఖరీఫ్ నుండి నేటివరకు తరలించిన గోదావరి జలాలు 100 టీఎంసీలు.
- 162 ఏళ్ల చరిత్ర కలిగిన కృష్ణా డెల్టాకు సాగునీటి భద్రత, రాయలసీమకు త్రాగు మరియు సాగునీరు అందించాలని ప్రభుత్వ సంకల్పం. ఏటా సుమారు 3 వేల టీఎంసీల గోదావరి జలాలు వృధాగా సముద్రంపాలవుతున్నాయి. ఆ వరద జలాలను వినియోగించుకోటానికి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును చేపట్టింది. ఆ ప్రాజెక్టు ఫలాలను ముందుగానే రైతాంగానికి అందించాలనే మహాసంకల్పంతో మన ముఖ్యమంత్రి గారి పట్టుదల.. ప్రణాళిక.. పరిశ్రమతో రూపుదిద్దుకున్నదే పట్టిసీమ ఎత్తిపోతల పథకం.
- పథకం రూపుదిద్దుకున్నప్పటినుంచి నేటివరకు ప్రకాశంబ్యారేజికి ఎగువనుండి కృష్ణానదీ జలాలు తగినన్ని రాలేదు. అయినప్పటికీ 2015 ఖరీఫ్ నుండి నేటివరకు కృష్ణాడెల్టా పంటలకు ప్రాణాధారంగా నిలిచింది పట్టిసీమ నుండి వచ్చిన 100 టీఎంసీల గోదావరి జలాలే. అందుకు ముఖ్యమంత్రి గారి దూరదృష్టే కారణం.

100 టీఎంసీలు.. పట్టిసీమ ద్వారా తొలి ఏడాది 4.20 , మలి ఏడాది 55.60, ఈ ఏడాది 40.20 టీఎంసీలు.... కలిపి మొత్తం నేటివరకు 100 టీఎంసీలు గోదావరి జలాలను కృష్ణాడెల్టాకు మళ్ళింపు.

డెల్టాకు నీటి భద్రత.... 13 లక్షల కృష్ణాడెల్టా ఆయకట్టుకు కల్పించబడిన నీటిభద్రత. వరి సాగుతోపాటు ఆక్వా రంగానికి మరియు త్రాగునీటికి కూడా ఒనగూడిన నీటిభద్రత.

పెరిగిన దిగుబడి.. సారవంతమైన గోదావరి జలాలతో తగ్గిన ఎరువుల వినియోగం మరియు పెట్టుబడి వ్యయం...... తద్వారా పెరిగిన పంట దిగుబడులు.

8 వేల కోట్ల ఆదాయం... 2015 ఖరీఫ్‌లో 2,500 కోట్లు.... 2016 ఖరీఫ్‌లో 5,500 కోట్లు..... మొత్తం రెండేళ్లలో 8 వేల కోట్ల విలువ గల పంట దిగుబడి.

జూన్‌లోనే సాగునీరు ... పట్టిసీమ ఎత్తిపోతల పథకం వల్లనే 2017లో జూన్ మాసంలోనే కృష్ణాడెల్టాకు తరలివచ్చిన గోదావరి జలాలు. తద్వారా అక్టోబరు మాసంలోనే పంట చేతికొచ్చి, నవంబరులో వచ్చే తుఫానుల బారిన పడకుండా రక్షణ.

జలవనరుల శాఖ

జారీచేసినవారు : కమీషనర్, సమాచార పౌరసంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము.

ప్రజ్ఞ

1. మహిళా సంక్షేమానికి హెల్ప్‌లైన్ '181'ను ప్రారంభించిన రాష్ట్రం ఏది?
2. ఇటీవల మృతిచెందిన ప్రముఖ హాస్యనటుడు జెర్సీఫెస్ ఏ దేశానికి చెందిన వ్యక్తి?
3. 'ఐ యాం హెచ్‌ఐవి పాజిటివ్ సో వాట్' పుస్తక రచయిత ఎవరు?
4. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం ఏ తేదీన నిర్వహిస్తారు?
5. రాజీవ్ ఖేల్‌రత్న అవార్డు-2017కు ఎంపికైన క్రీడాకారులెవరు?

సమాధానాలు 7లో

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.
94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

వాతావరణం



బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

కోస్తాంధ్రకు ఆనుకుని బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని విశాఖపట్నం వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ ఉపరితల ఆవర్తనం కిందకు దిగే అవకాశాలున్నాయని, ఇదే జరిగితే కోస్తాంధ్రలో కొన్నిచోట్ల భారీ వర్షాలు పడొచ్చని పేర్కొంది. ఎపిలో పలు చోట్ల ఇప్పటికే వర్షాలు కురుస్తున్నాయని తెలిపింది. బంగ్లాదేశ్‌ను ఆనుకుని ఈశాన్య బంగాళాఖా తంలో మరో ఉపరితల ఆవర్తనం బలంగా ఉన్నట్లు పేర్కొంది. ఇది బలపడితే రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

మంత్రి గంటాకు నాన్‌బెయిలబుల్ వారెంట్

ప్రజాశక్తి- అనకాపల్లిటౌన్ (విశాఖ)

2009లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డరనే కేసులో ప్రస్తుత మంత్రి గంటా శ్రీనివాసరావుకు అనకాపల్లి రెండో అదనపు సివిల్ కోర్టు న్యాయమూర్తి బుధవారం నాన్ బెయిల్ బుల్ వారెంట్ జారీ చేశారు. 2009 ఎన్నికల్లో అనకాపల్లి శాసన సభ నియోజకవర్గం నుంచి ప్రజారాజ్యం పార్టీ తరపున పోటీ చేసిన గంటా శ్రీనివాసరావు క్రికెట్ కిట్లు పంపిణీ చేస్తున్నారన్న ఫిర్యాదు రావడంతో నాడు ఎన్నికల సంఘం అధికారులు ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంటా ఇంట్లో క్రికెట్ కిట్లు లభ్యం కావడంతో అప్పట్లో ఇసి ఆయనపై కేసు నమోదు చేసింది. ఆ కేసు విచారణ సందర్భంలో మంత్రి వాయిదాలకు హాజరుకాకపోవడంతో బుధవారం న్యాయమూర్తి సత్యనారాయణ నాన్‌బెయిల్‌బుల్ వారెంట్‌ను జారీ చేశారు. ఈ కేసు తదుపరి విచారణ సెప్టెంబర్ 11కు వాయిదా వేశారు.

పిఎస్‌యుల అప్పులపై ఆరా !



- వడ్డీభారాన్నిఅధిగమించేందుకు ఆర్థిక శాఖ కసరత్తు
- ఆర్టీసి రుణభారం రూ.800 కోట్లు
- పౌరసరఫరాల అప్పులు రూ.12,650 కోట్లు
- ఇతర సంస్థల అప్పులపైనా వివరాల సేకరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బ్యాంకుల చేతుల్లో రుణ గ్రహీతలుగా కష్టాలు పడుతున్న ప్రభుత్వ రంగ సంస్థల వడ్డీ భారాన్ని తగ్గించి ఆదుకునేందుకు ఆర్థిక శాఖ కసరత్తు ప్రారంభించింది. దీనికోసం ఆయా సంస్థల రుణాలను మాఫీ చేసేందుకు కూడా ఆలోచన చేస్తోంది. లేదా ఉన్న వడ్డీని తగ్గించేందుకు నేరుగా బ్యాంకులతో చర్చించాలని యోచిస్తోంది. రెండు విధానాల్లో దేన్ని, ఎలా అమలు చేయాలన్న దానిపై ఇంకా నిర్దిష్టమైన నిర్ణయాన్ని తీసుకోలేదు. దీనిపై త్వరలోనే అన్ని శాఖలతో మరోసారి చర్చించి తుది నిర్ణయాన్ని తీసుకుంటామని ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు. మాఫీ వల్ల ప్రభుత్వంపై ఇప్పటికిప్పుడు ఎంత భారం పడుతుందన్నది కూడా అధ్యయనం చేస్తున్నారు. ఇదే సమయంలో ఇప్పటికే ఆయా సంస్థలకు ఉన్న డిపాజిట్లు, స్థిరాస్తుల పరిస్థితి ఏమిటన్నది కూడా అంతుపట్టడం లేదు. ఒకవేళ వడ్డీ తగ్గింపుపై బ్యాంకులతో మాట్లాడే నిర్ణయమైతే సమస్య లేదని, నేరుగా అసలు మాఫీ చేయాలని నిర్ణయిస్తే సంస్థల పేరిట ఉన్న ఆస్తులు, వాటికి బ్యాంకుల్లో ఉన్న డిపాజిట్లపై ఎటువంటి ఆలోచన చేస్తారో తేలడం లేదని అధికారులు అంటున్నారు.రాష్ట్రంలో ఉన్న అనేక కార్పొరేషన్లు ప్రస్తుతం ఆర్థిక భారంతో అల్లాడుతున్నాయి. దీనికోసం ప్రభుత్వ అనుమతితో అవి వందలాది కోట్ల రూపాయలను రుణంగా తీసుకుని మనుగడ సాగిస్తున్నాయి. కొన్ని సంస్థల అప్పులు ఏకంగా వేల కోట్లలోనే ఉండడంతో రానున్న కాలంలో వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఈ అప్పుల భారంలో అసలు కన్నా వడ్డీ భారమే మరింత వేధిస్తు న్నట్లు అధికారులు చెబుతున్నారు. కొన్ని బ్యాంకుల్లో తీసు కున్న రుణంపై 12 శాతం వరకు వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. దీంతో ఈ వడ్డీ మొత్తమే వంద కోట్లలో ఉంటున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే బ్యాంకులతో మాట్లాడి వడ్డీ భారాన్ని తగ్గించేలా చర్యలు చేపట్టడం, ఇంకొన్ని సంస్థల అప్పులను తామే స్వీకరించి బ్యాంకులకు చెల్లించేలా ఆలోచన చేయడంపై ఆర్థిక శాఖ దృష్టి సారిస్తోంది. ఒకవేళ సంస్థల అప్పు మొత్తాన్ని తామే బ్యాంకులకు చెల్లిస్తే.. తరువాత క్రమంలో సంస్థల నుంచి రాబట్టుకునే ఆలోచన కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ రెండు పద్ధతుల్లో దేన్ని, ఎలా అమలు చేయాలన్న కోణంలో ఆర్థిక శాఖ అధ్యయనం చేస్తోంది.ఇప్పటికే ఆర్టీసీకి ఏడు బ్యాంకుల్లో ఉన్న అప్పులపై దృష్టి సారించిన ఆర్థిక శాఖ వాటితో చర్చించి 10.2 నుంచి 12.05 శాతం వరకు ఉన్న వడ్డీని 8.4 నుంచి 9 శాతానికి తగ్గించేలా ఒప్పించింది. దీనివల్ల ఏకంగా రూ.46.11 కోట్లు ఆదా అయినట్లు అధికారులు వెల్లడించారు. మరో రూ.800 కోట్ల రూపాయల వరకు అప్పులింకా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. దీనిపై కూడా త్వరలో నిర్ణయం తీసుకో వాలని ఆర్థిక శాఖ భావిస్తోంది. కాగా పౌర సరఫరాల సంస్థ అప్పులు కూడా భారీగానే ఉన్నాయి. ఈ సంస్థకు ఏకంగా 12,650 కోట్ల రూపాయలవరకు అప్పులు స్టేట్ బ్యాంక్‌లో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఇది కూడా 11.01 శాతం వడ్డీతో ఉన్నట్లు గుర్తించారు. దీనిపై వడ్డీని తగ్గించేం దుకు బ్యాంకులతో మాట్లాడితే కనీసం ఏటా రూ.340 కోట్లు వరకు ఆదా అవుతుందని అంచనా వేస్తున్నారు. ఇటువంటి పరిస్థితిలోనే ఉన్న ఇతర సంస్థల వివరాలను కూడా ఆర్థిక శాఖ ఆరా తీస్తోంది. దీనికోసం ఏయే శాఖల్లో ఎంత అప్పులున్నాయి, అవి ఏయే బ్యాంకుల నుంచి తీసుకున్నారు, చెల్లిస్తున్న వడ్డీ ఎంత వంటి వివరాలను చెప్పాలని అన్ని కార్పొరేషన్లకు లేఖలు రాసారు. దీనికోసం ప్రత్యేకంగా ఒక ప్రొఫార్మాను కూడా తయారు చేసి ఆయా కార్పొరేషన్లకు పంపించారు.

బదిలీ అయినా... పాత బడిలోనే

- 3 వేల మంది ఉపాధ్యాయులకు ఇంకా అందని రిలీవ్ ఆర్డర్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'ఉన్న బడి నాది కాదు.. వెళ్లే బడికి ఉత్తర్వులు రాలేదు. వేడుకలు జరిపి విద్యార్థులు వీడుకోలు చెప్పారు. మళ్లీ మళ్లీ అదే బడికి వెళ్లలేను'. కౌన్సిలింగ్‌లో బదిలీ అయి రిలీవ్‌కాని ఉపాధ్యాయుల పరిస్థితి ఇది. బదిలీలు ముగిసి మూడు వారాలు గడచినా ఇంకా కొంతమంది ఉపాధ్యాయులకు బదిలీల ఆర్డర్లు అందలేదు. మొత్తం రాష్ట్రవ్యాప్తంగా 1.5లక్షల మంది ఉపాధ్యాయులు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. జులై మొత్తం ఉపాధ్యాయుల బదిలీల కౌన్సిలింగ్‌తో ముగిసిపోయింది. జులై 30న రిలీవ్ ఆర్డర్లు తీసుకుని, ఈ నెల 2న కొత్త పాఠశాలలో ఉపాధ్యాయులు చేరాల్సి ఉంది. అయినా ఇప్పటివరకు రిలీవ్ ఆర్డర్లు ఉపాధ్యాయుల చేతికి అందలేదు. కౌన్సెలింగ్ ముగిసిన తరువాత బదిలీల ఆర్డర్లను ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్నారు. రిలీవ్ ఎప్పుడు అవ్వాలో ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులకు సమాచారం అందిస్తారు. డిఈవో రిలీవ్ ఆర్డర్లు ఇచ్చిన తరువాత, ఎంఈవో, పాఠశాల ప్రధానోపాధ్యాయుని వద్దకు వెళ్ళి కొత్త పాఠశాలలో చేరాల్సి ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3వేల మంది ఉపాధ్యాయులకు రిలీవింగ్ ఆర్డర్లు అందాలి. ఇప్పటికీ జిల్లా విద్యాశాఖ అధికారులు వారిని పూల్‌లోనే ఉంచారు. వీరే కాకుండా అప్పీళ్లు పెట్టుకున్నవారిలో కొంతమందికి కొత్త చోట పోస్టింగ్ లేకపోవడం, ఏజెన్సీ ప్రాంతం నుంచి మైదాన ప్రాంతం కోరుకున్న వారు కూడా ఉన్నారు. అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయులు వారు కోరుకున్న పాఠశాలకు వచ్చి వెయిటింగ్ చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో ఉపాధ్యాయుల రిలీవ్ ఆర్డర్లు ఆగిపోయాయి. నంద్యాల ఉప ఎన్నిక నేపథ్యంతో ఆ జిల్లా విద్యాశాఖాధికారి మొత్తం పూల్‌లో ఉంచారు. నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో ఉపాధ్యాయ కౌన్సెలింగ్ ఆలస్యంగా జరిగింది. ఈ రెండు జిల్లాల కౌన్సెలింగ్ కూడా ముగిసింది. ఇక ఈ జిల్లాల ఉపాధ్యాయులు కూడా రిలీవ్ ఆర్డర్లను తీసుకోవాల్సి ఉంది. రిలీవ్ ఆర్డర్లను వెంటనే ఇస్తే కొత్త పాఠశాలలో విధులు నిర్వహిస్తామని ఉపాధ్యాయులు చెప్తున్నారు.

పార్టీ మారే ఆలోచనే లేదు

- టిడిపిలో చేరుతున్నట్టు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదు
- వైద్యఆరోగ్య శాఖ మంత్రి కామినేని వివరణ



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తనకు పార్టీ మారే ఆలోచనే లేదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీలో చేరుతున్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని, జీవితాంతం బిజెపిలోనే కొనసాగుతానన్నారు. సచివాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రిస్థాయికి ఎదగడానికి వెంకయ్య నాయుడు ఎంతో ప్రోత్సహించారన్నారు. తన గెలుపుకోసం టిడిపితో పాటు పవన్ కల్యాణ్ కూడా కృషి చేశారన్నారు. 108 సేవలకు సంబంధించి కోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వచ్చిందన్నారు. 108లో రోగిని ఆసుపత్రికి తీసుకెళ్లే లోపు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా కొత్తగా యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. సమావేశంలో ఆయనతో సాంఘిక సంక్షేమశాఖ మంత్రి నక్కా ఆనంద్‌బాబు పాల్గొన్నారు.

26న ఉపరాష్ట్రపతికి పౌర సన్మానం

ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు ఈ నెల 26న వెలగపూడి సచివాలయం వద్ద రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పౌర సన్మానం చేయనున్నట్లు మంత్రి కామినేని తెలిపారు. సచివాలయం వద్ద ఇళ్ల పథకం పైలాన్‌ను ఆవిష్కరిస్తారని, అనంతరం ఆయన్ని రాష్ట్ర ప్రభుత్వం సన్మానిస్తుందన్నారు. అక్కడినుండి తెనాలి వెళ్లి ఆలపాటి వెంకట్రామయ్య శతజయంతి ఉత్సవాల్లో పాల్గొంటారన్నారు. సాయంత్రం గన్నవరం వద్ద ఆత్కూరులో స్వర్ణభారతి ట్రస్ట్‌లో బస చేస్తారన్నారు. ఆదివారం ఉదయం అక్కడ ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తారు.



టంగుటూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సిఎం

నవ్యాంధ్ర అభివృద్ధిలో అంతా భాగస్వాములు కావాలి

ఆంధ్రకేసరి జయంతి వేడుకలో సిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చరిత్రలో నిలిచిపోయేది కొందరేనని, అలాంటి వ్యక్తుల్లో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఒకరని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఆంధ్రకేసరి 146వ జయంతి సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం సమీపాన ప్రకాశం పంతులు విగ్రహానికి సిఎం బుధవారం పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఆంధ్రకేసరి స్ఫూర్తితో నవ్యాంధ్ర అభివృద్ధిలో అంతా భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. సైమన్ గో బ్యాక్ ఉద్యమంలో ప్రకాశం పంతులు బ్రిటీష్ వారికి ఎదురొడ్డి నిలబడ్డారని, చరిత్ర ఉన్నంత వరకూ ఆయన పేరు ఉంటుందని అన్నారు. రాష్ట్రంలో కష్టాలున్నాయని, రాబోయే తరాల భవిష్యత్తును అద్భుతంగా తీర్చిదిద్దేందుకు రాత్రీపగలు పనిచే స్తానని తెలిపారు. పట్టిసీమ లేకపోతే కృష్ణా జిల్లా కరువుతో అల్లాడేదని వ్యాఖ్యానించారు. నిరుద్యోగ భృతి, ఉపాధి శిక్షణ త్వరలోనే అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, నగర మేయర్ కోనేరు శ్రీధర్, కృష్ణా జిల్లా కలెక్టర్ బి లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల నుంచి విద్యార్థులు

ముఖ్యమంత్రి కార్యక్రమానికి చైతన్య, నారాయణ పాఠశాలల నుంచి విద్యార్థులను తీసుకొచ్చారు. దాదాపు పది పాఠశాలల బస్సుల్లో విద్యార్థులను కార్యక్రమం వద్దకు చేర్చారు. టంగుటూరి విగ్రహం వద్ద కనీసం టెంటు కూడా వేయకపోవడంతో విద్యార్థులు రోడ్డుపైనే, ఎండలో నిల్చుని సిఎం ప్రసంగాన్ని విన్నారు. పాఠశాల ఉన్న సమయంలో విద్యార్థులను సిఎం కార్యక్రమానికి తీసుకురావడం పట్ల తల్లిదండ్రుల నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి.

ఉపాధి నిధుల్ని మళ్లించొద్దు

సిఎస్ దినేష్ కుమార్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధి పథకం నిధుల్ని ఇతర అవసరాలకు వినియోగిస్తే ఎంత మాత్రం సహించేది లేదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ కలెక్టర్లకు స్పష్టం చేశారు. ఇప్పటికే ఇతర అవసరాలకు వినియోగిస్తే ఆ మొత్తాన్ని వెనక్కి తీసుకోవాలని ఆదేశించారు. సచివాలయం నుంచి బుధవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల వారీగా చేపట్టిన పనులపై అంతర్గత తనిఖీ నిర్వహించి వచ్చే నెల 10లోగా నివేదికలు సమర్పించాలన్నారు. సామాజిక తనిఖీలో ఉపాధి నిధులు దుర్వినియోగమైనట్లు తేలితే బాధ్యులపై తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. బెల్టు షాపుల్ని తొలగిస్తున్నట్టుగానే ఇసుక మాఫియాను కూడా అరికట్టాలన్నారు. ప్రతి ఇసుక రీచ్‌లో ఒక అధికారిని నియమించాలని, ఫిర్యాదులపై సకాలంలో చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించి ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించామన్నారు. ఎన్టీఆర్ గ్రామీణ గృహనిర్మాణ పథకం లబ్ధిదారుల జాబితాను వచ్చే నెల 15 నాటికి సిద్ధం చేయాలన్నారు. ఎన్టీఆర్ జలసిరి ఫేజ్ 2లో ఏర్పాటు చేసిన 17వేల బోర్లకు విద్యుత్తు కనెక్షన్ల కోసం నిధులు విడుదల చేశామన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల తాగునీటికి ఇబ్బంది ఏర్పడిన చిత్తూరు, ప్రకాశం, కడప తదితర జిల్లాల్లో 2,180 ఆవాసాలకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నామని, అందుకు సంబంధించి నిధులు వినియోగంపై యుసిలను వెంటనే సమర్పించాలన్నారు. ఐటిడిఎల్లో తాగునీరు, రహదారులు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు 700 పనులు మంజూరు చేశామని, వీటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.సాంబశివరావు, ముఖ్య కార్యదర్శులు అనంతరాము, సుమిత్రా దావ్రా, కె.ఎస్ జవహర్‌రెడ్డి, గనుల శాఖ కార్యదర్శి బి.శ్రీధర్, కమిషనర్లు రామాంజనేయులు, లక్ష్మీ నర్సింహ, సుజాతశర్మ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు ప్రతిభా అవార్డులు



డిజిపి నుంచి మొదటి బహుమతి అందుకుంటున్న గుంటూరు రూరల్ ఎస్పీ నారాయణ్ నాయక్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా కీలక కేసుల ఛేదనలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసులకు డిజిపి ఎన్ సాంబశివరావు బుధవారం మంగళగిరి పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ప్రతిభ అవార్డులు అందజేశారు. మూడు నెలలకోసారి జరిగే శాంతి భద్రతల సమీక్ష సహ డిజిపి ఈ బహుమతులను అందజేశారు. రాష్ట్రంలో మరింత మెరుగైన పోలీసింగ్ కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన గుంటూరు జిల్లా భట్టిప్రోలు బాలిక అపహరణ కేసు దర్యాప్తులో ప్రతిభ చూపిన ఆ జిల్లా రూరల్ ఎస్పీ నారాయణ నాయక్‌తో పాటు డిఎస్పీ పి మహేష్ బృందానికి మొదటి బహుమతిని ఈ సందర్భంగా డిజిపి అందజేశారు. విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో కరెంట్ లైన్‌మెన్‌గా చెప్పుకుంటూ ఒంటరి మహిళల ఇళ్లకు వెళ్లి బంగారాన్ని కాజేస్తున్న యళ్లమల్లి కిషోర్ అనే నేరగాణ్ని హెల్మెట్ సహాయంతో అరెస్ట్ చేసిన పర్వాడ సిఐ పైడపు నాయుడు, ఎస్‌ఐలు ఎస్‌కె షరీఫ్, పి రవికుమార్ బృందానికి రెండో బహుమతి ఇచ్చారు. విశాఖపట్నం, కశింకోట మండలం కన్నూరుపాలెంలో ఓ మహిళ అనుమానాస్పద మృతి కేసును పరిశోధించిన అనకాపల్లి రూరల్ సిఐ రామచంద్రరావు బృందానికి, విజయవాడ కమిషనరేట్ పరిధిలోని కంకిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన గృహిణి శ్రీదేవి హత్య కేసును ఛేదించిన క్రైమ్ ఎసిపి పోతురాజు, ఎస్‌ఐలు టివివి రామారావు, చిట్టిబాబు బృందానికి మూడో బహుమతి లభించాయి.

సమీక్షా సమావేశంలో లా అండ్ ఆర్డర్ అడిషనల్ డిజి హరీష్ కుమార్ గుప్తా, సిఐడి అడిషనల్ డిజి ద్వారకాతిరుమలరావు, ఆక్టోపస్ అడిషనల్ డిజి సురేంద్రబాబు తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

చట్ట సభల మాజీ సభ్యులకు ఉమ్మడి సేవలు కొనసాగించాలి

మాజీ ఎమ్మెల్యే సుబ్బరాజు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర విభజన చట్ట ప్రకారం పదేళ్లపాటు హైదరాబాద్ ఉమ్మడి రాజధాని. అందువల్ల ఉమ్మడి రాష్ట్ర మాజీ శాసనసభ, మండలి సభ్యులకు మరి కొంత కాలం సేవలను కొనసాగించాలని ఎపి ఫార్మర్ లెజిస్లేటర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కె సుబ్బరాజు ఉభయ రాష్ట్రాల ముఖ్యమంత్రులకూ బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఎపి మాజీ ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాలకు అనుమతించడం లేదన్నారు. నెలవారీ మందుల సరఫరానూ హైదరాబాద్‌లో నిలిపి వేశారని తెలిపారు. సభ్యుల్లో చాలా మంది సీనియర్ సిటిజన్లే కావడం దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్ర మాజీ సభ్యులను రెండు రాష్ట్రాల ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణానికి అనుమతించడం సహా, విజయవాడలో నెలవారీ మందుల సరఫరాకు ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలని కోరారు. హైదరాబాద్‌లో స్థిర నివాసం ఏర్పరచుకున్న సభ్యులకు తెలంగాణ సభ్యులతో పాటు కొంతకాలం అక్కడే మందుల పంపిణీకి చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రులిద్దర్నీ కోరారు. ఉభయ రాష్ట్రాల సభ్యులకు ఢిల్లీలోని ఎపి, తెలంగాణ భవన్‌లలో ప్రవేశానికి కేటగిరీ-2 లేదా 3గా పరిగణిస్తూ ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఇళ్ల స్థలాల విషయంలోనూ ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హామీ ఇచ్చిన విధంగా కేటాయింపులు చేపట్టాలన్నారు. కర్ణాటకంలో అమలులో ఉన్న విధంగా పెన్షన్, మెడికల్ అలవెన్సులు, రైలు ప్రయాణ సౌకర్యాలను కల్పించాలని సిఎంలకు, స్పీకర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఒక వినతి పత్రాన్ని కూడా హైదరాబాద్‌లోని ఉన్నతాధికారుకు అందజేశామన్నారు.

ప్ర'గతి'లేని పర్యాటకం



- ఉన్న భూములకే దిక్కులేదు...
- కొత్తగా భూసేకరణెందుకో
- స్పష్టత లేని రికార్డులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రస్తుతం ఉన్న భూమిలో చేపట్టిన పర్యాటక ప్రాజెక్టుల అభివృద్ధిలో ప్రగతి లేకున్నా, మళ్లీ తాజాగా భూ సమీకరణ చేపట్టేందుకు పర్యాటక శాఖ సిద్ధమవుతోంది. భవిష్యత్తు అవసరాల కోసం భూ సమీకరణ చేపట్టాలని ఆ శాఖ నిర్ణయించింది. పర్యాటక రంగాన్ని బలోపేతం చేసేందుకు ఏఏ ప్రాంతాల్లో భూములు అవసరమవుతాయన్న విషయాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పర్యాటక శాఖ ఉన్నతాధికారులు ఇప్పటికే ఆదేశించారు. ఆయా జిల్లాల్లో ఏ మేరకు భూములున్నాయి? ఏఏ దశల్లో ఉన్నాయి? వంటి అంశాలపై స్పష్టత తీసుకురావాలని సూచించారు. రెవెన్యూ రికార్డులకు ఏ మాత్రం తీసిపోని విధంగా పర్యాటక ఆస్తుల వివరాల కంప్యూటరీకరణ చేపట్టనున్నారు. విలువైన భూముల్ని ఖాళీగా ఉంచటం సరికాదని, పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాల్సిన అవసరముందని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఆగస్టు 20 నాటికి భూ రికార్డుల వివరాలపై స్పష్టత తేవాలని సూచించారు. అయితే ఉన్నతాధికారులు నిర్దేశించిన గడువు పూర్తయినా పర్యాటక శాఖలో ప్రస్తుతమున్న భూమి, కావాల్సిన భూమి వివరాలపై ఇంకా స్పష్టత రాలేదు. స్పష్టత వచ్చేందుకు మరింత సమయం పట్టే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం పర్యాటక శాఖకు కావాల్సినంత భూమి ఉన్న ప్రాంతాల్లో అభివృద్ధి మాత్రం కనిపించడం లేదు. ఆంధ్ర భద్రాచలంగా పిలిచే కడప జిల్లాలోని ఒంటిమిట్టలో ఉన్న భూమిలో పర్యాటక ప్రాజెక్టుల అభివృద్ధి కోసం రూ.45 కోట్లు, చెరువు కట్ట సుందరీకరణకు మరో రూ.46 లక్షలు కేటాయించినా అభివృద్ధి మాత్రం హామీలకే పరిమితమయ్యింది. అదే జిల్లాలోని గండి కోట ప్రాజెక్టు తీరు అదేమాదిరిగా ఉంది. అవసరమైనంత భూమి ఉన్నా తూర్పుగోదావరి జిల్లాలోని అఖండ గోదావరి ప్రాజెక్టు నత్తనడకన సాగుతోంది. రాజమహేంద్రవరంలోని పిచ్చుకలంకను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడంలో టూరిజం శాఖ విఫలమైంది. అంతర్వేది, అన్నవరం, ద్రాక్షారామం, కోటిపల్లి రేవు, మామిడికుదురు మండలం బౌద్ధారామాలు, అడ్డతీగల మండలంలోని పింజరకొండ జలపాతాలు, చింతూరు, మారేడుమిల్లి మధ్యలోని సోకులేరు, పాములేరు ప్రాంతాల్లో అవసరమైన మేర భూమి ఉన్నా పర్యాటకంగా తీర్చిదిద్దలేకపోతున్నారు. అనంతపురం జిల్లా అలనాటి కృష్ణదేవరాయల పాలనకు గుర్తులుగా ఉన్న పెనుగొండ, గుత్తి కోట, లేపాక్షిల్లో ఉన్న భూముల్లోనూ పర్యాటక ప్రగతి కనిపించడం లేదు. పశ్చిమ గోదావరి జిల్లాలోని కొల్లేరు సరస్సుకు సరైన స్థాయిలో నిధులను కేటాయించకపోవడం వల్ల భూములున్నా పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాలను అధికారులు కల్పించలేకపోతున్నారు. జిల్లాలోని గుంటపల్లి బౌద్ధ గుహలు, పేరుపాలెం బీచ్‌ల పరిస్థితి కూడా అదే విధంగా ఉంది. భూమి ఉన్న ప్రాంతాల్లోనే సరైన స్థాయిలో అభివృద్ధి చేయలేనప్పుడు, కొత్తగా భూమిని సేకరించడం వల్ల ప్రయోజనమేముందన్న విమర్శలొస్తున్నాయి.

కార్పొరేటుకు దీటుగా సెక్రటేరియట్

- అన్ని సదుపాయాలూ ఒకే చోట
- ఇళ్ల నుంచే అధికారులు పని చేసేలా ఉండాలి
- ఫోస్టర్స్ ప్లానుపై అభిప్రాయ సేకరణ
- సిఆర్డీఎ సమీక్షలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కార్పొరేట్ కార్యాలయాలకు ధీటుగా సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయాలను నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. సిఆర్డీఎపై తన నివాసంలో బుధవారం సమీక్షించారు. వివిధ శాఖల కార్యదర్శులు, శాఖాధిపతుల కార్యాలయాలు ఇప్పటిలా వేర్వేరుగా కాకుండా అన్నీ ఒకే ప్రాంతంలో ఉండాలన్న సిఎం సూచనలకనుగుణంగా ఫోస్టర్స్ అండ్ పార్టనర్స్ ప్రతినిధులు సిఎంకు నివేదిక సమర్పించారు. కొత్తగా నిర్మించే కార్యాలయాలు ఇప్పటి వరకు ఉన్న సంప్రదాయ ప్రభుత్వ కార్యాలయాలకు భిన్నంగా ఉండాలని, సిబ్బందితో పాటు పని కోసం వచ్చిన ప్రజలకు కూడా ఉత్సాహం, ఉత్తేజం కల్పించాలని సిఎం సూచించారు. వినోద, ఆహ్లాద, క్రీడా సదుపాయాలతో భవంతులు నిర్మించాలన్నారు. ఫోస్టర్ బృందం నివేదికలపై త్వరలో ఒక కార్యగోష్టి నిర్వహించి కార్యదర్శులు, మంత్రుల అభిప్రాయాల్ని సేకరించాలని, వాటికనుగుణంగా తుది ఆకృతుల్ని సిద్ధం చేయాలన్నారు. ఉద్యోగులు, అధికార యంత్రాంగంలో సృజనను వెలికి తీసేందుకు వీలుగా, చక్కటి పని వాతావరణాన్ని కలిగించేలా కార్యాలయాలు ఉండాలని, అలసట, ఒత్తిడి కనిపించని విధంగా సకల సదుపాయాలు కల్పించాలని సూచించారు. పరిపాలన సాగించే సచివాలయంగానే కాకుండా ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలకు, పరస్పర సంభాషణలకు వేదికగా నిలవాలన్నారు. అధికారులు అవసరమైతే ఇంటి నుంచే ఫైళ్లను క్లియర్ చేయొచ్చని, అందుకు తగ్గట్టుగా అత్యాధునిక సాంకేతిక విధానాలను అందిపుచ్చుకోవాలని సిఎం సూచించారు.

వేర్వేరుగా నిధుల్ని ఖర్చు చేయండి

బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి ఉదయలక్ష్మి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ పరిధిలోని బిసి కార్పొరేషన్, ఫెడరేషన్‌లకు కేటాయించిన నిధుల్ని కలిపి కాకుండా వేర్వేరుగా ఖర్చు పెట్టాలని బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి బి ఉదయలక్ష్మి ఆ శాఖ అధికారులకు సూచించారు. బిసి కార్పొరేషన్ ఆరవ పాలకమండలి సమావేశాన్ని బుధవారం విజయవాడలోని ఒక ప్రైవేటు హోటల్‌లో నిర్వహించారు. కార్పొరేషన్ రుణాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ వంటి పలు అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు. నిబంధనల మేరకు ప్రతి మూడు నెలలకోసారి పాలక మండలి సమావేశం జరగాల్సి ఉన్నా, అలా జరగడం లేదని కార్పొరేషన్ డైరెక్టర్లు ఆమె దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిసింది. పాలక మండలి సమావేశాల సమాచారం కానీ, రుణాల కోసం జరుగుతున్న ఇంటర్వ్యూల సమాచారం కానీ తమకు తెలిపడం లేదని, లబ్ధిదారుల ఎంపిక విషయం ఆయా జిల్లాల ఇడిల ప్రమేయం లేకుండా కార్పొరేషన్ నుంచి నేరుగా మండల అధికారుల స్థాయిలోనే జరిగిపోతున్నాయని వారు పేర్కొన్నట్లు సమాచారం. దీనిపై స్పందించిన ఆమె ఇక నుంచి అలా జరక్కుండా చూడాలని, ప్రతి సమాచారాన్ని డైరెక్టర్లకు అందించాలని అధికారులకు సూచించినట్లు సమాచారం. కార్పొరేషన్‌లో ఆగస్టు 15 లోపల లబ్ధిదారుల ఎంపిక, ఇంటర్వ్యూలు జరగాల్సి ఉన్నా ఇంత వరకు ఎందుకు జరపలేదని అధికారులను నిలదీసినట్టు తెలిసింది. గతంలో లబ్ధిదారుల ఎంపిక గ్రామాల వారీగా ఉండేదని, ఈ పద్ధతి ద్వారా బిసిలందరికీ న్యాయం జరిగేదని, ఈ విధానాన్ని అమలు చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించినట్టు తెలిసింది. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్ పి రంగనాయకులు, బిసి సంక్షేమ శాఖ డైరెక్టర్ హర్షవర్ధన్, 13 జిల్లాల ఇడిలు, కార్పొరేషన్ డైరెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి

సిటీ

ప్రతి అక్షరం ప్రజల పక్షం

fb/prajasakti | Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu | www.prajasakti.com

సంపుటి : 37 సంచిక : 234 | విజయవాడ, గురువారం 24 ఆగస్టు 2017 | 12 + 12 పేజీలు వెల : 4.00



ఉత్తరప్రదేశ్‌లోని ఔరారియా సమీపంలో పట్టాలు తప్పిన కైఫియత్ ఎక్స్‌ప్రెస్ రైలు

యుపిలో 5 రోజుల్లో

మరో రైలు ప్రమాదం

100 మందికి గాయాలు



సురేష్ ప్రభు రాజీడ్రామా

వార్త 8లో

వైదొలిగిన రైల్వే బోర్డు ఛైర్మన్

ఎయిరిండియా ఛైర్మన్‌కు బాధ్యతలు

ఓటెత్తిన నంద్యాల

79.2 శాతం పోలింగ్ | **28**న ఓట్ల లెక్కింపు

రెండు దశాబ్దాల్లో ఇదే అత్యధిక పోలింగ్

విజయావకాశాలపై ఎవరి ధీమా వారిదే

- శిల్పా, భూమా కుటుంబాల మధ్య స్వల్ప ఘర్షణ
- జగన్మోహన్ రెడ్డిపై ఇసి కేసు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో, నంద్యాల

నంద్యాల ఉప ఎన్నికలో ఓటర్లు పోటెత్తారు. రెండు దశాబ్దాల్లో రాష్ట్రంలో ఎప్పుడూ నమోదు కాని విధంగా 79.20 శాతం ఓట్లు పోలయ్యాయి. గోస్పాడు మండలంలో 90.08 శాతం పోలింగు నమోదయ్యింది. మొత్తం 2.19 లక్షల ఓట్లకుగాను 1,73,335 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా భారీపోలింగు నమోదవడంతో ఎవరి అంచనాల్లో వారున్నారు. అత్యధిక ఓటింగు వల్ల తమకే లాభమని అధికార పార్టీ చెబుతుండగా, మహిళలు ఎక్కువమంది రావడం తమకు లాభిస్తుందని ప్రతిపక్షం చెబుతోంది. 28న జరిగే కౌంటింగ్‌లో ఎవరి భవిష్యత్ ఏమిటో తేలనుంది. 14 రౌండ్లలో జరిగే ఈ కౌంటింగ్‌లో మిగతా 9లో



నంద్యాలలో ఓటు వేయడానికి భారీ సంఖ్యలో బారులు తీరిన ఓటర్లు

త్వరలో కొత్త 200 నోటు



8

క్యాంపుల జోరు



తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధితో సమావేశమైన ఎండిఎంకె నేత వైగో వార్త 9లో

- పుదుచ్చేరి నుంచి బెంగళూరుకు మారనున్న తిరుగుబాటు ఎమ్మెల్యేల శిబిరం
- ప్రభుత్వంతో కలవాలంటూ అన్నాడిఎంకె కార్యకర్తల నినాదాలు
- తాజా పరిణామాలపై నోరుమెదపని గవర్నర్
- కరుణానిధితో వైగో భేటీ

చెన్నై: అన్నాడిఎంకెలో ప్రస్తుతం తిరుగుబాటు గ్రూపుగా ఉన్న దినకరన్ అనుచర ఎమ్మెల్యేలకు బుధవారం అన్నాడిఎంకె కార్యకర్తల నుంచి నిరసన సెగ తగిలింది.. 'ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంటున్నాం' అంటూ తిరుగుబాటు బావుటా ఎగరేసిన దినకరన్ గ్రూపు ఎమ్మెల్యేలు పుదిచ్చేరి తీరంలోని విండ్ ఫ్లవర్ రిసార్ట్‌లో ఉన్నారు. పళనిస్వామి ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన 19మంది శాసన షభ్యులపై నిరసన వ్యక్తం చేస్తూ అధికారపక్షానికి చెందిన మాజీ యంయల్ఎ ఓంశక్తి శేఖర్ నేతృత్వంలో అక్కడకు చేరుకున్న ప్రభుత్వ మద్దతుదారులు దినకరన్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఇపిఎస్- ఒపిఎస్ నేతృత్వంలోని ప్రభుత్వంతో తిరుగుబాటు ఎమ్మెల్యేలు కూడా కలిసిరావాలని డిమాండ్ చేశారు. అన్నాడిఎంకె డిప్యూటీ కార్యదర్శి టిటివి దినకరన్ నేతృత్వంలో 19 మంది ఎమ్మెల్యేలు ఈ రిసార్ట్‌లో ఉండగా, ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే ఓం శక్తి శేఖర్ నేతృత్వంలో ఈ నిరసనలు జరిగాయి. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ రిసార్ట్‌లోని పలువురు ఎమ్మెల్యేలు తనతో టచ్‌లో ఉన్నారని, దినకరన్ వారిని రిసార్ట్‌లో బంధించాడని చెప్పాడు. వారు త్వరలోనే దినకరన్ శిబిరం నుంచి చెన్నై వస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశాడు. దినకరన్ డబ్బుతో యంయల్ఎలను ప్రలోభాలకు గురిచేస్తున్నాడని, అన్నాడిఎంకెను విచ్ఛిన్నం చేయడానికి పుదుచ్చేరిలోని మిగతా 8లో



కొత్త కార్యాలయాలు ప్రారంభించనున్న విశాఖలోని టెక్ మహేంద్ర ఐటి ప్రాంగణం

నేడు విశాఖలో 8 ఐటి కంపెనీల ప్రారంభం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖపట్నంలోని సైబర్ టవర్స్‌లో నూతనంగా నెలకొల్పిన ఎనిమిది ఐటి కంపెనీలను ఐటి శాఖా మంత్రి నారా లోకేశ్ గురువారం ప్రారంభించనున్నారు. వీటితో పాటు విశాఖలోని పలు కార్యక్రమాల్లో లోకేశ్ పాల్గొనున్నట్లు ఆయన కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. లోకేష్ ప్రారంభించనున్న ఐటి కంపెనీల్లో అపెక్స్, ఇన్వెన్‌ట్రాక్స్, జీవ, ఐడిఎ, వెంచుర్ ఆఫ్‌షోర్, విజిఎస్, విస్మయ, ఆమ్‌జుర్ తదితర కంపెనీలు ఉన్నాయి.

నిగ్గుతేలిన నిజం

లావలిన్ కేసులో పినరయి విజయన్ నిర్దోషి

సిబిఐ తీర్పును సమర్థించిన హైకోర్టు

ప్రతీకారంతోనే విజయన్‌పై ఆరోపణలు



తిరువనంతపురం: కేరళలో 90వ దశకంలో సంచలనం సృష్టించిన 'ఎస్ఎన్‌సి లావాలిన్' అవినీతి కేసులో ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను నిర్దోషి అని తేలింది. ఈ కేసులో విజయన్‌ను నిర్దోషిగా పేర్కొంటూ తిరువనంతపురంలోని సిబిఐ ప్రత్యేక కోర్టు 2013లో ఇచ్చిన తీర్పును హైకోర్టు సమర్థించింది. దీంతో ఇరవై ఏళ్ల నాటి ఈ కేసు నుంచి విజయన్‌కు బుధవారం విముక్తి లభించింది. మరోవైపు 'ఎస్ఎన్‌సి-లావాలిన్' కేసులో విజయన్‌తో పాటు ఆరోపణలు ఎదుర్కొన్న ఐదుగురు కేరళ విద్యుత్తు బోర్డు అధికారుల్లో ఇద్దరిని నిర్దోషులగా పేర్కొంటూ సిబిఐ ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పును కూడా హైకోర్టు సమర్థించింది. మిగిలిన ముగ్గురు అధికారులు పునర్విచారణ ఎదుర్కోవాలని పేర్కొంది. ఈ మేరకు రివిజన్ పిటిషన్ వేసేందుకు సిబిఐకి అనుమతించింది. 1996-98 మధ్యలో కేరళ విద్యుత్తు శాఖ మంత్రిగా పినరయి విజయన్ బాధ్యతలు నిర్వర్తించారు. అయితే 1997లో ప్రభుత్వ అనుమతి లేకుండానే విజయన్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ 'ఎస్ఎన్‌సి-లావాలిన్' అనే కెనడా కంపెనీకి చట్టవిరుద్ధంగా విద్యుత్తు సరఫరా బాధ్యతలు అప్పగించిందని, తద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.266 కోట్లు గండికొట్టిందని సిబిఐ ఆరోపించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. అయితే ఈ కేసులో విజయన్‌కు వ్యతిరేకంగా మిగతా 9లో

ఐఏఎస్‌ల మెడపై ఫిట్‌నెస్ కత్తి

- సీనియర్ల పనితీరుపై అధ్యయనం
- కేంద్ర మార్గదర్శకాలతో కసరత్తు
- రాష్ట్రంలో సిఎస్ అధ్యక్షతన కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

చాలామంది ఐఏఎస్ అధికారులు సక్రమంగా పని చేయడంలో ఫిట్‌నెస్ సమస్యను ఎదుర్కొంటున్నారా? వారు కనీస పదోన్నతులకూ పనికిరాని విధంగా ఉన్నారా..? కేంద్రం చేస్తున్న ఈ ఆలోచనలు గమనిస్తే... అవుననే అనిపిస్తోంది. అటువంటి వారిని గుర్తించి ముందస్తు పదవీ విరమణ ద్వారా ఇంటికి పంపించే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా 15 ఏళ్ల సర్వీసు, లేదా ఏభై ఏళ్ల వయసు దాటిన వారి పని తీరును సమీక్షించనున్నారు. ఇందుకు గతంలోనే ఉన్న మార్గదర్శకాలను బయటకు తీస్తున్నారు. అన్ని రాష్ట్రాల్లో ఐఏఎస్ అధికారుల పనితీరుపై



అధ్యయనం చేసేందుకు నిర్ణయించారు. ఈమేరకు సర్క్యులర్ కూడా జారీ అయింది. ఇందులో భాగంగా ఎపిలో కూడా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ అధ్యక్షతన, రెవెన్యూ (ఆదాయశాఖల) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాంబశివరావు, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి కరికల్ వలవన్, సాధారణ పరిపాలన శాఖ రాజకీయ విభాగం కార్యదర్శిలతో ఒక కమిటీని బుధవారం ప్రకటించారు. ఈ కమిటీలో కేరళ హోంశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సుబ్రతా బిస్వాల్‌కు కూడా చోటు కల్పించారు. వేరే రాష్ట్ర ఐఏఎస్ అధికారి కూడా సభ్యునిగా ఉంటే అధికారుల ఫిట్‌నెస్‌పై అధ్యయనం పారదర్శకంగా ఉంటుందని కేంద్రం భావించడమే కేరళ అధికారికి ఈ రాష్ట్ర అధ్యయన కమిటీలో స్థానం కల్పించారని ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. ఆల్ ఇండియా సర్వీసు రూల్స్-1958 ప్రకారం అఖిల భారత సర్వీసు అధికారుల పనితీరును సమీక్షిస్తారు. మంచి అధికారులుగా పేరున్న వారు దీర్ఘకాలం అదే తీరుతో ఉండలేరని, బాగా మిగతా 9లో



'కాకినాడ' ఎన్నికల్లో 'ముద్ర'గడ

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో కాపు ఉద్యమ నేత ముద్రగడ ప్రభావం ఎంతమేరకు ఉంటుందీ అనే చర్చ విస్తృతంగా సాగుతోంది. సహజంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో స్థానికాంశాలు ప్రధాన పాత్ర వహిస్తుంటాయి. కానీ కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల చర్చోపచర్చలను గమనిస్తే.. స్థానికాంశాలకు భిన్నంగా ఈ ఎన్నికలను పరిగణిస్తున్నట్లు విదితమౌతోంది. కాపులను బిసిల్లో చేర్చుతామని టిడిపి ఇచ్చిన హామీని అమలు చేయాలని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం చాలా కాలం నుంచి ఉద్యమం నిర్వహిస్తున్నారు. ఆయన చేపట్టిన 'చలో అమరావతి' పాదయాత్రను పోలీసులు దాదాపు నెలరోజులుగా అడ్డుకుంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికీ కిర్లంపూడిలో వందలాదిమంది పోలీసులను మోహరింపజేసింది. దీంతో ప్రతిరోజూ చంద్రబాబు తీరుపైన మిగతా 9లో

ప్రజాశక్తి
www.prajasakti.com

సంపాదకీయం

తలాక్ తీర్పు

మూడు సార్లు వెంట వెంటనే తలాక్ చెప్పి విడాకులిచ్చే ప్రక్రియ ఏకపక్షం, రాజ్యాంగ విరుద్ధమంటూ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన మెజార్టీ తీర్పు స్వాగతించదగినది! దేశ జనాభాలో ఎనమిది శాతానికి పైగా ఉన్న ముస్లిం మహిళలకు ఈ తీర్పుతో కొంత మేరకైనా భరోసా లభిస్తుంది. షరియత్ నిబంధనలను అడ్డగోలుగా ధిక్కరించే వారి జోరుకు కళ్లెం పడుతుంది. జీవితంలో అత్యంత ముఖ్యమైన వైవాహిక బంధాన్ని మూడు మాటలు చెప్పి ఏకపక్షంగా తెంచుకోవడం ఘోరం. ఈ ప్రక్రియలో మహిళల అభిప్రాయానికి ఇసుమంత విలువైనా లేకపోవడం, అసలు వారి మాట వినక పోవడం అత్యంత క్రూరం! ఇటీవల సెల్‌ఫోన్లు, వాట్సప్‌లు, స్కైప్‌ల ద్వారా కూడా విడాకులిచ్చేస్తున్నారంటే.. పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు! ఈ కారణం చేతనే ముస్లిం మహిళల్లో మూడుసార్లు వెంట వెంటనే తలాక్ చెప్పే పద్ధతి పట్ల తీవ్రమైన వ్యతిరేకత నెలకొంది! భారతీయ ముస్లిం మహిళా ఆందోళన్ సంస్థతో పాటు సైరాబానో, ఇష్రత్ జహాన్, గుల్షన్ పర్వీన్, ఆఫ్రీన్ రహమాన్, అతియాసబ్రీ తదితర మహిళలు సుప్రీంకోర్టును ఆశ్రయించారన్నా, వారికి ఐద్వా వంటి ప్రగతిశీల మహిళా సంఘాల మద్దతు లభించిందన్నా, ఈ విధానంలో ఉన్న క్రూరత్వమే కారణం. సుప్రీం కోర్టు తాజా తీర్పు వీరందరి సమిష్టి పోరాట ఫలితమే!

మతపరమైన భావోద్వేగాలతో కూడుకున్న సున్నితమైన అంశం కావడంతో సుప్రీం తీర్పుపై ఉత్కంఠ నెలకొంది. దీనికి తగ్గట్టుగానే ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం సైతం ఏకోన్ముఖంగా తీర్పు ఇవ్వలేకపోయింది. జస్టిస్ కురియన్, జస్టిస్ లలిత్, జస్టిస్ నారిమన్ ఇచ్చిన మెజార్టీ తీర్పులో మూడు సార్లు తలాక్ చెప్పడాన్ని రాజ్యాంగ విరుద్ధమని స్పష్టంగా ప్రకటించారు. మైనార్టీ తీర్పు ఇచ్చిన ప్రధాన న్యాయమూర్తి జెఎస్ ఖేహార్, ఎస్. అబ్దుల్ నజీర్ దీనికి భిన్నమైన గళం వినిపించారు. రాజ్యాంగంలో మతస్వేచ్ఛను పేర్కొన్న ఆర్టికల్ 25ను, న్యాయ వ్యవస్థ నిగ్రహావసరాన్ని వివరించిన ఆర్టికల్ 142ను ప్రస్తావిస్తూ, వీరు ఆరునెలల్లో చట్టం తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వానికి నిర్దేశించారు. అయితే, మెజార్టీ తీర్పు ఇచ్చిన న్యాయమూర్తులు దీనిని తోసి పుచ్చడంతో 'మూడుసార్లు వెంట వెంటనే తలాక్ చెప్పడాన్ని రద్దు చేస్తున్నాం' అంటూ ప్రధాన న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

మతం పేరుతో సాగుతున్న ఛాందస పద్ధతులను రూపు మాపడంలో కోర్టు తీర్పులు, ప్రభుత్వ చట్టాలది పరిమితమైన పాత్రే అనడానికి ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. చట్టం చేసి ఎన్నో ఏళ్లు గడిచినా సమాజంలో ఇంకా వేళ్లూనుకుని ఉన్న వరకట్న దురాచారమే దీనికి ప్రత్యక్ష ఉదాహరణ! తలాక్ రద్దుకూ ఈ గతి పట్టకూడదంటే ప్రజలను చైతన్య పరచడం అవసరం. తరతరాలుగా ఎదుర్కొంటున్న అవమానాలు, పడుతున్న బాధలతో ముస్లిం మహిళా సమాజంలో తలాక్ పట్ల వ్యతిరేకత నెలకొన్నప్పటికీ దాన్ని క్షేత్ర స్థాయికి తీసుకు వెళ్లి, ముస్లిం మహిళలను ఏకోన్ముఖం చేయగలిగే ఉద్యమం కావాలి. పొరుగున అనేక దేశాలు ఈ దారుణ కృత్యం నుండి ఎలా విముక్తి సాధించాయో వివరించాలి. మహిళల హక్కుల పట్ల సమాజంలో సానుకూల భావజాలాన్ని వ్యాపింపజేయాలి. దీనికి భిన్నంగా సాగితే, అది మరో తీవ్రమైన సమస్యకు దారి తీసే ప్రమాదం ఉంది! నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం ఈ దిశలో చిత్తశుద్ధితో కృషి చేస్తుందనుకోవడం అత్యాశే. మైనార్టీల హక్కులపై దాడి చేస్తూ, మెజార్టీ ప్రజల ఓటు బ్యాంకు కోసం వెంపర్లాడే విధానాలే ఈ సందేహాలకు కారణం. సుప్రీం కోర్టు తీర్పును ఆసరాగా తీసుకుని 'ఒకే ప్రజ.. ఒకే చట్టం' వంటి వివాదాస్పద అంశాలను మోడీ సర్కారు ముందుకు తెచ్చినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. తలాక్‌పై న్యాయ సమీక్ష జరపాలని సుప్రీంను కోరడం వెనుకా ఇటువంటి విభజన రాజకీయాలున్నాయన్న విమర్శలు ఈ సందర్భంగా ప్రస్తావనార్హం. ముస్లిం మహిళలు, మహిళా సంఘాల పోరాటంతో సుప్రీం కోర్టు ఇచ్చిన తాజా తీర్పును కూడా మోడీ ఖాతాలోకి వేయడానికి ఆయన వందిమాగాతులు చేస్తున్న ప్రయత్నాలు కూడా కేంద్ర సర్కారు చిత్తశుద్ధిని ప్రశ్నించేవే!

ఆర్థిక సరళీకరణ విధానాల కారణంగా కుటుంబ వ్యవస్థ ఛిన్నాభిన్నమౌతోంది. పెరిగిన భారం, ఒత్తిడి కారణంగా చిన్న చిన్న కారణాలతో విడాకులు తీసుకుంటున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోందని ఇటీవలి సర్వేలు పేర్కొంటున్నాయి. సమాజంలో అణగారిపోతున్న మహిళలే దీనికి సమిధలవుతున్నారు. మతాలతో సంబంధం లేకుండా నానాటికి పెరుగుతున్న ఈ తరహా ధోరణి పట్ల సామాజిక అధ్యయనకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మత దురాచారాలను తిరస్కరించడం ఎంత ముఖ్యమో, మానవ సంబంధాలను నట్టేట కలుపుతున్న ఈ తరహా విధానాలపైనా సమిష్టిగా పోరాటం చేయడం అంతే ముఖ్యం!

మహనీయుల మాట




నిన్న గడిచిపోయింది.
రేపు తెలియదు.
ఈరోజే అన్నింటికంటే విలువైనది.
- గోథె

సంస్కరణల్లో ఫస్ట్ జీవన ప్రమాణాల్లో లాస్ట్

ఇరిగినేని పుల్లారెడ్డి

ప్రపంచబ్యాంకు నిర్దేశించిన కార్పొరేట్ కంపెనీల వ్యాపారాలకు అనుకూలమైన సంస్కరణలను కేంద్ర ప్రభుత్వం సరికొత్త మార్గంలో అమలు జరుపుతోంది. సంస్కరణల అమలుపై రాష్ట్రాల మధ్య పోటీ పెట్టించింది. వ్యాపారం చేసుకోవడానికి సులభతరమైన (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) రాష్ట్రాల జాబితాలో మన రాష్ట్రం అధిక మార్కులతో మొదటిస్థానంలో నిలిచింది. దీంతో చంద్రబాబు ప్రభుత్వం తెగ మురిసిపోయింది. ప్రపంచబ్యాంకు దేశీయ నిర్దేశకుడు జునైద్ అహ్మద్, నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు అరవింద్ పనగరియాలతో కలిసి కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈ ర్యాంకులు ప్రకటించారు. 2015-16 మధ్య కాలంలో అమలుపరచిన సంస్కరణల ఆధారంగా ర్యాంకులు కేటాయించారు. ప్రపంచబ్యాంకు డిపార్టుమెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసి అండ్ ప్రమోషన్ (డిఐపిపి)లు ప్రకటించిన ర్యాంకింగ్‌లలో ఆంధ్రప్రదేశ్ 98.78 శాతం మార్కులు సాధించింది. పారదర్శకత, భూములివ్వడం, అనుమతులు, పర్యావరణం, నీరు, విద్యుత్, పన్నులు, కార్మిక నిబంధనలు, నిర్మాణ అనుమతుల అంశాలకు సంబంధించి 340 సంస్కరణలు అమలు జరిపి స్వదేశీ, విదేశీ కంపెనీలకు మంచి సేవ చేసినందుకు ఈ ర్యాంకులొచ్చాయి. గత సంవత్సరం ఈ జాబితాలో గుజరాత్ మొదటి స్థానంలో నిలిచింది.



రాజస్థాన్‌లోని బిజెపి ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థను పారిశ్రామికవేత్తల వశం చేసింది. పులిని చూసి నక్కవాతలు పెట్టుకున్నట్లు తెలుగుదేశం ప్రభుత్వం మన రాష్ట్రంలో కూడా ప్రజాపంపిణీ వ్యవస్థను పిపిపి పద్ధతిలో మార్పుచేయనుంది. దీని ద్వారా జాతీయ, అంతర్జాతీయ కంపెనీల నుండి నిత్యావసర సరుకులు కొని ప్రజలకు పంపిణీ చేస్తారట. అందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం జాతీయ, అంతర్జాతీయ బడా పెట్టుబడుదారులైన డిమార్టు, వాల్‌మార్టు, బెస్ట్‌ప్రైస్, బిగ్‌బజార్ లాంటి ఎనిమిది సంస్థల నుండి 150 రకాల బ్రాండెడ్ నిత్యావసర సరుకులు సేకరించడం ప్రారంభించింది. ఈ విధంగా గ్రామీణ మాల్స్ పేరుతో ప్రజాపంపిణీ వ్యవస్థను పెట్టుబడిదారుల చేతుల్లో పెట్టాలని చూస్తోంది.

రాష్ట్రంలో 40.47 లక్షల హెక్టార్ల సాగు భూమి వుంది. ఇందులో 17.54 లక్షల హెక్టార్లలో మాత్రమే ఇప్పటివరకు పంటలు వేశారని అంచనా. రాష్ట్ర ప్రభుత్వానికి పరిశ్రమల యజమానులపై వున్న ప్రేమ గ్రామీణ ప్రజలపై వుంటే... దాదాపు కోటి ఎకరాల పంట పొలాలకు నీరు అందించే సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేవారు. కానీ గ్రామీణ ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ సహాయ నిరాకరణ కొనసాగుతూనే వుంది. దీనికి తోడు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు వుండటం లేదు. దీంతో వ్యవసాయ ఉత్పత్తులను రోడ్లపై పడేసి నిరసన తెలుపుతున్నారు. అయినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదు. ఈ పరిస్థితుల వల్ల రాయలసీమ జిల్లాలోనే దాదాపు 15 లక్షల మంది ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్ళారు. అక్కడా ఉపాధి లేక రోడ్లపై భిక్షమెత్తుకుంటున్నారని ప్రభుత్వాన్ని భుజాలపై మోసే పత్రిక ఫోటోలతో సహా ప్రచురించింది. ఇటువంటి పరిస్థితుల్లో గ్రామాల్లో రైతుల ఆత్మహత్యలు ఏడాదికి వెయ్యి చొప్పున పెరుగుతున్నాయి. ఇంత జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం రైతుల బాగోగులు పట్టించుకోవడం లేదు. పైగా పారిశ్రామిక యజమానుల బకాయిలకు రెండు వేల కోట్ల రూపాయలను సబ్సిడీ పేరుతో వారి ఖాతాలో వేసింది.

ఇలా ప్రపంచబ్యాంకు మత్తులో మునిగి తేలుతున్న చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రంలో గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాల గురించి ఆలోచించడమే మానేసింది. దీంతో అతివృష్టి, అనావృష్టితోపాటు ఉపాధి అవకాశాలు లేక పట్టణ ప్రాంతాలకన్నా, గ్రామాల్లో మరణాల సంఖ్య పెరుగుతోందని సర్వేలు తెలియజేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయడంతో పాటు ఉపాధి అవకాశాలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలి. తెలంగాణా రాష్ట్రం కంటే మన రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో మరణాల సంఖ్య ఎక్కువగా వున్నదని కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కల విభాగం విడుదల చేసిన తాజా నివేదిక తెలిపింది. ఏపిలో మొత్తం మరణాల సంఖ్య 3.10 లక్షలు వుంటే ఇందులో గ్రామాల్లోనే మరణాల సంఖ్య ఎక్కువగా వుందని ఈ నివేదిక తెలిపింది. సగటున ప్రతి రెండు నిమిషాలకు ఒకరు చొప్పున మరణిస్తున్నారు. ప్రతి ఏడాది ఐక్యరాజ్యసమితి ప్రకటించే మానవాభివృద్ధి నివేదిక ప్రకారం భారతదేశంలో జీవన ప్రమాణాల అభివృద్ధిలో మన రాష్ట్రం అట్టడుగున ఉంది.

ఓట్లేసి గెలిపించిన ప్రజానీకాన్ని విస్మరించి... ప్రపంచబ్యాంకును, కార్పొరేట్లను మోయడమే దీనంతటికీ కారణం. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు సంస్కరణలు పక్కన పెట్టి రైతుల నుండి వ్యవసాయ ఉత్పత్తులు గిట్టుబాటు ధరలతో సేకరించి ప్రజాపంపిణీ ద్వారా సబ్సిడీ ధరలతో వాటిని గ్రామీణ ప్రజలకు పంపిణీ చేయాలి. దీనివల్ల అటు రైతులను ఇటు పేద ప్రజలను ఆదుకున్నట్లు అవుతుంది.

(రచయిత సిఐటియు కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు), సెల్ : 83417 88087.

మెయిల్ @ ప్రజాశక్తి

ప్రజాశక్తి సంపాదక పేజీలో వ్యాసాలు మాత్రమే కాదు. వివిధ విషయాలపై మీ అభిప్రాయాలకు కూడా అవకాశం. మీరు అనుకునే ఏ సమస్య పైనైనా సరే- మరీ సుదీర్ఘం కాకుండా సూటిగా క్లుప్తంగా రాసి పంపించండి లేదా ఇ మెయిల్ చేయండి. వెంటనే ప్రచురిస్తాం.

ఇ- మెయిల్ అడ్రస్ : **editpageps@gmail.com**

చిరునామా
ప్రజాశక్తి తెలుగు దినపత్రిక, హౌస్ నెం. 27-30-4,
ఆకులవారి వీధి,
గవర్నర్ పేట, విజయవాడ-2.

అవినీతి నిర్మూలనపై మోడీ సుభాషితాలు

ఎ కోటిరెడ్డి

బిజెపి నాయకుల మాటలకు చేతలకు పొంతన ఉండదని, తాము చెప్పే మాటలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రజలను తప్పు దారి పట్టిస్తుంటారని వారి కార్యకలాపాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రజల ముందు తమ వాస్తవ లక్ష్యాలను వెల్లడిస్తే తమకు పుట్టగతులుండవని వారికి బాగా తెలుసు. కాబట్టి ఈ విధంగా మభ్యపెట్టి పబ్బం గడుపుకోవటం వారికి వెన్నతో పెట్టిన విద్య. ప్రస్తుతం ప్రధాని మోడీ, ఆ పార్టీ అధ్యక్షుడు అమిత్ షా, ఇతర నాయకులు వ్యవహరిస్తున్న తీరు చూస్తే ఇదెంత సత్యమో అర్థం అవుతుంది. ఈనెల 17వ తేదీన నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో జరిగిన అంకుర పారిశ్రామికవేత్తల సమావేశంలో ప్రధాని మోడీ ప్రసంగిస్తూ 'మన సమాజంలో అవినీతి వ్యవస్థీకృతం అయిందని, దానిని నిర్మూలించేందుకు మరిన్ని చర్యలు తీసుకోకుండా అవినీతి, లంచగొండి తనాలను నిర్మూలించలేమని' చెప్పారు. దేశంలో అవినీతి సమస్యగా ఉందని, అది అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి విఘాతం కలిగిస్తున్నదన్న విషయం వాస్తవం. అయితే ఒకవైపు అవినీతిని గురించి ప్రధాని నీతి సూత్రాలను వల్లె వేస్తుంటే మరోవైపు ఆ పార్టీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రులు, ఆ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వాలను నడుపుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రులు, జాతీయ, రాష్ట్రాలలోని నాయకులు పీకల లోతు అవినీతి లో కూరుకుపోయి ఉన్నారు. ప్రధాని కూడా సహారా, బిర్లా సంస్థల నుండి నిధులు స్వీకరించినట్లు వారి డైరీలలో నమోదై ఉంది. ప్రస్తుతం ఆ డైరీలు ఆదాయపు పన్ను శాఖ, సంబంధిత శాఖల అధికారుల దగ్గర ఉన్నాయి. డైరీలను సాక్ష్యాలుగా అంగీకరించలేమని సుప్రీంకోర్టు ప్రకటించటంతో ప్రధాని బయటపడ్డారు. సాంకేతిక కారణాలతో కోర్టుల నుండి బయట పడ్డప్పటికీ ప్రజల ముందు ఆయన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవలసి ఉంది. నీతి నియమాలు, జాతీయత, దేశభక్తి సూత్రాలను వల్లె వేస్తున్న బిజెపి అవినీతి విషయంలో కాంగ్రెస్ కన్నా నాలుగాకులు ఎక్కువే చదివింది. బిజెపి నాయకత్వం, ఆ పార్టీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలపై అనేక అవినీతి ఆరోపణలున్నాయి. ఇన్ని నీతి సూత్రాలు వల్లెవేస్తున్న ప్రధాని, బిజెపి నాయకత్వం తమ వారిపై వచ్చిన ఏ ఒక్క అవినీతి ఆరోపణపైనా స్పందించిన దాఖలా లేదు. తమ పార్టీ నాయకత్వం లోని రాష్ట్ర ప్రభుత్వాలను నడుపుతున్న చోట్ల ముఖ్య మంత్రులు, మంత్రుల అవినీతిపై ప్రధాని ఇంతవరకు స్పందించలేదు. బిర్లా, సహారా సంస్థల నుండి లంచాలు తీసుకున్నట్లు తనపై వచ్చిన ఆరోపణలను ఖండించలేదు. అటువంటి ప్రధాని అవినీతి నిర్మూలన గురించి నీతి సూత్రాలు వల్లించటం హాస్యాస్పదం. 2014 ఎన్నికల సమయంలో విదేశాలలో భారతీయులు దాచుకున్న దొంగ డబ్బును దేశం లోకి తీసుకు వచ్చి, ప్రతి ఒక్కరి బ్యాంకు ఎకౌంటులో 15 లక్షల రూపాయలు జమ చేస్తామని బిజెపి ఎన్నికల ప్రణాళికలో ప్రకటించింది. అధికారం లోకి వచ్చిన తర్వాత ఆ విషయంలో చేసింది శూన్యం. రైతులు, నిరుద్యోగులు, పేద ప్రజలకు ఇచ్చిన ఏ వాగ్దానాన్ని నెరవేర్చ లేదు. తన వైఫల్యాల నుండి ప్రజల దృష్టి మళ్ళించటానికి, నోట్ల రద్దు, జియస్‌టి, ప్రభుత్వ రంగ సంస్థల వాటాలను అమ్మటం, అమెరికాకు జూనియర్ భాగస్వామి గా మన దేశాన్ని మార్చటం తదితరాలను ప్రజలు ప్రశ్నించకుండా ఉండటానికే అవినీతిపై పోరాటం అంశాన్ని ముందుకు తీసుకు వస్తున్నారు. ప్రధాని, బిజెపి లక్ష్యం అవినీతిని నిర్మూలించటం కాదు. ఆ ముసుగులో అవినీతి, మతోన్మాద కార్య కలాపాలను మరింత ఉధృతంగా కొనసాగించటం, తమ విధానాలను ప్రశ్నించే వారిని లక్ష్యంగా చేసుకోవటం, వారి దేశభక్తిని ప్రశ్నించటం ద్వారా వారిని



తన వైఫల్యాల నుండి ప్రజల దృష్టి మళ్ళించటానికి, నోట్ల రద్దు, జియస్‌టి, ప్రభుత్వ రంగ సంస్థల వాటాలను అమ్మటం, అమెరికాకు జూనియర్ భాగస్వామిగా మన దేశాన్ని మార్చటం తదితరాలను ప్రజలు ప్రశ్నించకుండా ఉండటానికే అవినీతిపై పోరాటం అంశాన్ని ముందుకు తీసుకు వస్తున్నారు. ప్రధాని, బిజెపి లక్ష్యం అవినీతిని నిర్మూలించటం కాదు. ఆ ముసుగులో అవినీతి, మతోన్మాద కార్యకలాపాలను మరింత ఉధృతంగా కొనసాగించటం, తమ విధానాలను ప్రశ్నించే వారిని లక్ష్యంగా చేసుకోవటం, వారి దేశభక్తిని ప్రశ్నించటం ద్వారా వారిని నేరస్తులుగా ప్రజల ముందు నిలబెట్టటం.

నేరస్తులుగా ప్రజల ముందు నిలబెట్టటం.

ముఖ్యమంత్రి అభ్యర్థులుగా అవినీతిపరులు

ప్రధాని ఒకవైపున అవినీతి నిర్మూలన గురించి సుభాషితాలు వల్లిస్తుండగా మరోవైపు ఆ పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా 2018 సంవత్సరంలో మధ్యప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలలో జరగనున్న ఎన్నికలలో శివరాజ్‌సింగ్ చౌహాన్, బి యస్ ఎడ్యూరప్పలను తమ పార్టీ తరపున ముఖ్యమంత్రి అభ్యర్థులుగా ప్రకటించారు. అమిత్‌షా ముఖ్యమంత్రి అభ్యర్థులుగా ప్రకటించిన ఇద్దరూ అవినీతిలో ఘనాపాఠీలు. అటువంటి వారిని కాబోయే ముఖ్యమంత్రులుగా ప్రకటించిన బిజెపి అవినీతిపై ఏ విధంగా పోరాటం చేస్తుంది? మధ్యప్రదేశ్‌లో వేల కోట్ల రూపాయల 'వ్యాపం' కుంభకోణం జరిగింది. కుంభకోణంలో భాగస్వాములైన వారు ఇప్పటికి 53 మంది మరణించారు. శివరాజ్‌సింగ్ చౌహాన్ మెడికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంటు బాధ్యతలను స్వయంగా పర్యవేక్షిస్తున్నపుడే ఈ కుంభకోణం జరిగింది. ఈ కుంభకోణంపై 'కాగ్' రాష్ట్ర ప్రభుత్వాన్ని కడిగిపారేసింది. ఇంత జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ దీనిపై పూర్తి విచారణ జరపలేదు. విచారణ పూర్తయితే రాష్ట్ర ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, మంత్రులు నేరస్తులుగా రుజువవుతారు. సహారా సంస్థ నుండి ముడుపులు స్వీకరించిన వారి జాబితాలో శివరాజ్‌సింగ్ చౌహాన్ పేరు కూడా ఉంది.

ఇక కర్నాటకలో ఎడ్యూరప్ప ముఖ్యమంత్రిగా ఉండగా అనేక కుంభకోణాలు జరిగాయి. ఎడ్యూరప్ప, ఆయన కుటుంబం చుట్టూ కుంభకోణాలు అల్లుకుపోయాయి. ఆయన మంత్రివర్గం అవినీతికి చిరునామాగా మారింది. తన కుటుంబానికి ప్రయోజనం కలిగించే విధంగా ప్రభుత్వ భూములను డీ నోటిఫై చేయటం, మైనింగ్ కంపెనీల నుండి లంచాలు పుచ్చుకోవటం, అధికారాన్ని ఉపయోగించుకోవటం ద్వారా తన కుటుంబ భూమిని మార్కెట్ ధరకన్నా అనేక రెట్లు అధిక ధరలకు అమ్మటం ద్వారా ప్రయోజనం పొందటం తదితర ఆరోపణలు వచ్చాయి. వాటిపై లోకాయుక్త విచారణ జరిపి వాస్తవమని చెప్పింది. అనంతరం జరిగిన పరిణామాలలో బిజెపి నాయకత్వం ఆయనను రాష్ట్ర ముఖ్యమంత్రి పదవి నుండి, ఇతర బాధ్యతల నుండి కూడా తొలగించింది. కొంత కాలం తర్వాత ఆయనను తిరిగి పార్టీలోకి తీసుకున్నారు. ఆయన మంత్రివర్గం లోని 14 మంది మంత్రులపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. వారిలో ఒకరైన గాలి జనార్ధనరెడ్డి గనులు, ఖనిజాలు, భూములు కొల్లగొట్టి శత కోటీశ్వరుడు కావటం, ఆ తర్వాత ఆయనపై విచారణ జరగటం, జైలుకు వెళ్ళటం తదితరాలన్నీ జగద్విదితం. ప్రధాని మోడీ గత సంవత్సరం నవంబరు 8వ తేదీన పెద్ద నోట్లను రద్దు చేసిన తర్వాత నోట్ల కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలో గాలి జనార్ధనరెడ్డి 200 కోట్ల రూపాయలకు పైగా ఖర్చుపెట్టి కుమార్తె వివాహం చేశారు. బ్యాంకుల్లో కూడా పరిమితంగా డబ్బులున్న ఆ సమయంలో అంత డబ్బు ఎలా వచ్చిందనే అంశంపై జరిగిన విచారణలో కొత్త నోట్లను సంపాదించటానికి అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఆయన కారు డ్రైవరుతో సహా అనేకమంది వివరాలు వెల్లడించారు. అటువంటి జనార్ధన రెడ్డి ఇప్పటికీ బిజెపి నేతగానే చెలామణి అవుతున్నారు. తాను అవినీతిలో పీకల లోతు కూరుకుపోవటమే కాక, ఇలాంటి అవినీతిపరులకు ఎడ్యూరప్ప నాయకుడుగా ఉన్నారు. అటువంటి అవినీతిపరుని ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించిన బిజెపికి, ప్రధానమంత్రికి అవినీతిని అరికట్టటంపై మాట్లాడే నైతిక హక్కు ఎక్కడిది?

ఈ రెండు రాష్ట్రాలలోనే కాదు. 'ఇందుగలడందు లేడని సందేహంబు వలదన్న'ట్లుగా పైనుండి కింది వరకు బిజెపి అవినీతి ఊబిలో కూరుకుపోయింది. బిజెపి అధ్యక్షుడు అమిత్‌షా ఆస్తులు మూడు సంవత్సరాలలో మూడు రెట్లు, మహారాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి ఆస్తులు పది సంవత్సరాలలో పది రెట్లు పెరిగాయి. కేంద్ర మంత్రులు విజయ్ గోయల్ ఢిల్లీలో భూ కుంభకోణానికి పాల్పడటం ప్రస్తుత కథ. వెంకయ్య నాయుడు కుమార్తె ట్రస్టు పేరుతో అక్రమాలకు పాల్పడ్డారు. బీహార్‌లో శ్రీజన్ కుంభకోణంలో... మంత్రిగా పని చేసిన సుశీల్ మోడీ పాత్ర ఉందని ఆరోపణలు వచ్చాయి. కేరళలో బిజెపి నాయకుల అవినీతిని కప్పిపెట్టుకోవటానికి సిపియం తమపై దాడులు చేస్తున్నదని కట్టుకథలు ప్రచారంలో పెడుతున్నారు. మహారాష్ట్రలో శిశుసంక్షేమశాఖ మంత్రి, గృహ నిర్మాణ శాఖ మంత్రి, విద్యాశాఖ మంత్రి అక్రమాలకు పాల్పడ్డారు. ఆర్థిక నేరస్తులు విజయ్ మాల్యా, లలిత్ మోడీ దేశం నుండి తప్పించుకుపోవటానికి బిజెపి కేంద్రమంత్రి సుష్మా స్వరాజ్, రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధర రాజే సహకారం ఉన్నట్లు స్పష్టమైంది. కార్పొరేట్ సంస్థల నుండి బిజెపి అత్యధికంగా విరాళాలను అందుకుంటున్నది. అవినీతికి పాల్పడటం, అక్రమాలు, బ్యాంకులను మోసం చేయటంలో అంబానీ, ఆదానీలు సిద్ధహస్తులు. వారు మోడీకి అత్యంత సన్నిహితులు.

పై విషయాలను పరిశీలిస్తే అవినీతి నిర్మూలన గురించి మోడీ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించిన చందంగా ఉంది. బిజెపి, కేంద్ర ప్రభుత్వం, ఆ పార్టీ నాయకత్వం లోని రాష్ట్ర ప్రభుత్వాల అవినీతిని మోడీ శుద్ధి చేస్తారా? అవినీతిలో భాగస్వామిగా, అవినీతిపరులకు నాయకుడుగా, కార్పొరేట్లకు సన్నిహితునిగా ఉన్న ప్రధాని ఆ పని చేయలేరు. అవినీతి నిర్మూలనకు ప్రజలే పూనుకోవాలి. ♦

నివాళి

నిబద్ధ ప్రజా వైద్యుడు ఎస్వీఎస్

డా॥ భీమవరపు సాంబిరెడ్డి



ప్రజా వైద్యునిగా నెల్లూరు జిల్లా సామాన్య జన హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న డా ఎస్వీఎస్ ప్రసాద్ కన్ను మూసి నేటికి సరిగ్గా పాతికేళ్ళు. రాష్ట్రంలో ప్రసిద్ధి గాంచిన 'డా పుచ్చలపల్లి రామచంద్రా రెడ్డి ప్రజా వైద్యశాల'లో వైద్య సేవలు అందించింది 14 ఏళ్ళే. అయినా, గ్రామీణ ప్రజానీకంలో రోగాల పట్ల, వాటి చికిత్సకై మందుల పేరుతో ప్రజలను దోచేస్తున్న కంపెనీల పట్ల అవగాహనను కల్పించే విధంగా నిరంతర కార్యక్రమాలను నిర్వహించేవారు డా ఎస్వీఎస్. ప్రజా నాట్యమండలి కళా బృందాల సహకారంతో గ్రామీణులకు రక్తదానం వల్ల ఎందరి ప్రాణాలు కాపాడవచ్చో హృదయానికి హత్తుకునేలా ఉద్యమ స్థాయిలో ప్రచారం చేసేవారు. రక్తదానం పట్ల ప్రజల్లో వుండే అపోహలను తొలగించేవారు. అదే సమయంలో ప్రజల్లో పాతుకుపోయిన అనేక మూఢ విశ్వాసాలను, మంత్ర-తంత్ర భూత వైద్యం పట్ల భ్రమలను తొలగించే వారు. ఆ క్రమంలో నెల్లూరు జిల్లా ప్రజానాట్య మండలి వైద్య శిబిరాలను నిర్వహించేవారు. కార్యవర్గ సభ్యునిగా కళా రంగ బాధ్యతలు నిర్వహిస్తూ కళా బృందాల సామాజిక చైతన్య స్థాయికి మెరుగులు దిద్దేలా కృషి సల్పేవారు.

తనతో పరిచయమున్న వారందరిలో మరపురాని స్మృతులను నింపిన డా శిష్టా విజయ సింహ ప్రసాద్ (ఎస్వీఎస్), సీనియర్ డాక్టర్ల దగ్గర వైద్య శాస్త్ర పరిజ్ఞానాన్నీ, చికిత్సా నైపుణ్యాలను నేర్చుకునేవారు. అదే విధంగా సహచర వైద్యులకు తన వద్దనున్న వైజ్ఞానిక శక్తియుక్తులను బదిలీ చేయటంలో అత్యంత ప్రజాస్వామికంగా వ్యవహరించేవారు. ఆర్థిక సంపద, అధికార సంపదలే కాదు. జ్ఞాన సంపద కూడా ప్రజాస్వామికమైనపుడే సాంస్కృతిక ప్రజాస్వామ్యం నెలకొనగలుగుతుందని డా ఎస్వీఎస్ భావించేవారు. అంతటి అంకిత భావంతో తనను తాను మలుచుకుంటూ, తోటి వారిని ప్రభావితం చేస్తూ ప్రజా వైద్యునిగా ఇంకెంతో కాలం ప్రజలకు సేవలందించాల్సిన... వైద్య, వైజ్ఞానిక సేవలందించాల్సిన డా ఎస్వీఎస్ తన 42 వ ఏటనే హెపటైటిస్-బి వ్యాధి సోకి 1992 ఆగష్టు 24న తుది శ్వాస విడిచారు.

కృష్ణా జిల్లా నాగాయలంక గ్రామంలో వ్యవసాయం చేయడం, చేయించడంలో పేరున్న శిష్టా వారి కుటుంబంలో 1950, జనవరి 14వ తేదీన విజయసింహ ప్రసాద్ పుట్టారు. ప్రాథమిక, మాధ్యమిక విద్య వరకు నాగాయలంక లోనే చదువుకున్నారు. చదువు లోనే కాక ఆటల్లో కూడా చురుకుగా వుంటూ స్నేహ బృందాలలో తలమానికంగా వుండేవారు. 1965లో హైస్కూలు విద్యను నాగాయలంకలో పూర్తి చేసుకొని, బందరు హిందూ కళాశాలలో పియుసి చదివారు. వైద వృత్తిని లక్ష్యంగా చేసుకున్న ఎస్వీఎస్‌కు మొదటిసారి పొందిన మార్కులకు వైద్య కళాశాలలో సీటు లభించలేదు. అందువల్ల మరో ఏడాది పియుసి చదివి అర్హత సాధించి గుంటూరు వైద్య కళాశాలలో విద్యార్థిగా చేరారు.



నేడు డా॥ ఎస్వీఎస్ ప్రసాద్ 25వ వర్ధంతి

గ్రామీణ ప్రజానీకంలో రోగాల పట్ల, వాటి చికిత్సకై మందుల పేరుతో ప్రజలను దోచేస్తున్న కంపెనీల పట్ల అవగాహనను కల్పించే విధంగా నిరంతర కార్యక్రమాలను నిర్వహించేవారు డా ఎస్వీఎస్. రక్తదానం పట్ల ప్రజల్లో వుండే అపోహలను తొలగించేవారు. అదే సమయంలో ప్రజల్లో పాతుకుపోయిన అనేక మూఢ విశ్వాసాలను, మంత్ర-తంత్ర భూత వైద్యం పట్ల భ్రమలను తొలగించే వారు. ఆ క్రమంలో నెల్లూరు జిల్లా ప్రజానాట్య మండలి వైద్య శిబిరాలను నిర్వహించేవారు.

ఆ తర్వాత కొద్ది రోజులకే స్టూడెంట్స్ ఫెడరేషన్ కార్యకలాపాల వైపు ఆకర్షితులయ్యారు. విద్యార్థి ఉద్యమ కార్యకలాపాల్లో చురుకైన పాత్రను నిర్వహిస్తున్న కారణంగా ఒక ప్రొఫెసర్ ఆగ్రహానికి గురై మూడవ ఏడాది కోర్సును రెండు సార్లు చదవాల్సి వచ్చింది. అలా తన కంటే సీనియర్లు, జూనియర్లను కలిపి మొత్తం 10 బ్యాచీల సహాధ్యాయులతో అనేక మందితో సత్సంబంధాలు కలిగివుంటూ గుంటూరు వైద్య కళాశాలలోనే డా ఎస్వీఎస్ తోటి విద్యార్థులపై తనదైన ముద్రను వేయగలిగారు. నేడు జన విజ్ఞాన కేంద్రాలు, ప్రజా వైద్యశాలల్లో కృషి సల్పుతున్న వారిలోనూ అలాగే అనేక మంది వైద్యులతో డా ఎస్వీఎస్‌కు ఆత్మీయ సంబంధాలుండేవి.

డా ఎస్వీఎస్ ప్రసాద్ ఎంతో సహృదయులు. మృదు భాషి, మానవతా వాది. స్నేహశీలి. మంచి వైద్యుడిగా పేరు. క్రమశిక్షణ కలిగిన వారు. రోగులను వృత్తిపరంగానే కాక మానవతా దృక్పథంతో కూడిన శ్రద్ధతో చూసేవారు. ఆపరేషన్లు ఎంతో నైపుణ్యంతోనే కాకుండా చాలా ఆర్టిస్టిక్‌గా చేసేవారు. జూనియర్లతో కలిసి మెలిసి స్నేహ సంబంధాలు కలిగివుండేందుకు ఇష్టపడేవారు. పని చేసే చోట అందరినీ కలుపుకు పోవటానికీ, ప్రోత్సహించడానికీ ముందుండేవారు. సిపియం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమ నిర్వహణలో చురుగ్గా పాల్గొనేవారు. ముఖ్యంగా హెపటైటిస్-బితో పోరాడే క్రమంలో ఆయన చూపిన ధైర్యం అనితరసాధ్యం. అంతిమ దశలో సైతం వైద్యులకూ, కుటుంబ సభ్యులకూ, స్నేహితులకూ ఎంతగానో సహకరించిన ఎస్వీఎస్ మనోధైర్యం నిరుపమానం.

1977లో దివిసీమకు ఉప్పెన వచ్చినపుడు తాను పుట్టి పెరిగిన నాగాయలంకకు వేలాది బాధితులు తరలి వచ్చి శిబిరాల్లో తలదాచుకొంటున్నప్పుడు, గుంటూరు నుంచి వైద్య బృందాన్ని దివిసీమకు తీసుకు వచ్చి ప్రజానీకానికి సేవలందించారు. 1978 వరకు గుంటూరులో డా మాకినేని జశ్వంత్ మోహన్‌తో కలిసి వైద్యం చేసిన ఎస్వీఎస్ పార్టీ పిలుపు మేరకు నెల్లూరు లోని డా రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాలకు తన వృత్తి కార్యక్రమాలను బదిలీ చేసుకున్నారు.

1987 ఆగస్టులో సరిగ్గా 30 ఏళ్ళ క్రితం సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ పిలుపుతో, చైనా కమ్యూనిస్టు పార్టీ ఆహ్వానంతో డా పరుచూరి అజయ్ కుమార్ (ప్రస్తుతం నెల్లూరు ప్రజావైద్యశాల బాధ్యులు)ను తోడు తీసుకొని, నాలుగు నెలల పాటు ఆక్యుపంక్చర్ వైద్యాన్ని నేర్చుకోవడానికి చైనా వెళ్ళారు. తిరిగి నెల్లూరు వచ్చిన తర్వాత స్థానిక వైద్యులూ, వారి సిబ్బందీ, పార్టీ కార్యకర్తలూ అభినందన సభ ఏర్పాటు చేసి ప్రశంసల వర్షం కురిపించినపుడు సమాధానంగా డా ఎస్వీఎస్ ఇలా చెప్పారు.

'మమ్మల్ని అందరూ ప్రశంసలతో ముంచెత్తారు. మేం చైనా వెళ్ళి వైద్యం నేర్చుకొని వచ్చాం అంతే. ఇంకా మేం ప్రజలకు మా వైద్య సేవలను అందించలేదు. చైనా వెళ్ళి వచ్చినందుకే మమ్మల్ని ప్రశంసిస్తున్నారు. మేం చాలా ఎత్తుకు ఎదిగిన వారిలాగా మీకు కనిపిస్తున్నాం. నిజమే కావచ్చుకానీ, మేం ఎవరి భుజాలపై నిలబడితే ఇంత ఎత్తుగా మీకు కనిపిస్తున్నామో మీరు తెలుసుకోవాలి. మేమూ గుర్తుంచుకోవాలి. అశేషమైన త్యాగాలు చేసిన పార్టీ, కార్యకర్తల భుజాలపైన మేం నిలబడి వున్నాం. కనుక మీకు ఎత్తుగా కనిపిస్తున్నాం. వైద్య సేవల ద్వారా ప్రజల మన్ననలను పొందిన ఈ ప్రజా వైద్యశాల మాకీ అవకాశం ఇచ్చింది కనుక మేం ఎత్తుగా కనిపిస్తున్నాం. మేం చైనాలో నేర్చుకొని వచ్చిన వైద్య నైపుణ్యాలను, మెలకువలను ప్రజా సేవకు వినియోగించినప్పుడు మాత్రమే మీ ప్రశంసలకు మేం అర్హులమవుతాం. అందుకే మమ్మల్ని పునరంకితుల్ని చేసుకుంటాం' అన్నారు. చైనాలో నేర్చుకు వచ్చిన ఆక్యుపంక్చర్ వైద్య సేవల్ని ఒక్క ఐదేళ్ళు మాత్రమే ఆయన ప్రజలకు అందించగలిగారు.

'శస్త్ర చికిత్స చేయటమేలాగో డా ఎస్వీఎస్ దగ్గరే నేర్చుకోవాలి' అన్నట్లుగా సాటి వైద్యుల గుండెల్లోనే గాక, నెల్లూరు జిల్లా ప్రజానీకం హృదయాల్లో నిలిచిపోయిన విజయసింహ ప్రసాద్, అంకిత భావం గల వైద్యుడేకాక, ప్రజా కళాకారులకు మార్గదర్శి. జన విజ్ఞాన వేదికకు స్ఫూర్తి ప్రదాత. ఉద్యమ కార్యకర్త కూడా.

(రచయిత జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షులు), సెల్: 9440257879.



బాదంపాలతో జ్ఞాపకశక్తి మెండు


నేటి పోటీ ప్రపంచంలో చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా అందరూ కాలంతో పోటీపడుతున్నారు. ఈ వేగంలో నిత్యం మానసిక ఆందోళనల వల్ల జ్ఞాపకశక్తి మందగిస్తుంది. విద్యార్థులయితే సబ్జెక్టుల మోతతో సతమతమైపోతున్నారు. కనుక జ్ఞాపకశక్తి చాలా అవసరం. జ్ఞాపకశక్తిని పెంపొందించేందుకు బాదంపాలు చాలా ఉపకరిస్తాయని నిపుణులు తెలుపుతున్నారు. ముఖ్యంగా పడుకునే ముందు బాదంపాలు తీసుకోవటం వల్ల అధిక ప్రయోజనం ఉంటుంది. అంతే కాదండోయ్ బాదంపాలలో సోడియం తక్కువగా ఉండి, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువగా ఉండటం వల్ల గుండెనొప్పి, బీపీ అవకాశాలను తగ్గిస్తుంది. మలబద్ధకంతో బాధపడేవారు బాదంపాలు తాగితే ఉపశమనం లభిస్తుంది. బాదంలో ఉండే క్యాల్షియం ఎముకల పటుత్వంకు సహకరిస్తుంది. బాదంపప్పులో ఐరన్, ఇతర పోషకాలు ఉండటం వల్ల రక్తహీనత తగ్గుతుంది. ఇంత మేలుచేసే బాదంపాలను ప్రతిరోజూ సేవించడం ఎంతో శ్రేయస్కరం. ✦

జీవన సౌరభం

ఓడిపోతామనే భయంతో ప్రయత్నించకుండా ఉండే కంటే.. ప్రయత్నించి ఓడిపోవడం మేలు.

ఎకరా పొలాన్ని సేద్యం చేసుకుంటూ బతికే కుటుంబం. ఆ కుటుంబంలో ఉన్నత చదువులు చదవడం అనేది ఓ కల. అలాంటి స్థితిలో వైద్యవిద్యను అభ్యసించడం అంటే ఆషామాషీ కాదు. కానీ, చదవాలనే పట్టుదలతో పాటు తండ్రి త్యాగమూ అతడికి తోడయ్యింది. ఉన్న ఎకరాభూమి అమ్మేసి.. ఆ తండ్రి కొడుకుని డాక్టర్ చేశాడు. నాన్న కష్టంతో చదివిన చదువు వృథా పోలేదు. ఎక్కడో ఉత్తరాంధ్రలో చిన్నహాస్పిటల్ పెట్టుకుని, సాదాసీదాగా.. ఎలాగోలా బతకాల్సిన ఆ డాక్టర్.. ఉన్నచోటే పరిమితం కాకుండా.. పరులకోసం ప్రపంచాన్ని చుట్టొచ్చారు. ఎయిడ్స్, క్యాన్సర్ వంటి మహమ్మారీ రోగాల బారిన పడ్డవారికి తానొక సంజీవిగా మారారు. వారి బతుకుల్లో వెలుగులు నింపే చల్లని సూరీడయ్యారు. ఆయనే డాక్టర్ కూటికుప్పల సూర్యారావు. చేస్తున్న వైద్యసేవలకుగాను కేంద్రప్రభుత్వం పద్మశ్రీతో గౌరవించింది. గిన్నిస్, లిమ్కా వంటి సంస్థలు రికార్డు బుక్కులో అతడి పేరును పదిలంగా రాసుకున్నాయి.

ఇలా ఓ సన్నకారు రైతుబిడ్డ అంతర్జాతీయంగా ఎదగడం వెనుక కృషి ఏమిటి? ఆయన మాటల్లోనే తెలుసుకుందాం!!



చీకటి బతుకుల్లో.. సూర్యకిరణం

మాది శ్రీకాకుళం జిల్లా కింతలి గ్రామం. నాన్న శ్రీరాములు కేవలం ఎకరా రైతు. ఆయన ఐదో తరగతి వరకూ చదువుకున్నారు. అమ్మ సన్యాసమ్మ గృహిణి. ఆరుగురు సంతానంలో పెద్దవాడిని. ప్రాథమిక విద్య నుంచి స్కూల్ ఫైనల్ వరకూ మా ఊర్లోనే చదువుకున్నాను. 1969లో స్కూల్ ఫైనల్ పాసయ్యాను. స్కూల్ చరిత్రలో అంతవరకూ ఎవరూ పొందని అత్యధిక మార్కులు సాధించాను. ఆ తరువాత శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో పీయూసి పూర్తిచేసి, బిఎస్సీలో చేరాను.

డాక్టర్ చదువుకు తగనన్నారు

మా ఊర్లో ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. అక్కడకు డాక్టర్‌గారు నెలకోసారి కార్లో రావడం చూసేవాడ్ని. డాక్టర్‌ని అందరూ ఎంతో గౌరవంగా చూసేవారు. అప్పుడు అనుకున్నాను డాక్టర్‌ని అయితే నన్నూ అలాగే గౌరవిస్తారని. అయితే, స్కూల్ ఫైనల్, పియుసిలో వచ్చిన మార్కుల ఆధారంగా పోస్టల్‌లో ఉద్యోగం వచ్చింది. నాన్న ఎంతో సంతోషించారు. ఊరంతా చెప్పారు. కానీ నేను ఉద్యోగంలో చేరలేదు. చిన్నప్పటి నుంచి డాక్టర్‌ని కావాలనే కోరిక నాలో నాటుకుపోయింది. రాష్ట్రంలో మొట్టమొదటిసారి 1971లో మెడికల్ ఎంట్రెన్స్ పెట్టారు. గుంటూరులో జరిగిన ఎంట్రెన్స్‌కు హాజరయ్యాను. మంచి ర్యాంకు సాధించాను. విశాఖలోని ఆంధ్ర మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్‌లో చేరాను. నాన్నకి నేను ఉద్యోగాన్ని వదులుకోవడం ఇష్టంలేదు. మనకి అంత స్థోమత లేదు చదివించలేనన్నారు. ఊర్లో అంతా "తాహతకు తగ్గ తలపాగా చుట్టాలి. అలాంటి చదువులు మీరేమి చదివిస్తారు" అని ఎగతాళి చేశారు. నా పట్టుదల వల్ల కుటుంబానికి ఆధారంగా ఉన్న ఎకరా భూమినీ నాన్న అమ్మి, నన్ను మెడిసిన్ చదివించారు. 1977-78లో ఎంబిబిఎస్ పూర్తిచేశాను. కుటుంబ పోషణకు విశాఖలోని కంచరపాలెంలో మెడికల్ ప్రాక్టీస్ మొదలుపెట్టాను. ప్రాక్టీస్ చేస్తూనే ఫ్యామిలీ మెడిసిన్‌లో ఎం.డి చేశాను. ఆంధ్ర యూనివర్శిటీలో 'ఎయిడ్స్ వ్యాధి చికిత్స- నైతిక ప్రమాణాలు' అనే అంశంపై పి. హెచ్.డి. చేశాను.

పత్రికా కథనం కదిలించింది

రాయల్ సొసైటీ ఆఫ్ హెల్త్ లండన్ ఆహ్వానం మేరకు హెపటైటిస్-బి పరిశోధనా పత్రాలు సమర్పించడానికి మాంచెస్టర్ వెళ్ళాను. ఆ సందర్భంలో అక్కడ.. 'ద గార్డియన్' పత్రికలో ఒక కథనం చదివాను. తల్లికి ఎయిడ్స్ ఉందని ఆరేళ్ళ పాపను పాఠశాలకు రావద్దని తోటి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రాళ్ళతో కొడుతున్నారన్నది ఆ కథనంలోని సారాంశం. బ్రిటన్ వంటి అభివృద్ధి చెందిన దేశంలో తల్లికి ఎయిడ్స్ ఉందని పిల్లలపై వివక్ష చూపిస్తుంటే మనలాంటి దేశంలో ఇంకెలా ఉంటుందో ఊహించుకున్నాను. ఆ రోజు నుంచి ఎయిడ్స్‌పై నా పరిశోధనలు వేగం పుంజుకున్నాయి.



ఐక్యరాజ్య సమితిలో ఉపన్యాసం

సంచార జీవనం, ట్రక్ డ్రైవర్లు, కుటుంబానికి దూరంగా ఉన్నవారి వలన ఈ వ్యాధి వ్యాప్తి చెందుతున్నట్లు పలు పరిశోధనల్లో తెలియజేశా. ఈ పరిశోధనా పత్రాలు ప్రపంచ ప్రఖ్యాత చెందిన 'బ్రిటిష్ మెడికల్ జర్నల్'లో ప్రచురితమయ్యాయి. దీనితో అంతర్జాతీయంగా ఎయిడ్స్‌పై ప్రసంగించడానికి ఆహ్వానాలు అందాయి. 2008లో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో 'సౌత్ ఈస్ట్ ఆసియా యూత్ హెచ్ఐవి, ఎయిడ్స్, మైగ్రేషన్ ప్రాబ్లమ్స్' అనే అంశంపై ప్రసంగించాను. జెనీవాలో జరిగిన అంతర్జాతీయ ఎయిడ్స్ సదస్సు, బీజింగ్‌లో జరిగిన అంతర్జాతీయ ఎయిడ్స్ సదస్సుల్లో కీలకోపన్యాసం చేశాను. నెదర్లాండ్స్ రౌండ్‌టేబుల్ సమావేశంలో ఉపన్యసించాను. దర్బన్‌లో జరిగిన అంతర్జాతీయ వైద్య సదస్సుకు అధ్యక్షత వహించాను. అనేక అంతర్జాతీయ యూనివర్శిటీల్లో ప్రసంగించాను. ఇలా టి.బి, హెపటైటిస్-బి, రాబిస్, మలేరియా, మధుమేహం వంటి వ్యాధులపై 80 వరకూ దేశాల్లో ప్రసంగాలు చేశాను. బిబిసి లండన్ బ్యూరో చీఫ్ మైక్ ఉల్ రిడ్జ్ విశాఖకు వచ్చి నా పరిశోధనలు రికార్డు చేసి, ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేశారు. నేడు నా పరిశోధనా ప్రాజెక్టులు జాంబియా, జింబాబ్వే దేశాలు ఆచరణలో పెట్టాయి. ఆంధ్ర మెడికల్ కళాశాలలో మెడిసిన్ చదువుతున్న రోజుల్లోనే ఆకాశవాణి ద్వారా ధూమపానం, మద్యపానం, క్యాన్సర్‌ను ముందుగా తెలుసుకోవడం ఎలా? పచ్చకామెర్లు, మూఢనమ్మకాలపై సామాజిక స్పృహ కలిగే ప్రసంగాలు చేశాను.

ఎయిడ్స్ చికిత్సలో పురోగతి

గత రెండు దశాబ్దాలుగా ఎయిడ్స్ చికిత్సలో ఎంతో పురోగతి జరిగింది. అనేక మాడ్యూల్స్ ఆవిష్కరణ జరిగింది. అధునాతన వైద్యంతో రోగి 75 ఏళ్ళ వరకూ విలువైన జీవనం పొందే అవకాశముంది. ఎఆర్‌టి వైద్యం అందుబాటులోకి వచ్చిన తరువాత మధుమేహం, బి.పి రోగుల మాదిరి.. ఎయిడ్స్ మందులు సక్రమంగా వాడితే మనిషి చిరకాలం జీవించవచ్చు. ఎయిడ్స్ చికిత్సలో, మందులలో ఎంతో పురోగతి సాధించడం జరిగింది. ఎయిడ్స్ ప్రాణాంతకం మాత్రం కాదు. బ్రిటన్, అమెరికా దేశాల్లో ఈ వ్యాధిగ్రస్తులు పూర్తిగా కోలుకున్న సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. వైద్యరంగం ఎయిడ్స్‌పై కొంత విజయం సాధించిందని చెప్పవచ్చు.

అవార్డులు, గుర్తింపులు

భారత ప్రభుత్వం 2008లో 'వైద్యచికిత్స-పరిశోధన'కు పద్మశ్రీ అవార్డునిచ్చింది. ఎయిడ్స్‌పై అవగాహన కలిగించడానికి ప్రపంచంలో అతి పెద్ద రెడ్ రిబ్బన్‌ను ఆవిష్కరణతో గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లో నా పేరు నమోదు చేశారు. ఆ రిబ్బన్ ప్రస్తుతం లండన్‌లో ప్రదర్శనలో ఉంచారు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డులో స్థానం లభించింది. 2015లో బ్రిటన్‌లోని ఎగువసభలో 'మహాత్మాగాంధీ సమ్మాన్' పురస్కారం అందుకున్నాను.

మర్చిపోలేని అనుభూతి

మదర్ థెరిస్సాకు ఆంధ్ర యూనివర్శిటీ డాక్టరేట్ ప్రధానం చేసింది. అప్పుడు విశాఖకు వచ్చిన ఆమె ఇద్దరు సిస్టర్లను నా వద్దకు పంపించి, తన వద్దకు పిలిపించుకున్నారు. నేను ఆ మహామనీషిని చూసి, రెండు చేతులు జోడించుకొని దగ్గరకు వెళ్ళాను. అప్పుడామె నా రెండు చేతులు పట్టుకొని.. "మీ గురించి అమెరికాలో చదివాను. మీ పరిశోధనలు, సేవలు ఎంతో విలువైనవి" అని నన్ను అభినందించారు. నా జీవితంలో అదో మరిచిపోలేని అనుభూతి.

కుటుంబం

భార్య గృహలక్ష్మి గృహిణి. పెద్ద కుమార్తె సృజన, అల్లుడు నందేశ్వరరావు లండన్‌లో సెటిలయ్యారు. చిన్న కుమార్తె శ్రవణ మెడిసిన్ చదువుతోంది. కుమారుడు శ్రీచరణ్ కస్టమ్స్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

ఇంటర్వ్యూ : పందిరిపల్లి శ్యామలరావు, విశాఖ

ఫొటోలు: రాజేష్.



శాస్త్రీయ అవగాహన అవసరం



మనదేశాన్ని ఎయిడ్స్ తాకి మూడు దశాబ్దాలు దాటింది. ఈ వ్యాధి పట్ల ప్రజల్లో శాస్త్రీయ అవగాహన పెరగాలి. ఎయిడ్స్ సోకిన యువతరం వైద్యం చేయించుకోవటానికి ఇప్పటికీ ముందుకి రావటం లేదు. సరైన చికిత్స చేయించుకొని.. ఆహార నియమాలు పాటిస్తూ, వ్యాయామాలు చేస్తుంటే వ్యాధి సోకిన వారు దీర్ఘకాలం జీవిస్తారు. ప్రభుత్వం అర్హులైన వైద్యులందరికీ ఆరోగ్యశ్రీకి అర్హత కల్పిస్తే.. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యులు ఉండటానికి, పేదలకు మంచి వైద్యసేవలు అందించడానికి వీలుంటుంది.

- డాక్టర్ కూటికుప్పల సూర్యారావు
9703100938

గెలుపు పాఠం నేర్పే ఓటమి

జీవితంలోనూ పోరాటం తప్పనిసరి. ఓటమిని ఎవరూ కోరుకోరు. గెలుపుపై ఆశ మనల్ని పోరాటం చేసేలా చేస్తుంది. లక్ష్యాలు నిర్దేశించు కోవటంలోనూ, పరిసరాలను, పరిస్థితులను అనుకూలంగా మార్చుకోవటంలోనూ సౌకర్యవంతమైన విధానాల కల్పనలోనూ పోరాటం తప్పనిసరిగా ఉంటుంది.

మనం నివసిస్తున్న సమాజం వైకుంఠపాళిలాంటిది. మెట్టుమెట్టు పైకెక్కే వేళ పొంచి ఉండే 'డ్రాగన్స్' ఉంటాయి. ఆటలో ఐతే అక్కడ ఓ డ్రాగన్ ఉందని గమనించవచ్చు గానీ, జీవితంలో సాగే తీరు తెన్నులలో తెలీకుండా ఉంటాయి ఈ డ్రాగన్స్. వీటిని కొన్ని రకాలుగా మనం ఎంచుకోవచ్చు. సహజంగా మన శక్తియుక్తులు చాలక ఎదురయ్యే అపజయాలు ఒకటి. మనలను అపజయాల పాలు చెయ్యాలనీ, పరోక్ష ప్రతిబంధకాలుగా నిలిచే శక్తులు మరికొన్ని. ఇది రెండవది. నిరుత్సాహపరుస్తూ మన విజయాలను చూసి మన ఓటమిని కోరుకునే జాతి మూడవది. ఎవరి మనసులో ఏముందో, ఎవరి తత్వం ఎటువంటిదో గమనిస్తూ సాగిపోయే సమర్థత మనలో లేకపోతే పెద్ద పాముల నోట్లో పడవలసిందే.

మనం ఓటమి పాలైయ్యాక విరగబడి చాటున నవ్వుకునేవారూ, బహిరంగంగా విమర్శించే వారికీ ఈ సమాజంలో కొదవే ఉండదు. అలాగని మొత్తం సమాజం ఇలాగే ఉండదు. అతికొద్ది శాతం మాత్రమే ఇతరుల ఉన్నతిని, విజయాలను అభినందిస్తూ, ఆదరిస్తూ, ప్రోత్సహిస్తూ ఉంటారు. ఇది సంస్కారవంతమైన తోడ్పాటు. ఓటమి మనిషికి గుణపాఠాలను నేర్పుతుంది. గెలుపుకై బాటను నిర్మించుకోవడంలో సాయపడుతుంది. ధైర్యాన్ని, సంకల్పబలాన్ని చూస్తే ఓటమికే కాదు చెడు మనస్తత్వాలకు సైతం వెన్నులో చలి పుట్టేటట్లుగా ఉంటుంది. ఆత్మవిశ్వాసం గుండెలనిండుగా తొణికిసలాడుతుంటే విరగబడి నవ్వే నవ్వుకు చరమగీతం పాడవచ్చు. ✦



'జీవన'పై మీ స్పందన

'జీవన' పేజీలు మీకెలా అన్పిస్తున్నాయి? ఇంకా ఏం కావాలని కోరుకుంటున్నారు? మీ కుటుంబసభ్యుల, మిత్రుల, బంధువుల స్పందన ఎలా ఉంది? 'ప్రజాశక్తి' కార్యాలయానికి రాయండి. మీ సూచనలు, సలహాలు మాకు తెలియజేయండి.

మా చిరునామా: జీవన, ప్రజాశక్తి దినపత్రిక,
హౌస్ నెం : 7-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2, ఇ మెయిల్
jeevanapageps@gmail.com ఫోన్ నెం. 9490099006
మీ ప్రశ్నలకు 12-6 గంటల వరకు ఫోనులో చెప్పవచ్చు. ఆదివారం సెలవు.

మనసులో మాట!

అమ్మాయి అయినా, అబ్బాయి అయినా వారి బెస్ట్‌ఫ్రెండ్స్ తల్లిదండ్రులే అవుతారు. మన మనసులోని భావాలనూ వారు తెలుసుకోగలరు. అలాంటివారి దగ్గరా కొన్ని విషయాలను దాచిపెడుతుంటాం. అలా దాచిపెట్టిన విషయాలను ధైర్యంగా బయటపెట్టండి అంటున్నారు కొందరు. అందుకు 'క్వారా' పేరుతో ఉన్న ఓ వెబ్‌సైట్ వేదికైంది. అలాంటి విషయాలను తల్లిదండ్రులకు షేర్ చేసుకునే అవకాశాన్ని కల్పించింది. ఇంతవరకు ఎవరికీ తెలియకుండా దాచిన విషయాలు, ఎవ్వరికీ చెప్పలేని రహస్యలను క్వారా వెబ్‌సైట్ ద్వారా పంచుకోవచ్చు.

నా వంతుగా..!



ఈరోజు ఎవరి రహస్యాన్ని అయితే ముందుకు తెచ్చామో అతని పేరు షవన్ చౌదరి. ఆయన ఓ క్వారా యూజర్. మనసును హత్తుకున్న ఆయన జీవితానుభవాలు మనతో పంచుకున్నారు. 'మా అమ్మ ఎప్పుడూ నన్ను అడుగుతూ ఉంటుంది. భవిష్యత్తు కోసం ఏమైనా పొదుపు చేస్తున్నావా? అని. మా నాన్న నాకెప్పుడూ ఓ సలహా ఇస్తుంటారు. మధ్యతరగతి కుటుంబంలో పొదుపు చేయడం అనేది చాలా ముఖ్యం. అనుకోని సంఘటనలు జరిగినప్పుడు ఆ సేవింగ్స్ మనకి ఉపయోగపడతాయని చెబుతుంటారు. నేను ఏడాదిగా జాబ్ చేస్తున్నాను. కానీ, నెలచివరిలో జేబులో ఒక్కరూపాయి ఉండడం లేదు. నిజంగానే నెల చివరి రోజుల్లో భవిష్యత్ కోసం నా దగ్గర ఎటువంటి సేవింగ్స్ లేవని గుర్తుకొస్తూ ఉంటుంది. అనవసరమైన వాటికి నేను డబ్బు ఖర్చు చేస్తుంటానని నా తల్లిదండ్రులు అనుకుంటుంటారు. కానీ, నాకు ఎలాంటి చెడు అలవాట్లు లేవు. గతేడాది నుంచి నేను నా మనసుకు నచ్చిన పనికోసం కొంత డబ్బును ఖర్చు చేస్తున్నాను. 'దగ్గరలోని స్లమ్ ఏరియాలో ఉండే చాలామంది పిల్లలు స్కూల్‌కు వెళ్లడం లేదన్న విషయం తెలియగానే నేను చాలా ఆశ్చర్యానికి గురయ్యాను. అక్కడి పిల్లలు స్కూల్‌కి వెళ్లాలనేది నా కోరిక' అంటున్నారు షవన్.



ఏడుపే ఎక్కువగా ఉంది

అందులో భాగంగా అక్కడి పిల్లలను షవనే స్వయంగా స్కూల్‌లో జాయిన్ చేయించారు. వారి స్కూల్ ఫీజులను కూడా తనే కడుతున్నాడు. వారికోసం స్టేషనరీ ఐటమ్స్ అన్నీ కొనిస్తున్నారు. ఇలాచేయడం వలన తనెంతో సంతోషంగా ఉన్నానని అంటున్నారు షవన్. ఈ విషయం గురించి షవన్ తన తల్లిదండ్రులకుగానీ, కుటుంబసభ్యులకు గానీ చెప్పలేదు. షవన్ తన శాలరీతో ఆ పేదపిల్లలకు డబ్బులు ఖర్చుచేస్తున్నాడని తన తల్లిదండ్రులకు చెప్పాలనుకుంటున్నాడు. ఈ పోస్టు పెట్టడానికి ముందే తను చదివించే పిల్లల్లో ఒకరి తల్లి షవన్‌కు ఫోన్ చేసింది. 'షవన్ అన్నా..! నా కూతురు సదియా క్లాసులో ఫస్టు వచ్చింది' అని చెప్పింది. సదియా తల్లి తన కూతురు ఫస్ట్ వచ్చిన విషయం షవన్‌తో ఏడుస్తూ ఫోన్లో చెప్పింది. ఆమె మాటలకంటే ఏడుపే ఎక్కువగా వినిపించింది షవన్‌కి. ఆ విషయం వినగానే షవన్ కొద్దిసేపు అలాగే మౌనంగా ఉండిపోయాడు. ఎందుకంటే, తన సంతోషాన్ని ఎవరితో పంచుకోవాలో అర్థం కాలేదు. 'ఆ సందర్భంలో నేనెంత సంతోషంగా ఉన్నానంటే మాటల్లో చెప్పలేను' అని అంటున్నాడు.

అమ్మానాన్న.. నన్ను క్షమించండి!

ఆ సంతోషంతోనే రూమ్‌కి బయలుదేరాడు. ఓ కప్పు చాయ్ తాగుతూ బాల్కనీ నుంచి కిందికి చూశాడు. ఓ నాలుగైదు సంవత్సరాల పాప చెత్త ఏరుకుంటూ, బిచ్చమెత్తుకుంటూ కనిపించింది. ఆ పాప బట్టలు చాలా మురికిగా, చినిగిపోయి ఉన్నాయి. చెప్పులు కూడా వేసుకోకుండా అలాగే నడుస్తుంది. నిజం చెప్పాలంటే పిల్లలు బొమ్మలతో ఆడుకుంటూ బిజీగా గడపాల్సిన వయసది. కానీ, ఆ పాప తన పొట్ట నింపుకోవడం కోసం పడుతోన్న కష్టం చూడలేకపోయాడు. ఒక్కపూట తినడానికి తిండి లేని పిల్లలు స్కూల్‌కు ఎలా వెళతారు? అనే ప్రశ్న మళ్లీ షవన్ మదిలో మెదిలింది. అంత చిన్నపాపను అలాంటి పరిస్థితుల్లో చూసి షవన్ మనసు చలించిపోయింది. 'అమ్మానాన్న! నన్ను క్షమించండి. కేవలం నా భవిష్యత్తు కోసం మాత్రమే ఆలోచించే వ్యక్తిగా మాత్రమే ఉండాలని అనుకోవడం లేదు. నాకు నచ్చిన ఈ పయనాన్ని కొనసాగిస్తాను' అంటూ షవన్ పెట్టిన ఈ చిన్న పోస్టు ద్వారా ఓ మంచి సందేశాన్ని ఈ ప్రపంచానికి చేరవేశాడు.

మనదేశంలో ఆకలిమంటలు, నిరక్షరాస్యత పెరుగుతూనే ఉన్నాయి. ఇలాంటి ఉరుకుల పరుగుల జీవితంలో, ఇతరుల కంటే ముందుండాలనే రేస్‌లో పాల్గొనడమే సరిపోయింది అందరికి. ఇక, ఇలాంటి పిల్లల్ని ఎవరు పట్టించుకుంటారు చెప్పండి? కానీ, దేశభవిష్యత్తు అంధకారంలో కూరుకుపోతుందన్న విషయం మాత్రం ఎవరికీ పట్టడం లేదు. దేశంలోని ప్రతి ఒక్క యువకుడు ఒక పేదపిల్లవాడి బాధ్యతను తీసుకుంటే రేపటి ఉజ్వల భవిష్యత్తును చూస్తామేమో అనిపిస్తుంది. దాంతో పాటు అక్షరాస్యత దేశాన్ని కూడా చూడొచ్చు.

- అమల తిలారు
(రాశీ, గజబ్ పోస్ట్ ఆధారంగా..!)



మీ కోసం

మొటిమల వల్ల చర్మం మీద దురద పెడుతుంటే రోజ్‌వాటర్ మిక్స్ చేసిన నీటితో ముఖాన్ని కడిగితే తగ్గుతుంది.

సెన్సెక్స్ ▲276	నిఫ్టీ ▲ 86	రూపాయి ▶ 0 పైసలు
31,568	9,852	ఒక అమెరికా డాలరుకు రూ. 64.11



తిరుపతిలో మాట్లాడుతున్న ఇండియన్ బ్యాంకు మేనేజర్ ఎన్.ప్రవీణ

మా అతిథి ఖాతాదారుడే..

ఇండియన్ బ్యాంకు తిరుపతి మేనేజర్ ఎన్.ప్రవీణ

ప్రజాశక్తి- తిరుపతిసిటీ

'మా ముఖ్య అతిథి.. విశిష్ట అతిథి ఖాతాదారులే' అని ఇండియన్ బ్యాంక్ తిరుపతి మేనేజర్ ఎన్.ప్రవీణ అన్నారు. బ్యాంకు ఖాతాదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక చదలవాడనగర్ శాఖలో బుధవారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఖాతాదారులనుద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ రుణాలను ఇండియన్ బ్యాంకు ద్వారా ప్రజలకు చేరువ చేస్తున్నామని చెప్పారు. ఇండియన్ బ్యాంక్ లావాదేవీల విషయంలో అత్యంత పటిష్టమైన స్థితిలో ఉందన్నారు. ఖాతాదారుల సేవలే మిన్నగా భావించి దినదినాభివృద్ధి చెందుతూ నేటికి 111 వసంతాలు పూర్తి చేసుకుందన్నారు. అత్యంత త్వరగా ఖాతాదారుల అవసరాల కనుగుణంగా బ్యాంకు నియమ నిబంధనలను అనుసరించి బ్యాంకులోని వివిధ విభాగాల ద్వారా గృహ, వాహన, వ్యవసాయ రుణాలు ఇస్తున్నామన్నారు. విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించేందుకు, వ్యాపారు రుణాలే కాకుండా అన్ని వర్గాల వారికీ ఎంఎస్ఎంఇ (సూక్ష్మ, చిన్నతరహా) రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది మురళీ మోహన్ రెడ్డి, ధనుంజయరావు, నీరజ, ఖాతాదారులు పాల్గొన్నారు.

బుగాట్టీ నుంచి రూ.20 కోట్ల కారు!



న్యూయార్క్: ఇప్పటి వరకు ఖరీదైన కార్లుగా చలామణి అవుతున్న కార్లను తలదన్నేలే బుగాట్టీ సంస్థ చిరాన్ కారును మార్కెట్లోకి తీసుకువచ్చింది. దీని ధరల అక్షరాల రూ. 19.21 కోట్లు. ఇప్పటి వరకు కేవలం మోటార్ షోలకే పరిమితమవుతూ వచ్చిన ఈ కారును ఇక మార్కెట్లోకి అందుబాటులోకి తెచ్చినట్టుగా సంస్థ పేర్కొంది. దీని అత్యధిక వేగం గంటకు 420 కిలోమీటర్లు.. ! విలాసవంతమైన కార్లకు చిరునామాగా నిలిచే బుగాట్టీ ఈ మోడల్ తొలి కారును అమెరికాలోని పెబల్ బీచ్‌లోని ఒక కస్టమర్‌కు డెలివరీ చేసింది. ప్రపంచ వ్యాప్తంగా తాము కేవలం ఈ మోడల్‌కు చెందిన 500 కార్లను మాత్రమే విక్రయిస్తామని సంస్థ తెలిపింది. వీటిల్లో సగానికిపైగా కార్లకు ఇప్పటికే బుకింగ్‌లు పూర్తయినట్టుగా సంస్థ వివరించింది. ఈ కారు 1.600 ఎన్ఎం టార్క్ వద్ద 1500 బీహెచ్‌పీ శక్తిని విడుదల చేస్తుంది. అత్యంత సౌకర్యవంతమైన ఇంటీరియర్‌తో దీనిని తీర్చిదిద్దారు. దీనిని 8లీటర్ డబ్ల్యూ16 ఇంజిన్‌తో తీర్చిదిద్దారు. దీనిలో రెండు దశల టర్బో చార్జర్ ఇంజిన్ ఉంది. ఈ టెక్నాలజీని బుగాట్టీ తొలిసారి వినియోగించినట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి.

జోరుగా బ్యాంకుల విలీనం

- ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటుకు కేబినెట్ నిర్ణయం
- కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వెల్లడి



మీడియాతో మాట్లాడుతున్న అరుణ్‌జైట్లీ

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ బ్యాంకుల ఏకీకరణకు సంబంధించిన అంశాలను పరిశీలించేందుకు గాను ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సర్కారు నిర్ణయించింది. బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఇందుకు సంబంధించిన ప్రతిపాదనకు మోడీ క్యాబినెట్ సమ్మతి తెలిపినట్టుగా ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. దేశంలోని బలమైన, పోటీతత్వంతో కూడిన బ్యాంకుల ఏర్పాటునకుగాను ఈ నిర్ణయం దోహదం చేయగలదని తాము భావిస్తున్నట్టుగా జైట్లీ వివరించారు. సర్కారు ఏర్పాటు చేయనున్న ప్రత్యామ్నాయ వ్యవస్థ ఆయా బ్యాంకుల నుంచి వచ్చిన ప్రతిపాదనలను ఆర్థిక స్థితిగతుల బట్టి విశ్లేషించి వాటి ఏకీకరణకు గాను సూత్రప్రాయంగా అనుమతులను జారీ చేస్తుందని ఆయన వివరించారు. దేశం మొత్తంగా బ్యాంకుల విలీనం జరిపి ఒక నిర్దిష్టమైన సంఖ్యలో మాత్రమే విత్త సంస్థలు ఉండాలని తమ సర్కారు భావించడం లేదని ఆయన వివరించారు. ఆయా విత్త సంస్థల విలీనంపై నిర్ణయమనేది ఆయా బ్యాంకు బోర్డుల వాణిజ్య పరిశీలనల మేరకే జరుగుతుందని ఆయన విశ్లేషించారు. ఈ ప్రత్యామ్నాయ వ్యవస్థలోకి సభ్యులను ప్రధాన మంత్రి నిర్ణయిస్తారని తెలుస్తోంది. అందుబాటులో ఉన్న సమాచారం మేరకు ఈ వ్యవస్థలో ఆర్థిక మంత్రి జైట్లీతో పాటుగా, రవాణా శాఖా మంత్రి నితిన్ గడ్కరి ఉండనున్నట్టుగా తెలుస్తోంది. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా భారతీయ స్టేట్ బ్యాంక్ కాకుండా దాదాపు 20 ప్రభుత్వ రంగ బ్యాంకులు పని చేస్తున్నాయి. ప్రభుత్వం నియమించే ప్రత్యామ్నాయ వ్యవస్థ నుంచి సూత్రప్రాయంగా అనుమతులు లభించగానే చట్ట ప్రకారం, మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ పరిమితులకు లోబడి బ్యాంకులు ఏకీకరణ దిశగా అడుగులు వేస్తాయని జైట్లీ వివరించారు. చిట్టచివరిగా భారతీయ రిజర్వు బ్యాంకుతో సంప్రదింపుల మేరకు సర్కారు విలీనపు పథకాలను నోటిఫై చేయనున్నట్టుగా సర్కారు ఒక ప్రకటనలో తెలిపింది.

రూ.2,000 నోటు రద్దు ఆలోచన లేదు

అతిపెద్ద కరెన్సీ నోటుగా చలామణిలో ఉన్న రూ.2000 నోటు రద్దుపై వస్తున్న ఊహాగానాలకు బుధవారం సర్కారు చెక్ చెప్పింది. రద్దు విషయంపై ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ స్పందించారు. రూ.2వేల నోటును రద్దు చేసే ప్రతిపాదనేదీ కేంద్రం వద్ద లేదనితెల్చి చెప్పారు. కొత్త రూ.200 నోటును ఎప్పట్నుంచి తీసుకొచ్చేది ఆర్‌బీఐ నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. తక్కువ నగదు విలువ కలిగిన కరెన్సీ కొరత దష్ట్యా రూ.200 నోటును తీసుకొచ్చేందుకు ఆర్‌బీఐకి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని పేర్కొన్నారు. అయితే, ఆ నోట్లు ఎప్పటి నుంచి ముద్రించాలి, ఎప్పటి నుంచి చలామణిలోకి తీసుకురావాలనే వివరాలను ఆర్‌బీఐనే చూసుకుంటుందని తెలిపారు. గతేడాది నవంబర్ 9న చలామణిలో ఉన్న రూ.500, రూ.1000 నోట్లను ప్రభుత్వం రద్దు చేసి రూ.500, రూ.2000 నోట్లను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే.

వరుసగా రెండో రోజూ లాభాలు..

దన్నుగా రియాల్టీ, బ్యాంకింగ్ షేర్లు

చెన్నై: రియాల్టీ, బ్యాంకింగ్ షేర్ల దన్నుతో వరుసగా రెండో రోజూ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. దీంతో పాటు ఇన్ఫోసిస్ చైర్మెన్‌గా నందన్ నీలేకని బ్యాధతలు చేపట్టవచ్చన ఊహగానాలు ఊపందుకోవడంతో బుధవారం ఇన్ఫీ షేర్ల కొనుగోళ్లకు మదుపర్లు ఆసక్తి చూపారు. ఈ నేపథ్యంలో ప్రధాన సూచీలు రికార్డు స్థాయిలను నమోదు చేశాయి. మరోవైపు అంతర్జాతీయంగా సానుకూల వాతవారణం నెలకొనడం కూడా కలిసొచ్చింది. ఈ నేపథ్యంలో బీఎస్ఈ సెన్సెక్స్ 276.16 పాయింట్లు లాభపడి 31,568.01 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 86.95 పాయింట్లు పెరిగి 9,852.5 వద్ద స్థిరపడింది. బీఎస్ఈలో రంగాల వారిగా రియాల్టీ సూచీ 3.48 శాతంతో అత్యధికంగా లాభాపడింది. ఇదే క్రమంలో లోహ 1.81శాతం, బ్యాంకింగ్ 1.39శాతం, పీఎస్‌యూ 1.2శాతం చొప్పున పెరిగాయి. మరోవైపు కన్స్యూమర్ డురెబుల్స్ సూచీ 0.75శాతం, ఎఫ్ఎంసీజీ 0.04శాతం చొప్పున పడిపోయాయి. అదానీ పోర్ట్స్ 2.79శాతం, భారతీ ఎయిరటెల్ 2.41శాతం, టాటా స్టీల్ 2.28శాతం, డాక్టర్ రెడ్డీస్ 2.25శాతం చొప్పున అధిక లాభాలను గడించిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు హెచ్‌యూఎల్ 1.05శాతం, సన్‌ఫార్మా 0.45శాతం, ఐటీసీ 0.28శాతం, పవర్ గ్రిడ్ 0.21శాతం, ఎంఅండ్ఎం 0.13శాతం చొప్పున అధిక నష్టాలను చవి చూసిన వాటిలో ముందు వరుసలో నిలిచాయి.

పొగాకు ఉత్పత్తి లక్ష్యం 136 మిలియన్ కిలోలు

బోర్డు సర్వసభ్య సమావేశం నిర్ణయం



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో 2017-18 ఆర్థిక సంవత్సరంలో 136 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి లక్ష్యంగా నిర్ణయిస్తూ బుధవారం హైదరాబాద్‌లో జరిగిన పొగాకు బోర్డు సర్వసభ్య సమావేశం నిర్ణయం తీసుకుంది. బోర్డు చైర్మన్ టి.వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రస్తుత సీజన్‌లో రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో పండించాల్సిన ఉత్పత్తి లక్ష్యాలను ఖరారు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను అధికారులు గుంటూరులో మీడియాకు విడుదల చేశారు. ఉత్తర తేలిక భూముల్లో 46 మిలియన్ కిలోలు, దక్షిణ తేలిక భూముల్లో 46 మిలియన్ కిలోలు, దక్షిణ నల్లరేగడి భూముల్లో 40 మిలియన్ కిలోలు ఉత్పత్తి చేయాలని నిర్ణయించారు. అయితే ఉత్తర నల్లరేగడి భూముల్లో కేవలం నాలుగు మిలి యన్ కిలోలు మాత్రమే ఉత్పత్తి చేయాలని నిర్ణయించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న పరిస్థితులు, రాష్ట్రంలో రైతులు, వ్యాపారుల నుంచి వచ్చిన విజ్ఞాపనలను పరిశీలించిన తరువాత ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో బోర్డు సభ్యులుగా ఉన్న పార్లమెంటు సభ్యులు గల్లా జయదేవ్, గోకరాజు గంగరాజు, లాల్ సిన్హావడోడియా, బోర్డులోని వివిధ రంగాలకు చెందిన సభ్యులు బాలినేని సీతయ్య, జి.సత్యనారాయణ, కిరణ్‌కుమార్, పి.వి.బసవ రాజప్ప, కిరణ్ కుమార్ మిశ్రా, వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఎయిరిండియా సీఎండీగా రాజీవ్ బన్సాల్



ముంబయి: ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిరిండియా (ఏఐ) కొత్త సీఎండీగా రాజీవ్ బన్సాల్‌ను సర్కారు ఎంపిక చేసింది. ఏఐ సీఎండీగా ఉన్న అశ్విన్ లోహానీని రైల్వే బోర్డు చైర్మెన్‌గా పంపిన సర్కారు.. ఆయన స్థానంలో రాజీవ్ బన్సాల్‌ను నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం బన్సాల్ పెట్రో లియం, సహజ వాయువు శాఖలో (ఆర్థిక వ్యవహారాల విభాగపు) అదనపు కార్యదర్శిగా పని చేస్తున్నారు. 'ఇండియాన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్-1988' బ్యాచ్‌కు చెందిన రాజీవ్‌కు ఎయిరిండియా చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ బాధ్యతలను కూడా అదనంగా అప్పగిస్తున్నట్టుగా పౌర విమానయాన శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. దాదాపు రూ.50,000 రుణ భారంతో కునారిల్లుతున్న ఎయిరిండియా సంస్థ విక్రయానికి సంబంధించి విధివిధానాల రూపకల్పన నిమిత్తం చర్చలు జరుగుతున్న సమయంలో సంస్థ చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా అశ్విన్‌ను తప్పించి రాజీవ్ బన్సాల్‌ను నియమించడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

'అపెక్స్' ఐపీవోకు స్పందన అదుర్స్!

ముంబయి: తెలుగు రాష్ట్రాలకు చెందిన అక్వాకల్చర్ ఉత్పత్తుల సంస్థ అపెక్స్ ఫ్రోజెన్ ఫూడ్స్ పబ్లిక్ ఇష్యూకు మెరుగైన స్పందన లభిస్తోంది. ఇష్యూ రెండో రోజైన బుధవారం తుది సమాచారం మేరకు ఈ ఇష్యూకు 1.12 రెట్ల మేర సబ్‌స్క్రిప్షన్ లభించినట్టు గణాంకాలు చెబుతున్నాయి. దాదాపు రూ.152 కోట్ల మేర నిధుల సమీకరణ కోసం అపెక్స్ ఫ్రోజెన్ ఫూడ్స్ సంస్థ ప్రాథమిక మార్కెట్లోకి అడుగు పెట్టిన సంగతి తెలిసింది. ఐపీవోలో భాగంగా 62,10,000 షేర్లను ఇష్యూకు అందుబాటులో ఉంచగా బుధవారం నాటికి దాదాపు 69,46.240 బిడ్లు లభించడం విశేషం. యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి అపెక్స్ ఫ్రోజెన్ ఇప్పటికే రూ.43 కోట్ల మేర నిధులను సమీకరించిన సంగతి తెలిసిందే. యాంకర్ ఇన్వెస్టర్ల వాటాలతో కలుపుకొని సంస్థ మొత్తం 87 లక్షల వాటాలను ఈ ఇష్యూ ద్వారా కంపెనీ జారీ చేయనుంది. రూ.10 ముఖ విలువ కలిగి ఒక్కో వాటాను ఐపీవోలో భాగంగా రూ.171-175 ధరల శ్రేణిలో విక్రయించనున్నట్లుగా కంపెనీ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే.

వర్తమాన అంశాలు (అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ) పోటీ పరీక్షల ప్రత్యేకం

సైనికులకిచ్చే అత్యున్నత పురస్కారం ?





కుర్రా శ్రీనివాసరావు,
సబ్జెక్టు నిపుణులు, తెనాలి.
సెల్ : 9701415678

రోబోటిక్ ఆయుధాలతో మానవాళికి ముప్పు

ప్రమాదకరమైన 'కిల్లర్ రోబోలు' వంటి స్వయం ప్రతిపత్తి ఆయుధాల వల్ల మానవాళికి తలెత్తనున్న ముప్పుల గురించి ప్రపంచ వ్యాప్తంగా వందమందికి పైగా రోబోటిక్, కృత్రిమ మేధస్సు సంస్థల దిగ్గజాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ ముప్పుపై స్పందించాలని ఐరాసకు విజ్ఞప్తి చేశాయి. 'స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రమాదకర ఆయుధాలు.. యుద్ధ రంగంలో మూడో విప్లవంగా రూపాంతరం చెందే ప్రమాదం ఉంది. వీటిని అభివృద్ధి చేస్తే సాయుధ ఘర్షణ విస్తృతి, వేగం.. ఊహకందని రీతిలో పెరుగుతాయి. ఉగ్రవాదులు.. వీటిని అమాయక ప్రజలపై ప్రయోగించే ప్రమాదం ఉంది. పైగా వీటిని హ్యాక్ చేసి.. అవాంఛనీయ రీతిలో ఉపయోగించవచ్చు. ముంచుకొస్తున్న ఈ ముప్పుపై స్పందించడానికి ఎక్కువ సమయం లేదు. ఈ వివాదాల తుట్టె తెరుచుకుందంటే.. దాన్ని ముగింపు పలకడం చాలా కష్టం" అంటూ ఐరాసకు ఒక లేఖను సమర్పించారు. దీనిపై సాంకేతిక పరిశ్రమకు చెందిన 116 మంది దిగ్గజాలు సంతకాలు పెట్టారు.

డయల్ 18004254440

రాష్ట్రానికి ఆవల ఉన్నవారు ఏపీ ప్రభుత్వం దృష్టికి ఏమైనా సమస్యలు తీసుకురాదలుచుకుంటే 1800424440 నెంబరుకు ఫోన్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. ఈ నెంబరును ఆగస్టు 22న మీడియాకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన 1100 పరిష్కార వేదిక కాల్ సెంటర్ నెంబర్‌కు రాష్ట్రానికి ఆవల ఉన్నవారు ఫిర్యాదు చేయాలంటే సమస్యలు వస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం కూడా అక్కడ ఇదే నెంబరుతో కాల్ సెంటర్‌ను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. దీంతో హైదరాబాద్‌లో నివసిస్తున్న సీమాంధ్ర ప్రజలు అక్కడి నుంచి ఇక్కడ తమ వాళ్ల ఎదుర్కొంటున్న సమస్యలపై ఫిర్యాదు చేయాలంటే వీలు కావడం లేదు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి ఈ ఏర్పాటు చేయించారు.

క్యాట్ సభ్యుడిగా జస్టిస్ రెడ్డి కాంతారావు

హైదరాబాద్‌లోని కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ (క్యాట్) జ్యుడీషియల్ సభ్యుడిగా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రెడ్డి కాంతారావును నియమిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఆగస్టు 23న బాధ్యతలు స్వీకరించారు. బి.వి.రావు పదవీ విరమణ అనంతరం దాదాపు 11 నెలలుగా ఖాళీగా ఉన్న జ్యుడీషియల్ సభ్యుడి పోస్టును భర్తీ చేస్తూ కేంద్రం ఈ ఉత్తర్వులించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో పనిచేస్తూ కేంద్ర సర్వీసులకు సంబంధించి వివాదాలు ఎదుర్కొంటున్న ఉద్యోగులు ఈ నియామకంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం బాలాడ గ్రామానికి చెందిన కాంతారావు ఆంధ్రా వర్శిటీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. 1980లో న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించి 1993లో జిల్లా, సెషన్స్ జడ్జిగా ఎంపికయ్యారు. జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ పదవితో పాటు వివిధ జిల్లాలలో జిల్లా జడ్జిగా పనిచేసిన ఆయన 2008 ఏప్రిల్‌లో హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులై, 2016 మేలో విరమణ చేశారు.

అలా క్రికెట్ ప్రసారాలు చేయొద్దు



నేతృత్వంలో సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది.

ఈఎస్‌పీఎన్, స్టార్ అందించే క్రికెట్ ప్రత్యక్ష దృశ్యాలను ప్రసారభారతి సంస్థ దూరదర్శన్ ద్వారా పునఃప్రసారం మాత్రమే చేయాలని, కేబుల్ ఆపరేటర్లకు ఇవ్వకూడదని సుప్రీం కోర్టు పేర్కొంది. ఈ విషయంలో ఫిబ్రవరిలో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. ప్రత్యక్ష ప్రసారాలను కేవలం తమ టెర్రిస్ట్రియల్, డీటీహెచ్ నెట్‌వర్క్ ద్వారా మాత్రమే ప్రసారభారతి ప్రసారం చేయాలి. లైవ్ ఫీడ్‌ను కేబుల్ ఆపరేటర్లకు ఇవ్వకూడదు. ఈ విషయంలో ఫిబ్రవరిలో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తున్నాం" అని రంజన్ గొగోయ్, నవీన్ సిన్హా

కొత్త చట్టం అవసరం లేదు

ముమ్మారు తలాక్‌పై కొత్తచట్టం తీసుకురావాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం సంకేతాలిచ్చింది. గృహహింసకు సంబంధించిన చట్టంతోపాటు ప్రస్తుతమున్న చట్టాలు ఇందుకు సరిపోతాయని పేర్కొంది. ఐదుగురు సభ్యుల ధర్మాసనంలోని మెజార్టీ సభ్యులు ముమ్మారు తలాక్‌ను రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించినట్లు ప్రాథమికంగా తీర్పు స్పష్టం చేస్తుందని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ అన్నారు. ముమ్మారు తలాక్‌పై ఆరునెలల్లోపు చట్టం చేయాలని జస్టిస్ జేఎస్ ఖేహర్, జస్టిస్ అబ్దుల్ నజీర్‌లు సూచించారు. లేనిపక్షంలో సుప్రీం ఆదేశాలు అమల్లో ఉంటాయన్నారు. అయితే మెజార్టీ సభ్యులు (ముగ్గురు) చట్టం తేవాలని చెప్పలేదని న్యాయశాఖ అధికారులు వివరించారు. 2002 షమీమ్ అరా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ఏకీభవిస్తున్నట్లు.. జస్టిస్ కురియన్ జోసెఫ్, జస్టిస్ ఆర్.ఎఫ్.నారిమన్, జస్టిస్ లలిత్‌లు చెప్పారు. ఆ కేసులో తలాక్‌కు ఎలాంటి పద్ధతి అనుసరించాలో చెబుతూ సుప్రీం కోర్టు మార్గదర్శకాలు జారీ చేసింది. "తలాక్‌కు కచ్చితంగా సహేతుకమైన కారణం ఉండాలి. తలాక్‌కు ముందు భార్యా భర్తల మధ్య సయోధ్య కుదర్చడానికి ఇద్దరు మధ్యవర్తుల ద్వారా ప్రయత్నం జరగాలి. ఒకవేళ సయోధ్య విఫలమైతే తలాక్‌ను అమలుచేయొచ్చు" అని పేర్కొంది. ఇకపై తలాక్ విషయంలో వీటిని పాటించాల్సి ఉంటుందని న్యాయశాఖ అధికారులు అభిప్రాయపడ్డారు. మెజార్టీ ధర్మాసనం ముమ్మారు తలాక్ రాజ్యాంగ విరుద్ధమని చెప్పింది తప్పితే.. మొత్తం తలాక్‌ను నిషేధించలేదని వారు పేర్కొన్నారు. ఒకవేళ మొత్తం తలాక్‌నే రద్దు చేసి ఉంటే, ముస్లింల విడాకుల కోసం కొత్త చట్టం తీసుకురావాల్సి వచ్చేదని అభిప్రాయపడ్డారు. ఇకపై ముమ్మారు తలాక్ చెల్లుబాటు కాదని.. అలాంటి చర్యకు పాల్పడిన వ్యక్తిపై వేధింపులు, గృహహింస కింద భార్య కేసు పెట్టొచ్చని చెప్పారు. ఇటు సుప్రీం తీర్పునకు కట్టుబడి, సరైన చర్యలు తీసుకునేలా కేంద్రం అన్ని రాష్ట్రాలకూ మార్గదర్శకాలు జారీ చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

మహిళల విభాగంలో హారిక 'టాప్'

అబుదాబి ఓపెన్ చెస్ అంతర్జాతీయ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక మహిళల విభాగంలో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. యూఏఈలోని అబుదాబిలో మంగళవారం ముగిసిన ఈ టోర్నీలో హారిక మొత్తం 5.5 పాయింట్ల స్కోరు చేసింది. చివరిదైన తొమ్మిదో రౌండ్‌లో హారిక 43 ఎత్తుల్లో డేవిడ్ ఎగెల్‌స్టన్ (ఇంగ్లండ్) పై విజయం సాధించింది. ఓవరాల్ ర్యాంకింగ్స్‌లో మాత్రం హారిక 29వ స్థానంలో నిలిచింది. ఈ టోర్నీలో హారిక నాలుగు గేముల్లో గెలిచి, మూడు గేమ్‌లను డ్రా చేసింది. మరో రెండు గేముల్లో ఓడిపోయింది. ఓపెన్ విభాగంలో అమీన్ బాసిమ్ (ఈజిప్ట్) 7.5 పాయింట్లతో విజేతగా నిలువగా.. నైజెల్ షార్ట్ (ఇంగ్లాండ్-7 పాయింట్లు) రెండో స్థానంలో, ఆర్యన్ చోప్రా (భారత్ -6.5 పాయింట్లు) మూడో స్థానంలో నిలిచారు.

★

తెలుసుకోండి మీ నాలెడ్జ్

1. ప్రపంచ అవయవదాన దినోత్సవం ఎప్పుడు జరుపుకుంటారు ?
ఎ. ఆగస్టు 13 బి. ఆగస్టు 14
సి. ఆగస్టు 23 డి. ఆగస్టు 15

2. భువనేశ్వర్‌లోని నందన్ కానన్ జూలో ఇటీవల మరణించిన తెల్లపులి పేరేమిటి ?
ఎ. నిన్జా బి. కుసుమ్
సి. సాబిర్ డి. సిస్సీ

3. బ్రిటన్‌లో మెన్సా నిర్వహించిన ఐక్యూ పరీక్షలో 162 స్కోర్ సాధించిన తెలుగు విద్యార్థి ఎవరు ?
ఎ. బండి శశాంక్ బి. అంబటి యశ్వంత్
సి. బండి యశ్వంత్ డి. దండి సాత్విక్

4. మెదడువాపు (ఎన్ సెఫలైటిస్) వ్యాధి ఏ సూక్ష్మజీవుల వల్ల వస్తుంది ?
ఎ. బ్యాక్టీరియా బి. ఫంగస్
సి. మైట్స్ డి. వైరస్

5. జాతీయ ఉపరితల జల రవాణా మార్గం -4లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో డ్రెడ్జింగ్ పనులు ఎక్కడ ప్రారంభం అయ్యాయి ?
ఎ. మచిలీపట్నం- విజయవాడ
బి. ముక్త్యాల -విజయవాడ
సి. కాకినాడ - విజయవాడ
డి. ఫైవేవీ కావు

6. ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ మహిళల 200 మీటర్ల రన్నింగ్‌లో వరుసగా రెండోసారి స్వర్ణం సాధించిన నెదర్లాండ్స్ రన్నర్ ?
ఎ. డాఫ్స్ షిపర్స్ బి. ఉసేన్ బోల్ట్
సి. మైరాజ్ అహ్మద్ డి. మో ఫరా

7. ఉద్యాన పంటల సాగులో ఆంధ్రప్రదేశ్ ఎన్నో స్థానంలో ఉంది ?
ఎ. మొదటి స్థానం బి. రెండో స్థానం
సి. మూడో స్థానం డి. నాల్గో స్థానం

8. ఇటీవల కేంద్ర ప్రభుత్వం స్వాతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాలు అయిన సందర్భంగా ఎన్ని పథకాల గురించి ప్రచారం నిర్వహించింది ?
ఎ. 20 పథకాలు బి. 30 పథకాలు
సి. 50 పథకాలు డి. 70 పథకాలు

9. భారీ స్థాయిలో భారత త్రివిధ దళాలు ఏ దేశంతో కలిసి అక్టోబరు 19 నుంచి 10 రోజుల పాటు విన్యాసాలు




నిర్వహించనున్నాయి ?
ఎ. రష్యా బి. కెన్యా
సి. అమెరికా డి. బ్రిటన్

10. హైదరాబాద్‌లో నవంబర్‌లో జరగనున్న 'గ్లోబల్ ఎంటర్‌ప్రూనర్‌షిప్ సమ్మిట్' 2017కు ఎన్ని దేశాల ప్రతినిధులు హాజరుకానున్నారు ?
ఎ. 170 బి. 130
సి. 120 డి. 175

సమాధానాలు : 1.ఎ, 2.బి, 3.సి, 4.డి, 5.బి, 6.ఎ, 7.సి, 8.డి, 9.ఎ, 10.ఎ

బిట్‌బ్యాంక్

1. కోరుకున్న లక్షణాలతో పిల్లలు జన్మించడానికి జన్యు సవరణలతో మానవ పిండం అభివృద్ధి చేసే పరిశోధన చేసింది ఎవరు ? **- అమెరికా శాస్త్రవేత్తలు (ఈ బృందంలోని భారతీయుడు సంజీవ్ కౌల్)**
2. ఇటీవల ఎక్కడి జూలో 'కుసుమ్' అనే తెల్లపులి మరణించింది ? **- నందన్ కానన్ (భువనేశ్వర్) ఒడిశా**
3. ఇటీవల గొల్లపూడి శ్రీనివాస్ జాతీయ అవార్డు - 2016 అందుకున్నది ఎవరు ? **- హేమంత్ ఎం.రావు (ఉత్తమ పరిచయ దర్శకుడు) గోది బన్న సాధారణ బైకట్టు (కన్నడ చిత్రం)**
4. తెలంగాణలో మూతబడిన ఏ ఎరువుల కర్మాగారం ఏడాదిలోగా పునరుద్దరణ చేయనున్నారు ? **- ఆర్ఎఫ్‌సిఎల్ (రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్)**
5. తెలంగాణలో హరితహారంలో విశేష కృషిచేసిన వారికి స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఏ పేరుతో అవార్డులు ఇచ్చింది ? **- హరిత మిత్ర**
6. 1971లో పాకిస్తాన్‌కు పట్టుబడి జైలు గోడలు బద్దలు కొట్టుకొని వచ్చిన వీరసైనికుల గాథ ఆధారంగా నిర్మిస్తున్న సినిమా ఏది ? **- ది గ్రేట్ ఇండియన్ ఎస్కేప్ (తరణజీత్ సింగ్ దర్శకుడు)**
7. ప్రవాస భారతీయులు ఓటర్లుగా నమోదు చేసుకొనడానికి ఏ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి ? **- ఓవర్సీస్ ఇండియన్ ఓటర్స్**
8. ఇటీవల జరిగిన ప్రపంచ అథ్లెటిక్ చాంపియన్ షిప్‌లో 4 x 100 రిలే పరుగు (ఉసేన్ బోల్ట్ చివరి ట్రాక్ ఈవెంట్)లో స్వర్ణం సాధించిన జట్టు ఏది ? **- బ్రిటన్**
9. ఆసియా షాట్‌గన్ చాంపియన్ షిప్ పోటీలో మిక్స్‌డ్ విభాగంలో స్వర్ణం సాధించిన క్రీడాకారులు ఎవరు ? **- మైరాజ్ అహ్మద్ ఖాన్ - రష్మీ రాథోడ్ జోడీ**
10. ఇటీవల రిటైర్మెంట్ ప్రకటించిన బ్రిటన్ అథ్లెట్ ఎవరు ? **- మో ఫరా (బ్రిటన్) 10 వేల మీటర్ల పరుగు స్వర్ణ విజేత**
11. భారత నాణ్యతా మండలి క్యూసిఐ తెలంగాణలోని ఏ జిల్లాలను నూరు శాతం మరుగుదొడ్లు కలిగిన జిల్లాలుగా ప్రకటించింది ? **- కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల**
12. ఎపిఎస్ఆర్‌టిసికి ఏ విభాగంలో జాతీయ అవార్డు లభించింది ? **- బెస్ట్ బ్రాండింగ్, మార్కెటింగ్ కమ్యూనికేషన్స్**
13. దేశంలోనే తొలిసారిగా అమరావతిలో ఏ సమస్యపైన కమాండ్ కమ్యూనికేషన్ సెంటర్ ఏర్పాటు చేశారు ? **- పారిశుధ్య సమస్య**
14. ఎవరి నాయకత్వంలో గుంత్తోరు జిల్లాకు చెందిన 13



మంది ఆఫ్రికాలోని కిలిమంజారో శిఖరం అధిరోహించారు ? **- రఘునాథ్**
15. స్వచ్ఛందంగా చేనేత వస్త్రాలకు ప్రచారకర్తగా వ్యవహరిస్తానని ప్రకటించిన మిస్ ఏషియా ఇంటర్‌నేషనల్ ఎవరు ? **- రష్మీ ఠాకూర్**
16. ఆంధ్రప్రదేశ్‌లో నిర్మిస్తున్న ప్రతిష్టాత్మక పోలవరం ప్రాజెక్టు ఎన్ని గేట్లతో నిర్మిస్తున్నారు ? **- 48 గేట్లు**
17. ప్రముఖ రచయిత్రి మాలతీ చందూర్ పురస్కారం 2017కు ఎంపికైన ప్రముఖ రచయిత్రి ఎవరు ? **- శివరాజు సుబ్బలక్ష్మి**
18. ఏ దేశంపై టెస్ట్ సిరీస్ 3-0తో గెలవడం ద్వారా తొలిసారి విదేశీ గడ్డపై మూడు అంత కన్నా ఎక్కువ టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను వైట్ వాష్ చేసింది ? **- శ్రీలంక**
19. జమ్మూ కాశ్మీర్‌లోని మహిళ ఆ రాష్ట్రం వెలుపల వ్యక్తిని పెళ్లి చేసుకుంటే ఆమెకు, ఆమె సంతానానికి ఆ రాష్ట్రంలో ఆస్తి హక్కులు, ఉపాధి అవకాశాలు ఉండవని చెప్పే అధికరణం ఏది ? **- 35 ఎ**
20. పోలీస్ విభాగంలో అత్యున్నత శౌర్య పురస్కారం అయిన పోలీస్ శౌర్య పతకం ఎవరికి ప్రకటించారు ? **- శంకర్‌రావు కమాండర్**
21. సైనికులకిచ్చే అత్యున్నత పురస్కారం ? **- అశోక్‌చక్ర**
22. సైనికులకిచ్చే రెండో అత్యున్నత పురస్కారం ? **- కీర్తిచక్ర**
23. 71వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎంతమందికి కీర్తిచక్ర పురస్కారాలు ప్రకటించారు ? **- ఐదుగురికి (గిరి గురుంగ్, డేవిడ్ మన్లుం, ప్రమోద్ కుమార్, ప్రీతం సింగ్, చేతన్ కుమార్ చీతా)**
24. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కాశ్మీర్‌లో జెండా ఎగుర వేసిన ఆరేళ్ల బాలిక ఎవరు ? **- అర్ణ (కీర్తిచక్ర గ్రహీత - ప్రమోద్‌కుమార్ కుమార్తె)**

ఉక్కు ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-పెదగంట్యాడ, విశాఖ

పెదగంట్యాడ హెల్త్ సెంటర్ ద్వారా ఉక్కు ఉద్యోగులకు మెరుగైన వైద్య సౌకర్యం కల్పించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన హెల్త్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జాతీయ కార్యవర్గ సభ్యులు ఎన్.రామారావు మాట్లాడారు. సుమారు 4వేల మంది కార్మికులు వారి కుటుంబసభ్యులు ఆధారపడి ఉన్న ఈ హెల్త్ సెంటర్‌లో స్పెషలిస్టు వైద్యులు, అన్ని రకాల మందులు అందుబాటులో లేకపోవడంతో ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఆన్‌లైన్ సౌకర్యాలు మెరుగు పరచాలని, రక్తనిర్ధారణ పరీక్ష సేకరణ సమయం పెంచాలని, ఎక్సరే మిషన్ వినియోగంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

ఆటో కార్మికులపై అక్రమ కేసులకు నిరసనగా ధర్నా

ప్రజాశక్తి -బాపట్ల (గుంటూరు)

ఆటో కార్మికులపై పోలీసు అధికారులు అక్రమ కేసులు బనాయించడాన్ని నిరసిస్తూ బాపట్ల ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎ.సుభాని మాట్లాడుతూ.. ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగాల్లేక స్వయం ఉపాధి పొందుతున్న ఆటో కార్మికులపై ఆర్‌డిఒ, పోలీసు అధికారులు అక్రమంగా కేసులు నమోదు చేస్తున్నారన్నారు. స్టాండింగ్ కమిటీ సిఫార్సులపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించనందున తప్పనిసరి పరిస్థితుల్లో ధర్నాకు దిగాల్సి వచ్చిందని చెప్పారు. ఆటో వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నన్నపనేని శివాజీ మాట్లాడుతూ.. ఆటో కార్మికులు ఒంటరిగా లేరని, సిఐటియు వారికి అండగా ఉందని తెలిపారు. ఆటో కార్మికుల జీవనోపాధికి భంగం కలిగించే చర్యలు మానకోకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

'ప్రయివేట్ పాఠశాలల రక్షణకూ ప్రత్యేక చట్టం తేవాలి'

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలని ప్రకాశం జిల్లా ప్రయివేట్ విద్యా సంస్థల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలు ఎంసిఎ భవనంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో కర్నూలు జిల్లా ప్రయివేట్ విద్యా సంస్థల సంఘం నాయకుడు శ్రీనివాసరెడ్డి, పుల్లయ్యపై కొందరు విద్యార్థి సంఘాల నాయకుల ముసుగులో చేసిన దాడిని వారు ఖండించారు. ఐక్యవేదిక నాయకులు, ఎపిటిసిఎ రాష్ట్ర అధ్యక్షులు పి.ప్రకాష్‌బాబు మాట్లాడుతూ.. కర్నూలు జిల్లాలో ఓ ప్రయివేట్ విద్యా సంస్థలో విద్యార్థి మృతిచెందటంతో వారి కుటుంబసభ్యులను పరామర్శించటానికి వెళ్ళిన శ్రీనివాసరెడ్డి, పుల్లయ్యలపై విద్యార్థి సంఘాల నాయకులమని చెప్పుకునే కొందరు దాడి చేయటం దారుణమన్నారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ప్రయివేట్ పాఠశాల యాజమాన్యాలకు ప్రత్యేక చట్టం తేవాలని అన్నారు.

ప్రయివేటుకు అగ్రిమార్కెట్లు!

- కడప, అనంత జిల్లాల క్లస్టర్లపై కన్ను
- విదేశాలకు పండ్ల ఎగుమతులు
- ఆన్‌లైన్ ధరల పట్టిక ఏర్పాటుపై పేచీ
- రైతు సంఘాల ఏర్పాట్లలో నిమగ్నం




కడప జిల్లాలోని అరటి, దానిమ్మ పండ్ల తోటలు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

'కడప, అనంతపురం జిల్లాలను హార్టీకల్చర్ హబ్‌గా మారుస్తా' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన పర్యటనల సందర్భంగా తరుచు చేస్తున్న ప్రకటన ఇది. ఈ ప్రకటన ఆచరణకొచ్చేసరికి తమకు అన్యాయం జరుగుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలోనే అగ్రి మార్కెట్‌ను ప్రయివేటు సంస్థలకు అప్పగించడానికి బాబు ప్రభుత్వం తీవ్ర కసరత్తు చేస్తోంది. అగ్రి ఉత్పత్తుల ఆన్‌లైన్ ధరల పట్టికలను క్లస్టర్లలో ఏర్పాటు చేయడంపై చేతులెత్తేస్తోంది. ఈ నేపథ్యంలో మార్కెట్‌ను నాలుగు ప్రయివేటు మార్కెటింగ్ సంస్థల పరం చేయడానికి రంగం సిద్ధం చేసింది. ఒకవైపు దళారులను నియంత్రించినట్లు కనిపించించినా, రెండోవైపు ఆన్‌లైన్ ధరల పట్టిక ఏర్పాటు చేయకపోవడం, ఫ్యూచర్, ఫార్వర్డ్ ట్రేడింగ్‌లపై స్పష్టత లేకపోవడం పలు సందేహాలకు తావిస్తోంది. రాష్ట్రంలో కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాలు పండ్ల తోటలకు నిలయం. రాయలసీమలో అరటి, దానిమ్మ, మామిడి, చీనీ వంటి వాణిజ్య పంటలను అధికంగా సాగు చేస్తుంటారు. కడప జిల్లాలో 37,500 ఎకరాల్లో అరటి, 500 ఎకరాల్లో దానిమ్మ, 67,500 ఎకరాల్లో మామిడి సాగవుతోంది. కడప జిల్లా అరటి ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉంది. ఇక్కడి నుంచి తూర్పు, మధ్య ఆసియా దేశాలతో సహా యూరప్ దేశాలకు అరటి, మామిడి ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. ఈ ఎగుమతుల నేపథ్యంలో వ్యవసాయమార్కెట్లపై ప్రయివేటు మార్కెటింగ్ సంస్థలు కన్నేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం దళారులను నియంత్రిస్తామనే పేరుతో రాజంపేట, పులివెందుల, తాడిపత్రి ప్రాంతాల్లో క్లస్టర్లును ఏర్పాటు చేసింది. క్లస్టర్ల పరిధిలోని మండలాల రైతులు పండించిన నాణ్యమైన అరటి, మామిడి, దానిమ్మ ఉత్పత్తుల సేకరణ, ప్రయివేటు మార్కెటింగ్ సంస్థలకు అనుసంధానానికి రైతు సంఘాలను ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాలో పది సంఘాలను ఏర్పాటు చేసింది.

జిల్లాలో ఏటా 10 లక్షల టన్నుల అరటి దిగుబడి లభిస్తోంది. దీనిపై ఫ్యూచర్, ఐఎన్ఎన్, సుమాఆగ్రో, అమీ షాఫుడ్స్ మార్కెటింగ్ సంస్థలు కన్నేసినట్లు తెలిసింది. ఏడాది కింద నుంచే చాపకింద నీరులా కార్యకలాపాలు సాగిస్తున్నాయి. గతేడాది రాయదుర్గంలో నిర్వహించిన ఆన్‌లైన్ మార్కెటింగ్ జయప్రదం కావడంతో అగ్రి మార్కెటింగ్‌లోకి ప్రవేశించినట్లు సమాచారం. ప్రస్తుత సీజన్‌లో ప్రయివేటు గుత్త సంస్థలు ప్రవేశానికి కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఉద్యానశాఖ కమిషనర్‌తో చర్చించినట్లు సమాచారం. ఫ్యూచర్స్ సంస్థ 10 వేల టన్నుల అరటి దిగుబడి కొనుగోలుకు సంసిద్ధత వ్యక్తపరిచినట్లు తెలిసింది. మరో మూడు సంస్థల ప్రతినిధులు ఉద్యానశాఖ కమిషనర్‌తో చర్చించినట్లు సమాచారం. రైతులకు విపణి ధరలపై అవగాహన లేకపోవడంతో గుత్త సంస్థలు చెప్పిన ప్రకారం విక్రయించే ప్రమాదమూ ఉంది.

సెప్టెంబరులో విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె

- కాంట్రాక్టు విద్యుత్ కార్మికులను పర్మినెంట్ చేయాలి
- ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకాశి

ప్రజాశక్తి-సీతమ్మధార, విశాఖ/తిరుపతిసిటీ

రాష్ట్ర వ్యాప్తంగా జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కమ్‌ల్లో విధులు నిర్వర్తిస్తున్న 25 వేల మంది విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.బాలకాశి డిమాండ్ చేశారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మిక సంఘాలు బుధవారం విశాఖలోని గురుద్వార నుంచి ర్యాలీగా వెళ్లి ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా బాలకాశి మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కరిస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందన్నారు. సెప్టెంబర్ 30వ తేదీలోగా ఉద్యోగుల రెగ్యులర్‌కు సంబంధించి స్పష్టమైన ప్రకటన రాకుంటే సమ్మె చేపట్టనున్నట్లు హెచ్చరించారు. కాంట్రాక్టు ఉద్యోగులందరికీ తక్షణమే ఇఎస్ఐ, పిఎఫ్ వంటి ఉద్యోగ భద్రత ప్రయోజనాలను ప్రకటించాలన్నారు. విధి నిర్వహణలో మరణించిన కాంట్రాక్టు ఉద్యోగులకు రూ.10 లక్షల నష్టపరిహారాన్ని ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఇపిడిసిఎల్ కార్పొరేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎపిఇపిడిసిఎల్ ఎండి నాయక్‌కు వివిధ విద్యుత్ ఉద్యోగుల కాంట్రాక్టు సంఘాల ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు.



విశాఖ ధర్నాలో మాట్లాడుతున్న బాలకాశి

సిఎండికి నోటీసు ఇచ్చిన నాయకులు

విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి సెప్టెంబర్ 30 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి వెల్లడించారు. ఈ మేరకు డిస్కమ్ సిఎండి హెచ్‌వై దొరకు బుధవారం సమ్మె నోటీసు అందజేశారు. వందలాదిమంది కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న పోరాటం న్యాయమైనదని, ప్రభుత్వం స్పందించి వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వయసు, విద్యార్హతతో సంబంధం లేకుండా కాంట్రాక్టు కార్మికులందరినీ క్రమబద్ధీకరించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించాలని, అక్రమంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, మీటర్ రీడర్లు, బిల్‌కలెక్టర్లకు పీస్‌రేటు రద్దు చేసి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో మృతి చెందిన కార్మిక కుటుంబాలకు రూ.10 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని, ప్రతినెలా ఒకటో తేదీ బ్యాంకు ద్వారా జీతాలు చెల్లించాలని ఆయన కోరారు. యూనియన్ నాయకులు రామయ్య, సుబ్రమణ్యం రాజు, నరేష్‌బాబు, పాపారావు, ఖాదర్‌వల్లి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలపై సర్కార్ నిర్లక్ష్యం

ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులరెడ్డి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని పట్టభద్రుల ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులరెడ్డి కోరారు. ఒంగోలులోని సంతపేట ఎస్సీ బాలికల వసతి గృహాన్ని ఆయన బుధవారం సందర్శించారు. విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు మాట్లాడుతూ.. 3 నెలల నుంచి కాస్మోటిక్ ఛార్జీలు రాలేదని, వర్షం వస్తే గదులు నీటితో నిండిపోతున్నాయని తెలిపారు. హాస్టల్‌లో పెచ్చులు ఊడిపోవటంతో భయంతో కాలం వెళ్ళదీస్తున్నామని, ఆర్వో ప్లాంట్ పనిచేయటం లేదని వివరించారు. యండపల్లి మాట్లాడుతూ.. సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలన్నారు. 2012లో విద్యార్థుల మెస్‌ఛార్జీలు పెంచారని, 5 సంవత్సరాలైనా ఇంత వరకూ పెంచలేదని విమర్శించారు. రోజుకు రూ.25లతో ఏవిధంగా తింటారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిడి హాస్టళ్ల విద్యార్థుల సమస్యలపై నిర్లక్ష్యంగా ఉండటం సరైంది కాదన్నారు.



ఒంగోలు తూర్పుపాలెంలోని ఎస్సీ బాలుర హాస్టల్లో విద్యార్థులతో కలిసి రాత్రి భోజనం చేస్తున్న ఎమ్మెల్సీ యండపల్లి

తూర్పుపాలెం బాలుర హాస్టల్‌లో ఎమ్మెల్సీ భోజనం

ఒంగోలు తూర్పుపాలెం ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులరెడ్డి విద్యార్థులతో కలసి బుధవారం రాత్రి భోజనం చేశారు. ఈ సందర్భంగా సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

త్వరలో పోలవరం పూర్తి చేస్తాం

ప్రకాశం పంతులు జయంతి సభలో ప్రభుత్వ సలహాదారు పరకాల

ప్రజాశక్తి - నాగులుప్పలపాడు (ప్రకాశం)

టంగుటూరి ప్రకాశం పంతులు స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 23 ప్రాజెక్టులను పూర్తి చేయడానికి శ్రీకారం చుట్టారని, అందులో భాగంగానే త్వరలో పోలవరం పూర్తి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకరరావు తెలిపారు. ప్రకాశం పంతులు స్వగ్రామమైన వినోదరాయునిపాలెంలో ఆయన 146వ జయంతి ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రకాశం పంతులు కాంస్య విగ్రహాన్ని మంత్రి శిద్ధా రాఘవరావు ఆవిష్కరించారు. సభకు ఎంపిపి వీరయ్యచౌదరి అధ్యక్షత వహించారు. సభలో ప్రభాకరరావు మాట్లాడుతూ.. గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దినప్పుడే ఆదర్శ ఆంధ్రప్రదేశ్ సాధ్యమవుతుందని చెప్పారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఈదర హరిబాబు మాట్లాడుతూ.. ప్రకాశం పంతులు, ఎన్‌టిఆర్ తెలుగు జాతి ముద్దుబిడ్డలని కొనియాడారు. శిద్ధా రాఘవరావు మాట్లాడుతూ.. ప్రకాశం పంతులు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వినయ్‌చంద్, స్థానిక ఎమ్మెల్యే ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్సీ కరణం బలరాం కృష్ణమూర్తి, టంగుటూరి ప్రకాశం పంతులు మనవడు గోపాలకృష్ణ, టిడిపి సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బిఎన్.విజయ్‌కుమార్, ఆర్‌డిఒ కమ్మ శ్రీనివాసరావు, డిఎస్‌పి గుంటుపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బొబ్బిలి రైల్వే స్టేషన్‌ను పరిశీలించిన డిఆర్‌ఎం

ప్రజాశక్తి- బొబ్బిలి టౌన్ (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా బొబ్బిలి రైల్వే స్టేషన్‌ను రైల్వే డివిజనల్ మేనేజర్ మాతూర్ ప్లాట్‌ఫారంపై పరిశుభ్రతను, పట్టాలు, సిగ్నల్ లైన్లను, పట్టాల జాయింట్లను బుధవారం పరిశీలించారు. స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా రైల్వే సమస్యలపై డిఆర్‌ఎంకు మున్సిపల్ చైర్‌పర్సన్ తూముల అచ్యుతవల్లి, టిడిపి కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి తూముల భాస్కరరావు, సిపిఎం డివిజన్ కార్యదర్శి రెడ్డి వేణు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఇందిర, రోటరీ క్లబ్ ఆఫ్ బొబ్బిలి టైగర్స్ అధ్యక్షులు చంద్రకిశోర్, కార్యదర్శి జి.శ్రీనివాసరావు వేర్వేరుగా వినతిపత్రాలు ఇచ్చారు.

ప్రజ్ఞ

జవాబులు

1. తెలంగాణ
2. అమెరికా
3. జయంత కలిత
4. ఆగస్టు 20
5. హాకీ క్రీడాకారుడు సర్దార్ సింగ్, పారాలింపియన్ దేవేంద్ర జజారియా

మార్కెట్‌యార్డుల్లో ఈ-నామ్ పద్ధతి

- 12 యార్డుల్లో ఇటీవల ప్రయోగాత్మకంగా అమలు
- త్వరలో రైతులకు అవగాహన సదస్సులు
- మార్కెటింగ్ శాఖ కసరత్తు




ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో మార్కెట్ యార్డుల్లో ఈ-నామ్ (ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెటింగ్) పద్ధతిని అమలు చేసేందుకు మార్కెటింగ్ శాఖ కసరత్తు చేస్తోంది. మార్కెట్ యార్డులకు రైతులు తెస్తున్న వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరలు కల్పించే పేరుతో దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లోని ధరల వివరాలను రైతులకు ఎప్పటికప్పుడు తెలియజెప్పి, మెరుగైన ధరలు దక్కడానికి ఈ-నామ్‌ను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన జాతీయ అగ్రికల్చర్ మార్కెట్ విధానం ద్వారా అంతర్జాతీయ, జాతీయ మార్కెట్లోని ధరలను రాష్ట్రంలోని రైతులకూ దక్కే విధంగా అధికారులు, మార్కెట్ యార్డు పాలక వర్గాలు కృషి చేయాల్సి ఉంది. ఇందులో భాగంగానే రాష్ట్రంలో 12 పెద్ద మార్కెట్ యార్డుల్లో ప్రయోగాత్మకంగా ఈ-నామ్ అమలుకు ఇటీవల శ్రీకారం చుట్టారు. గుంటూరు, కర్నూలు, ఆదోని, మదనపల్లి, కడప, రావులపాలెం, అనకాపల్లి, ఎమ్మిగనూరు, హిందూపూర్, కళ్యాణ్‌దుర్గం, ఏలూరు, గుడూరు తదితర మార్కెట్ యార్డుల్లో కమీషన్ ఏజెంట్ల ప్రభావం తగ్గించి రైతులే నేరుగా తమ ఉత్పత్తులను మంచి ధరలకు విక్రయించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ప్రత్యేక కమిషనర్ ఐ.శ్యామ్యూల్ ఆనంద్‌కుమార్ తెలిపారు. ఉత్పత్తిదారులు వారి పంటలను గ్రేడింగ్ చేసుకుని నాణ్యత కల్గిన వస్తువులను యార్డులకు తెస్తే దేశంలోని అత్యధిక ధరలు ఇక్కడా వస్తాయన్నారు. ఇందుకోసం రైతులకు యార్డుల పరిధిలో అవగాహన సదస్సులను నిర్వహిస్తారు. వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత నిర్ధారణకు ప్రభుత్వ, ప్రయివేటు, పబ్లిక్ (పిపిపి) భాగ స్వామ్యంతో ల్యాబ్‌ల నిర్మాణం చేపట్టాలని, దీనిపై కర్నా టక, మహారాష్ట్రలలో అధ్యయనం చేయాలని ప్రభుత్వం నిర్ణయి ంచింది. దేశంలోని ఆయాప్రాంతాల్లోని వ్యవసాయ ఉత్పత్తుల ధరలను తెలుగులోనే రైతులకు తెలిపేలా ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

ఈ-నామ్ విధానం అమలుకు సహకరించాలి

మార్కెటింగ్ శాఖ కమిషనర్ శామ్యూల్ ఆనంద్

మారుతున్న ప్రపంచస్థాయి విలువలకనుగుణంగా అధికారులు, రైతులు మారాల్సిన అవసరం ఉందని, ఈ క్రమంలోనే ఈ-నామ్ విధానం అమలుకూ సహకరించాలని మార్కెటింగ్ శాఖ కమిషనర్ శామ్యూల్ ఆనంద్ పేర్కొన్నారు. బుధవారం గుంటూరు జిల్లాలోని మిర్చి యార్డులో జిల్లా మార్కెట్ యార్డు చైర్మన్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 1 నుంచి జిల్లాలోని నాలుగు మార్కెట్ యార్డుల్లో ఈ-నామ్ విధానం అమలు చేస్తున్నామని చెప్పారు. ఈ విధానంతో రైతులకు మధ్యవర్తుల బెడద లేకుండా స్వేచ్ఛగా విక్రయం జరుపుకోవటానికి అవకాశం ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలో 191 యార్డులు, 345 సబ్ యార్డులు ఉండగా కేవలం 95 యార్డుల్లో మాత్రమే కార్యకలాపాలు జరుగుతున్నాయన్నారు. అన్ని యార్డుల్లో రైతులకు ఉపయోగం కలిగేలా ఏదో ఒక కార్యక్రమం నిర్వహించటానికి తగిన కార్యాచరణ రూపొందించామని, త్వరలోనే అన్ని యార్డులనూ రైతులకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు.



గుంటూరులో మాట్లాడుతున్న మార్కెటింగ్ శాఖ కమిషనర్ శామ్యూల్ ఆనంద్

ఫలించిన పోరాటం

వేతన ఒప్పందానికి 'ఎన్‌ఎసిఎల్' యాజమాన్యం అంగీకారం

దీక్షలు విరమించిన కార్మికులు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం అరిణాం అక్కివలసలోని నాగార్జున అగ్రికమ్ కార్మికుల 11 నెలల సుదీర్ఘ పోరాటం ఫలించింది. కార్మికుల పోరాటంతో దిగొచ్చిన యాజమాన్యం నూతన వేతన ఒప్పందం చేసుకోవడంతో పాటు ఇతర డిమాండ్లను ఆమోదించింది. కాంట్రాక్టు కార్మికులకు రోజువారీ వేతనానికి అదనంగా రూ.67, రెగ్యులర్ కార్మికులకు రూ.70 పెంచేందుకు, అటెండెన్స్ బోనస్ ఇచ్చేందుకు యాజమాన్యం బుధవారం అంగీకరించింది. పబ్లిక్ హాలీడే రోజు విధులు నిర్వహిస్తే మూడు రోజుల వేతనం ఇచ్చేందుకు ఆమోదించింది. రెగ్యులర్ కార్మికులకు పిఎల్ఐ, ఎల్‌టిఎ రూ.ఆరు వేలు ఇవ్వనుంది. నైట్ అలవెన్స్ కూడా కార్మికులకు కల్పించనుంది. కార్మికులకు ప్రమాద బీమా, మరణించిన కార్మికుని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం డిమాండ్లపై సానుకూలంగా స్పందించింది. విశాఖలో జరిగిన చర్చల్లో కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ వరహాలరెడ్డి, కంపెనీ వైస్ ప్రెసిడెంట్ టి.వి.రాజులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గోవిందరావు, నాగార్జున అగ్రికమ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి చిక్కాల సత్యనారాయణ పాల్గొన్నారు. పరిశ్రమ గేటు వద్ద దీక్షలో ఉన్న కార్మికులకు నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు.



తణుకు అవగాహనా సదస్సులో ప్రసంగిస్తున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

ఆత్మవిశ్వాసమే ఆయుధం

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి


ప్రజాశక్తి-తణుకు రూరల్(పశ్చిమగోదావరి)

నేటి ఆధునిక మహిళ ఆత్మవిశ్వాసమే ఆయుధంగా ప్రతి రంగంలోనూ రాణించాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి కోరారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు ఎస్‌సిఐఎం ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ర్యాగింగ్, మత్తుపానీయాలు, మద్యం నియంత్రణపై అవగాహనా సదస్సు కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రాజకుమారి అధ్యక్షతన బుధవారం జరిగింది. ముఖ్యవక్త రమాదేవి మాట్లాడుతూ పిల్లలు స్వేచ్ఛా వాతావరణంలో ఉంటే ర్యాగింగ్‌కు తావు ఉండదన్నారు. ఆధిపత్య సమాజం ఉండటం వల్లే ఐదేళ్ల బాలిక నుంచి వృద్ధ మహిళల వరకూ లైంగిక వేధింపులకు గురవుతున్నారని తెలిపారు. విద్యాహక్కు చట్టం అమలు కాకపోవడం, పేదరికం వల్ల కొంతమంది చదువుకు దూరంగా ఉంటున్నారని అన్నారు. కుటుంబ యజమానితోపాటు యువత కూడా మద్యానికి బానిసలవుతున్నారని, మహిళలే కుటుంబ బాధ్యతలు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు. లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా ప్రభుత్వాలు భర్తీ చేయకపోవడం వల్ల నిరుద్యోగ సమస్య పెరిగిపోతోందని చెప్పారు. ప్రభుత్వాల దుర్మార్గపు విధానాల వల్లే యువత మద్యం, డ్రగ్స్ తదితర చెడు వ్యసనాల వైపు మళ్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. స్వచ్ఛ భారత్ పేరిట సాగిస్తున్న ప్రచారం పక్కనపెట్టి మద్యం సేవిస్తే నష్టపోతారని, 30 సంవత్సరాల వయసుకే మరణం సంభవిస్తుందని ప్రభుత్వాలు ఎందుకు ప్రచారం చేయలేకపోతున్నాయని ప్రశ్నించారు. అనంతరం ఎస్ఎన్‌విటి జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ రాజశేఖర్ అధ్యక్షతన మత్తు పానీయాలపై నిర్వహించిన అవగాహన సదస్సులోనూ రమాదేవి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి, డివిజన్ కార్యదర్శి కె.నాగరత్నం, నాయకులు, కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు సాధికారత అమలుకు కమిటీ

మాతృభాషా మాధ్యమ వేదిక డిమాండ్

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)



సమావేశంలో మాట్లాడుతున్న బాలసుబ్రమణ్యం, పక్కన రమేష్‌బాబు

తెలుగు అభివృద్ధి ప్రాధికార సంస్థ ఏర్పాటు కోసం నియమించిన కమిటీ నివేదికను తెలుగు భాషా దినోత్సవం లోపు ఆమోదించాలని, సాధికారత అమలు చేయాడానికి నిపుణులతో కమిటీ ఏర్పాటు చేయాలని మాతృ భాషా మాధ్యమ వేదిక నాయకులు, శాసనమండలి సభ్యులు విఠపు బాలసుబ్రహ్మణ్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ గవర్నర్‌పేటలోని ఎగ్జిబిషన్ బుక్ సొసైటీ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం పరిపాలనలోగాని, ప్రజా రంగంలోగాని రాష్ట్ర ప్రభుత్వానికి ఒక నిర్దిష్టమైన భాషా విధానం లేదన్నారు. మున్సిపల్ పాఠశాలల్లో తెలుగు మీడియం ఉంటుందని శాసన మండలి సమావేశాల్లో చెబుతున్నా క్షేత్రస్థాయిలో మున్సిపల్ కమిషనర్లను బెదిరించి మున్సిపల్ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం పెట్టిస్తున్నారని తెలిపారు. మొదటి యూనిట్ పరీక్షలో విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియంలో ఉన్న ప్రశ్నాపత్రాన్ని ఇచ్చారని, దాంతో విద్యార్థులు జవాబులు రాయలేక పోయారని చెప్పారు. విద్యాశాఖ తెలుగు మీడియం పుస్తకాలు పంపిణీ చేయలేదని చెప్పారు. మనో విజ్ఞానానికి మాతృ భాషలో బోధన చేస్తే బాగుంటుందనే అంశంపై ప్రభుత్వం చర్చించాలని సూచించారు. తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ సామల రమేష్‌బాబు మాట్లాడుతూ.. జిఒ 14ను రద్దు చేసి మున్సిపల్ పాఠశాలల్లో తెలుగు మాధ్యమంలో బోధన చేయాలని డిమాండ్ చేశారు.

విపత్తుపై రెస్క్యూ బోట్లలో శిక్షణ

ప్రజాశక్తి - విజయవాడ సిటీ ప్రతినిధి

ఎటువంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు వీలుగా అగ్నిమాపక శాఖ రెస్క్యూ బోట్లపై అవగాహన పెంచడంతో బాటు ఆధునిక శిక్షణ ఇస్తోంది. రెస్క్యూ సందర్భంగా బోట్లపై సిబ్బంది వెళ్లే సందర్భంలో వారు తీసుకోవల్సిన జాగ్రత్తలు, బోట్లలో ఒబిఎం(ఔట్ బోట్ మోటార్)ను అలవరుచుకునే విధానం, మోటారుకు ఇంధనం నింపుకోవడం, గమ్యస్థానం చేరి లక్ష్యాన్ని ఛేదించడం వంటి వాటిపై సిబ్బందికి శిక్షణనిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం విజయవాడలోని డైరెక్టర్ జనరల్ అగ్నిమాపక శాఖ కార్యాలయం పక్కన ఉన్న కెనాల్‌లో జిల్లాలోని ఆ శాఖ సిబ్బందిలో శిక్షణ కోసం ఎంపిక చేసిన వారికి రెస్క్యూ బోట్లపై డిజి నేతృత్వంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చే కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని అగ్నిమాపక స్టేషన్లలో రెస్క్యూ బోట్లు లేకపోయినప్పటికీ 55 బోట్ల ద్వారా విపత్తుల సందర్భాల్లో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో 14 మంది సిబ్బందిని రెస్క్యూ టీమ్‌లో పనిచేసే విధంగా సభ్యులను ఒడిస్సా, మహారాష్ట్రలకు శిక్షణ నిమిత్తం పంపినట్లు ఆ శాఖ ఉన్నతాధికారులు చెప్పారు. పులిచింతల, జగ్గయ్యపేట, మచిలీపట్నం, విజయవాడ నగరంలో మూడు, అనంతపురం, కర్నూలు, నెల్లూరు తదితర ప్రాంతాల్లో రెస్క్యూ బోట్లను అందుబాటులో ఉంచారు.

దళితుడు పోలయ్యపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దళితుడు ఎంబడి పోలయ్యపై దాడిచేసిన పెత్తందారుడిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, కఠినంగా శిక్షించాలని కుల వివక్ష పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. కడప జిల్లా కాశీనాయన మండలం, సాగిశెట్టిపల్లె గ్రామ దళితుడు ఎంబడి పోలయ్య పై ఆ గ్రామ పెత్తందారుడు బసవన్న పల్లె శ్రీనివాసులు, అతని అనుచరులతో కలిసి దాడి చేశాడని కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, ఉపాధ్యక్షులు జి నటరాజ్, రాష్ట్ర నాయకులు కె ఉమామహేశ్వరరావు, జి క్రాంతి కుమార్ బుధవారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ దృష్టికి తీసుకొచ్చారు. ఈమేరకు ఆయనకు వినతి పత్రాన్ని అంద జేశారు. గత జూలై 11న పోలయ్య తన పొలానికి వెళ్తుండగా, పెత్తందారుడు శ్రీని వాసులు అతని అనుచరులతో ట్రాక్టర్‌ను అడ్డంగాపెట్టి, కులం పేరుతో దూషిస్తూ దారుణంగా కొట్టారన్నారు. గడ్డపారలతో తలపై కొట్టగా తల పగిలి, తీవ్ర గాయాలయ్యాయన్నారు. డబ్బు, పలుకుబడి ఉన్న శ్రీనివాసులు అగ్ర కుల దురహంకారంతో పథకం ప్రకారమే పోలయ్య పై ఈ దాడికి పాల్పడ్డారని వివరించారు. రిమ్స్‌లో కేసు నమోదై 40 రోజులవుతున్నా ముద్దాయిని ఇంత వరకు అరెస్ట్ చేయలేదన్నారు. తనకున్న పలుకుబడితో కేసు నమోదు కాకుండా స్థానిక పోలీసు అధికారుల పై ఒత్తిడి తెస్తున్నాడని తెలిపారు.

జునైద్ కుటుంబానికి సిపిఎం చేయూత

కేరళ కమిటీ తరపున రూ.10 లక్షల ఆర్థిక సాయం

ఇండియా న్యూస్ నెట్‌వర్క్ - న్యూఢిల్లీ: మతోన్మాద శక్తుల దాడిలో మృతిచెందిన జునైద్ ఖాన్ కుటుంబానికి సిపిఎం అండగా నిలిచింది. సిపిఎం కేరళ కమిటీ తరపున రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని అందించింది. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకారత్, సిపిఎం హర్యానా కార్యదర్శి సురీందర్ మాలిక్‌లు బుధవారం జునైద్ తల్లిదండ్రులు జలాలుద్దీన్, సైరాలను పరామర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం వారికి రెండు రూ.5 లక్షల చెక్‌లను సిపిఎం బృందం అందించింది. ఈ సంఘీభావ సభకు ఖతవలి గ్రామసభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. దేశంలో మత ఉద్రిక్తతలకు కారణమైన బిజెపి, ఆరెస్సెస్ వంటి విచ్ఛిన్న శక్తులకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగించేందుకు సిపిఎం కట్టుబడి ఉందని బాధితులకు సిపిఎం బృందం హామీ ఇచ్చింది. జూలైలో కేరళ సిఎం పినరయి విజయన్ ఢిల్లీలో పర్యటించినప్పుడు జలాలుద్దీన్ కుటుంబసభ్యుల్ని కలిసిన సందర్భంగా బాలికల కోసం ఓ పాఠశాల నిర్మించి దానికి జునైద్ అని నామకరణం చేయాలని ఉందని సైరా వెల్లడించారు. ఈ నేపథ్యంలో జునైద్ కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని సిపిఎం కేరళ రాష్ట్ర కమిటీ నిర్ణయించినట్లుగా బృందా కరత్ తెలిపారు. జునైద్ హత్య కేసులో దర్యాప్తు సంస్థలు వ్యవహరిస్తున్న తీరును ఆమె తీవ్రంగా విమర్శించారు. ఆరుగురు నిందితుల్లో నలుగురిని అరెస్టు చేశారని, ఇప్పటికే వారందరినీ బెయిలుపై బయటకు విడిచిపెట్టారని ఆమె తెలిపారు. నేరస్తులకు కొమ్ముగాస్తున్న బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం కొనసాగిస్తామని సురీందర్ మాలిక్ పేర్కొన్నారు.

త్వరలో కొత్త రూ.200 నోట్లు!



న్యూఢిల్లీ : త్వరలో కొత్త రూ.200 నోట్లు చలామణిలోకి రానున్నాయి. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం బుధవారం రిజర్వు బ్యాంకుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తక్కువ విలువ గల కరెన్సీపై ఉన్న ఒత్తిడిని తగ్గిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. రిజర్వు బ్యాంకు సెంట్రల్ బోర్డు డైరెక్టర్‌ల సిఫార్సు మేరకు రూ. 200 నోట్లను జారీ చేయనున్నట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొంది. దేశంలో నెలకొన్న కరెన్సీ ఇబ్బందులు తొలగించేందుకు రూ.200 విలువ గల నోట్లను ముద్రించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. గత ఏడాది నవంబరు9న పెద్ద నోట్ల రద్దు నేపథ్యంలో రూ. 2000, రూ.500 విలువగల నోట్లను అదనపు భద్రతా అంశాలతో ఆర్‌బిఐ ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఇటీవలే కొత్త ఫ్లోరోసెంట్ బ్లూ రంగులో ఉన్న రూ.50 నోట్లను కూడా ఆర్‌బిఐ విడుదల చేసింది.

హోసూర్ ఎమ్మెల్యే నివాసానికి శశికళ

కర్ణాటక డిఐజి రూప మరో ఆరోపణ

బెంగళూరు : బెంగళూరులోని పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఎఐఎడిఎంకె తాత్కాలిక ప్రధాన కార్యదర్శి వి.కె.శశికళపై కర్ణాటక డిఐజి మరో ఆరోపణల బాంబు విసిరారు. శశికళ జైలుకు సమీపంలోని హోసూర్ ఎమ్మెల్యే నివాసాన్ని సందర్శించినట్లు గత శనివారం సిబిఐకి సమర్పించిన నివేదికలో పేర్కొన్నారు. ఇందుకు తగిన ఆధారాలు తన వద్ద ఉన్నాయని తెలిపారు. జైలు ప్రవేశ మార్గాలలోని గేట్1, గేట్2లకు మధ్య అమర్చిన సిసి కెమెరాలు ఈ విషయాన్ని ధృవీకరించుకోవచ్చునన్నారు. ఆమె వ్యక్తిగత అవసరాల కోసం ప్రత్యేక సెల్‌ను, సందర్శకులను కలుసుకునేందుకు ప్రైవేటు గదిని, వంటల కోసం ప్రత్యేక కిచెన్‌ను ఏర్పాటు చేసుకున్నారని గతంలో జైళ్ళ శాఖ డిఐజిగా పనిచేసిన రూప ఆరోపించారు. శశికళకు ఏర్పాటు చేసిన ప్రత్యేక సౌకర్యాలపై హోం మంత్రి, హోం శాఖ కార్యదర్శులకు వాస్తవ సమాచారమివ్వకుండా వారిని తప్పు దోవ పట్టిస్తున్నారని రూప తన నివేదికలో పేర్కొన్నారు.

శశికళ పిటిషన్లను డిస్మిస్ చేసిన సుప్రీం

ఆదాయాన్ని మించిన ఆస్తుల కేసులో ఎఐఎడిఎంకె తాత్కాలిక ప్రధాన కార్యదర్శి వి.కె. శశికళ, ఆమె బంధువులు ఇళవరిసి, వి.ఎన్. సుధాకరన్‌లు దాఖలు చేసిన రివ్యూ పిటిషన్లను సుప్రీం కోర్టు బుధవారం డిస్మిస్ చేసింది. న్యాయమూర్తులు ఎస్.ఎ. బాబ్డే, అమితవ్‌రాయ్‌తో కూడిన ధర్మాసనం రివ్యూ పిటిషన్‌లను డిస్మిస్ చేసింది.

జల ప్రళయాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలి

ఎఐకెఎస్ డిమాండ్

న్యూఢిల్లీ : దేశంలో ఇటీవల సంభవించిన జల ప్రళయాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని ఆల్ ఇండియా కిసాన్ సభ(ఎఐకెఎస్) కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. వరద ప్రభావిత రాష్ట్రాలలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారి కుటుంబాలకు రూ. 2 లక్షలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేసింది. బాధితులకు ఆహారం,దుస్తులు సరఫరా చేయాలని కోరింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో సంభవించిన వరదలతో జనజీవనం స్తంభించిందని, యుద్ధ ప్రాతిపదికన సహాయ కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బీహార్, పశ్చిమ బెంగాల్, అస్సాం, ఉత్తర ప్రదేశ్‌లలో సంభవించిన వరదలలో దాదాపు 749 మంది మృతి చెందారని, త్రిపుర, మణిపూర్ అరుణాచల్ ప్రదేశ్‌లలో సంభవించిన వరదల్లో కూడా పలువురు ప్రాణాలు కోల్పోయారని, పెద్ద ఎత్తున పంట దెబ్బతిన్నదని పేర్కొంది. ఒక్క బీహార్ రాష్ట్రంలోనే దాదాపు నాలుగు లక్షల హెక్టార్ల భూమి నీట మునిగిందని ఎఐకెఎస్ వెల్లడించింది. కొన్ని రాష్ట్రాల్లో ప్రజలు వరద నీటిలో చిక్కుకు పోయారని, తగినంత ఆహారం, దుస్తులు లేని పరిస్థితిలో ఉన్నారని తెలిపింది. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వం ఉదాసీన వైఖరి వీడాలని విజ్ఞప్తి చేసింది. తగినంత సహాయ కార్యక్రమాలు చేపట్టడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందని తెలిపింది. వరద నీటిలో చిక్కుకున్న ప్రజలను రక్షించేందుకు తగిన చర్యలు తీసుకోలేదని, . పునరావాస సామాగ్రి అందించడంలోనూ, శిబిరాలను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించింది వరద ప్రభావిత రాష్ట్రాల ప్రజలకు తక్షణమే సహాయక చర్యలు అందించి, వారికి పునరావాసం కల్పించే విషయంలో ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని తెలిపింది. ఆయా రాష్ట్రాలలో కమ్యూనికేషన్ వ్యవస్థను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేసింది. వరద ప్రభావిత ప్రాంతాలలో సహాయ కార్యక్రమాలలో పాల్గొన్న ఎఐకెఎస్ కార్యకర్తలను, వలంటీర్లను ఈ సందర్భంగా అభినందించింది. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు, అన్ని ప్రజా సంఘాలు, సంస్థలు ముందుకొచ్చి వరద ప్రభావిత రాష్ట్రాల ప్రజలను ఆదుకోవాలని పిలుపునిచ్చింది.

'గోప్యత'పై నేడు సుప్రీం తీర్పు!

న్యూఢిల్లీ : 'గోప్యత' హక్కుపై సుప్రీం కోర్టు గురువారం తుది తీర్పు ఇవ్వనున్నది. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుగా 'గోప్యత'ను పరిగణించాలా? లేదా? అనే విషయమై తీర్పునిస్తుంది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జె.ఎస్. ఖేహార్ నేతృత్వంలోని 9 మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఆగస్టు 2న దీనిపై తీర్పును రిజర్వు చేసింది. అంతకుముందు మూడు వారాల పాటు, ఆరు రోజులు దీనిపై పెద్ద ఎత్తున వాదోపవాదాలు జరిగాయి. ప్రధాన న్యాయమూర్తి ఖేహార్‌తో పాటు న్యాయమూర్తులు జె. చలమేశ్వర్, ఎస్.ఎ.బాబ్డే, ఆర్.కె. అగర్వాల్, ఆర్.ఎఫ్.నారిమన్, ఎ.ఎం. సప్రే, డి.వై. చంద్రచూడ్, ఎస్.కె. కౌల్, ఎస్. అబ్దుల్ నజీర్ రాజ్యాంగ ధర్మాసనంలో సభ్యులుగా ఉన్నారు.

విచారణకు షరీఫ్, ఆయన కుమారులు గైర్హాజరు

లాహోర్: అక్రమాస్తులో కేసులో వరసగా మూడోసారి కూడా పాకిస్తాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్, ఆయన కుమారులు అవినీతి నిరోధక శాఖ ఎదుట విచారణకు గైర్హాజరయ్యారు. పనామా పత్రాల్లోని ఆరోపణలపై దర్యాప్తు సంస్థ బుధవారం షరీఫ్ కుటుంబ సభ్యులను విచారించాల్సి ఉంది. ఆ మేరకు నేషనల్ అకౌంటబిలిటీ బ్యూరో (ఎన్ఎబి) సమన్లు జారీ చేసింది. షరీఫ్, ఆయన కుమారులు హుస్సేన్, హసన్, కుమార్తె మార్యం, అల్లుడు కెప్టెన్ సఫ్దర్, ఆర్థిక మంత్రి ఇషాక్‌దార్‌లను లాహోర్‌లోని ఆ శాఖ కార్యాలయంలో విచారణకు హాజరుకావాల్సిందిగా కోరింది.

అయితే వారు గైర్హాజరవుతుండడంతో దర్యాప్తు సంస్థ వారిని దేశం విడిచిపోకుండా చర్యలు తీసుకోవాలని ఇసిఎల్‌కు లేఖ రాసింది. సీనియర్ ఎన్ఎబి అధికారి మాట్లాడుతూ సమన్లు అందుకున్న వారెవ్వరూ బుధవారం విచారణకు హాజరుకాలేదని పేర్కొన్నారు. ఇప్పటికే నిందితులు మూడుసార్లు విచారణకు గైర్హాజరయ్యారన్నారు. తరచూ వారు విచారణకు హాజరుకాకపోవడంతో దేశం విడిచి వెళ్లకుండా లేఖలు రాసినట్లు తెలిపారు.. తాను సుప్రీం కోర్టులో దాఖలు చేసిన రివ్యూపిటిషన్‌పై తీర్పు వచ్చిన తర్వాత దర్యాప్తుకు హాజరవుతానని దర్యాప్తు సంస్థలకు గతంలోనే రాసిన లేఖలో షరీఫ్ పేర్కొన్నారు.

పట్టాలు తప్పిన కైఫియత్ ఎక్స్‌ప్రెస్

- 100 మందికి గాయాలు
- సురేష్ ప్రభు రాజీనామా డ్రామా
- రైల్వే బోర్డు ఛైర్మన్ రాజీనామా, ఎయిరిండియా ఛైర్మన్‌కు బాధ్యతలు



న్యూఢిల్లీ/లక్నో: ఇటీవలి కాలంలో స్వల్ప వ్యవధిలోనే పలు రైళ్ల ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో ప్రయాణీకులను భద్రంగా వారి గమ్యాలకు చేర్చాల్సిన భారతీయ రైల్వే వ్యవస్థ పట్టాలు తప్పుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వరుస ప్రమాదాల నేపథ్యంలో ప్రజా వ్యతిరేకత నుంచి దృష్టి మళ్లించేందుకు తాను మంత్రి పదవి నుండి వైదొలుగుతానని రైల్వే మంత్రి సురేష్ ప్రభు రాజీనామా డ్రామా ఆడారు. రైల్వే బోర్డు ఛైర్మన్ ఎకె మిట్టల్ సైతం తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

తాజా ప్రమాదాల నేపథ్యంలో తాను పదవి నుండి వైదొలుగుతానని రైల్వే మంత్రి సురేష్ ప్రభు రాజీనామా డ్రామా ఆడారు. వరుస

రాజీనామా చేస్తానన్న సురేష్ ప్రభు

ప్రమాదాలతో ప్రజల్లో వస్తున్న వ్యతిరేకత నుంచి దృష్టి మళ్లించేందుకు తాను రాజీనామాకు సిద్ధపడినట్లు, కానీ ప్రధాని మోడీ వద్దని వారించినట్లు ఓ మంచి డ్రామానే ఆడారు. తాజా రైలు ప్రమాదాల నేపథ్యంలో ఇందుకు తాను పూర్తి నైతిక బాధ్యత స్వీకరిస్తున్నానని సురేష్ ప్రభు ఒక ట్వీట్‌లో పేర్కొన్నారు. తాను ప్రధానిని కలిసి ఈ ప్రతిపాదన ఆయన ముందుంచినట్లు ప్రభు వివరించారు.

ప్రమాదం వివరాలు

ఐదు రోజుల క్రితం హరిద్వార్-ఢిల్లీ మార్గంలో 23 మందిని బలితీసుకున్న ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్‌రైలు ప్రమాదం మరువకముందే బుధవారం వేకువ జామున యుపిలోని ఔరారియా సమీపంలో కైఫియత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు చెందిన 10 బోగీలు పట్టాలు తప్పిన ఘటనలో 100 మందికి పైగా గాయపడ్డారు. రైలు గేటును బద్దలు కొట్టి పట్టాలపైకి దూసుకు వచ్చిన ఇసుక డంపర్ కైఫియత్ ఎక్స్‌ప్రెస్ ఇంజన్‌ను ఢీకొనటంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

ఉత్తర మధ్య రైల్వే అధికారుల కథనం ప్రకారం ఈ ప్రమాదం బుధవారం తెల్లవారు జామున 2.40 గంటల సమయంలో పాటా, అచల్దా స్టేషన్ల మధ్య జరిగినట్లు తెలుస్తోంది. రైలుకు చెందిన 10 బోగీలు పట్టాలు తప్పి నిలిచిపోగా డంపర్‌ను ఢీకొన్న తీవ్రతకు రైలు ఇంజన్ వెనుక బోగీ బోల్తా పడింది. అనధికారిక ఇసుక డంపర్ రైలు గేటును బద్దలు కొట్టుకుని మార్గంపైకి వచ్చి ఇంజన్‌ను ఢీకొన్నదని రైల్వే మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో వివరించింది. ఈ ప్రమాదంలో ఎవరూ మరణించలేదని, 100 మంది గాయపడ్డారని అచల్దా ఎస్పీ సందీప్ త్యాగి తెలిపారు. జాతీయ విపత్తు స్పందనా దళం (ఎన్‌డిఆర్ఎఫ్) ఘటనా స్థలికి చేరుకుని సహాయ కార్యక్రమాలు చేపట్టింది.

రైల్వే బోర్డు ఛైర్మన్ రాజీనామా, కొత్త ఛైర్మన్ నియామకం

వరుసగా ఐదు రోజుల వ్యవధిలో రెండు ప్రమాదాలు సంభవించిన నేపథ్యంలో ఇందుకు నైతిక బాధ్యత వహిస్తూ రైల్వే బోర్డు ఛైర్మన్ ఎకె మిట్టల్ బుధవారం తన పదవికి రాజీనామా చేశారు. గత నెలలోనే ఆయన రైల్వే బోర్డు చరిత్రలో తొలిసారిగా ఆయన తన పదవికి రెండేళ్ల పొడిగింపు సాధించుకున్నారు. మిట్టల్ రాజీనామాను ఆమోదించిన ప్రభుత్వం ప్రస్తుతం ఎయిరిండియా ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న అశ్వని లోహానిని రైల్వే బోర్డు కొత్త ఛైర్మన్‌గా నియమించింది.

సాంకేతిక సమస్యలతో గంటపాటు నిలిచిన 'దురంతో'

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం (శ్రీకాకుళం జిల్లా)

హౌరా నుంచి బెంగుళూరు వెళ్తున్న దురంతో ఎక్స్‌ప్రెస్ రైలు సాంకేతిక సమస్యలు తలెత్తడంతో శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో గంటపాటు నిలిచిపోయింది. బి3 ఎసి బోగిలో సాంకేతిక సమస్య తలెత్తడాన్ని గుర్తించిన ప్రయాణికులు రైల్వే అధికారులకు ఫోన్లో సమాచారం అందించారు. అప్పటికే ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌కు చేరుకున్న ఎక్స్‌ప్రెస్‌ను అధికారులు అక్కడ నిలుపుదల చేయించారు. రాత్రి 8.30 గంటల ప్రాంతంలో ఇచ్ఛాపురం స్టేషన్ దాటాల్సిన దురంతో ఎక్స్‌ప్రెస్ సాంకేతిక సమస్య పరిష్కారం అనంతరం గంట ఆలస్యంగా బయలుదేరింది. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

ఎన్‌జిఓ కుంభకోణంపై దద్దరిల్లిన బీహార్ చట్ట సభలు

నితీష్, సుశీల్ మోడీ రాజీనామాకు ప్రతిపక్షం డిమాండ్

పాట్నా: బీహార్‌లో ఇటీవల సంచలనం సృష్టించిన భాగల్పూర్ ఎన్‌జిఓ కుంభకోణం బుధవారం వరుసగా రెండో రోజు రాష్ట్ర చట్టసభలను కుదిపేసింది. ఈ కుంభకోణానికి నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్, ఉపముఖ్యమంత్రి సుశీల్ మోడీ తమ పదవులకు రాజీనామా చేయాలని ప్రతిపక్షం చేసిన నినాదాలతో ఉభయసభలూ దద్దరిల్లాయి. బుధవారం ఉదయం అసెంబ్లీ సమావేశం ప్రారంభమైన వెంటనే ఈ కుంభకోణాన్ని ప్రస్తావించిన ప్రతిపక్ష నేత తేజస్వియాదవ్ దీనిపై తమ పార్టీ ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని గుర్తు చేస్తూ ప్రశ్నోత్తరాల సమయాన్ని సస్పెండ్ చేసి ఈ అంశంపై చర్చను చేపట్టాలని డిమాండ్ చేశారు. తగిన సమయంలో వాయిదా తీర్మానాన్ని అనుమతిస్తానని, సభ్యులు తమ ఆందోళనను విరమించి సీట్లలో కూర్చోవాలని స్పీకర్ విజయ్‌కుమార్ చౌదరి విజ్ఞప్తి చేశారు. అయితే ఈ వినతిని పట్టించుకోని ఆర్‌జెడి సభ్యులు స్పీకర్ ముందున్న వెల్‌లో చేరి ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. సభలో వున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సైతం వీరితో జత కలిశారు. ఈ స్వచ్ఛంద సంస్థకు చెందిన ఒక కార్యక్రమంలో నితీష్, మోడీలు పాల్గొన్న ఫొటోలను సభలో ప్రదర్శించారు. ఈ స్వచ్ఛంద సంస్థ ఖాతాలకు ప్రభుత్వం సొమ్మును మోసపూరితంగా బదిలీ చేసిందని, ఈ కుట్రలో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు, బ్యాంకు అధికారులు భాగస్వాములయ్యారని విపక్షం ఆరోపించింది. ఈ సమయంలో ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ సభలో లేరు. అయితే ఉపముఖ్యమంత్రి మోడీ మాత్రం సభలోనే వున్నారు. ప్రతిపక్ష సభ్యులు నినాదాలు కొనసాగిస్తుండటంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. ఈ సమయంలో బిజెపికి చెందిన మంత్రి నందకిషోర్ యాదవ్ మాట్లాడుతూ అవినీతి మార్గాలలో బినామీ ఆస్తుల సంపాదించిన వారికి అవినీతిపై మాట్లాడే హక్కు లేదని తేజస్వియాదవ్‌పై విమర్శలు గుప్పించారు.

బానిసల్లా చూస్తున్నారు...

విదేశీ ఖైదీల నిరశన

న్యూఢిల్లీ: తమను బానిసల్లా చూస్తున్నారని ఆరోపిస్తూ 50 మంది విదేశీ ఖైదీలు నిరవధిక నిరాహారదీక్షకు దిగిన సంఘటన ఉత్తర ఢిల్లీలోని నారెళ్ల జైలులో జరిగింది. తమకు కనీస వసతులు కూడా అందుబాటులో లేవనీ, తక్కువ మోతాదులో నాసిరకం ఆహారం ఇస్తున్నారనీ, కాలం చెల్లిన మందులు ఇస్తున్నారనీ వారు ఆరోపించారు. ఇప్పటికే తమ సమస్యలపై ప్రధాని, రాష్ట్రపతి, విదేశాంగ శాఖలకు పలుమార్లు ఫిర్యాదు చేశామన్నారు. ఆగస్టు 17న కూడా లేఖరాశామనీ, అయితే వారినుంచి స్పందన రాకపోవడంతో నిరవధిక నిరశనకు దిగినట్లు తెలిపారు. విదేశీయులను నమోదు చేసుకొనే కార్యాలయం ఎలాంటి విచారణ లేకుండా 3నుంచి 13 నెలల వరకు అదుపులోకి తీసుకొని నిర్బంధంలో ఉంచడం, విడుదల చేయడానికి రూ.70 వేల నుంచి రూ.1.20 లక్షల వరకు వసూలు చేయడానికి నిరసనగా ఈ ఆందోళన చేపట్టినట్లు తెలిపారు. పాకిస్తాన్ జాతీయుడు మహ్మద్ క్యామర్ మాట్లాడుతూ తాను మీరట్‌కు చెందిన వాడిననీ, ఐదేళ్ల నుంచి కస్టడీలో ఉన్నాననీ చెప్పాడు. తానేమి పాకిస్తానీ జాతీయుడిని కాదనీ. తనకు భార్య ఐదుగురు పిల్లలు ఉన్నారని తెలిపారు. మరో రెండేళ్లు ఈ జైలులోనే ఉండాల్సి ఉందన్నారు.

త్రిపుల్ తలాక్ తీర్పుపై మమత మౌనం



కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి సంబంధించినంతవరకు మౌనం ఆమె రాజకీయ వ్యూహం కాదన్నది రాజకీయ వర్గాలలో ఉన్న అభిప్రాయం.మమతా బెనర్జీ సహజంగా ఏవిషయంపై అంత మౌనంగా ఉండరు. ప్రతిదానికి ఏదోఒక విధమైన సమాధా నమిస్తూనే ఉంటారు. అప్పటి లెఫ్ట్‌ఫ్రంట్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వీధుల్లో నిరసనలు తెలియచేసిన నాటి నుంచి ఆమె దేనికీ మౌనం పాటించలేదు. కాని కేవలం నెల రోజులు వ్యవధిలో రెండు అంశాలపై మౌనం వహించారు.

- జులైలో బీహార్‌లోని మహా కూటమి నుంచి నితీష్ కుమార్ బయటకు వచ్చి, బిజెపితో చేతులు కలిపిన సందర్భంలోనూ, ఇప్పుడు మంగళవారం త్రిపుల్ తలాక్‌పై సుప్రీం కోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలోనూ బెనర్జీ మౌనాన్ని పాటించారు.
- డార్జిలింగ్‌లో నెలకొన్న పరిస్థితిపై మమతా బెనర్జీ మంగళవారం కోల్‌కతాలో మీడియా సమావేశం నిర్వహించారు. సమావేశం చివరిలో సుప్రీం తీర్పుపై స్పందించాలని విలేకరులు కోరగా దానిపై తానేమీ చెప్పలేనంటూ సమాధానమిచ్చారు. తృణమూల్‌కు చెందిన ఇతర నేతలు కూడా దానిపై వ్యాఖ్యానించేందుకు నిరాకరించారు.
- పశ్చిమ బెంగాల్ జనాభాలో 27 శాతం మంది ముస్లింలే ఉన్నారు. 2019లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లోనూ, వచ్చే ఏడాది జరగనున్న పంచాయతీ ఎన్నికల్లోనూ వారి మద్దతుపై తృణమూల్ ఎన్నో ఆశలు పెట్టుకుంది. త్రిపుల్ తలాక్‌ను నిషేధించడానికి అనుకూలంగా ఉన్న బిజెపి అంతకుముందు మమతా బెనర్జీని తనవైపు తిప్పుకునేందుకు ప్రయత్నించింది. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో త్రిపుల్ తలాక్‌పై తన వాదనను బలంగా వినిపించింది. రాజ్యాంగం మహిళలకు ప్రసాదించిన హక్కులను త్రిపుల్ తలాక్ హరించివేస్తుందని పేర్కొంది.
- ఈ ఏడాది ఏప్రిల్‌లో బిజెపి నాయకుడు, కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ త్రిపుల్ తలాక్‌పై మమతా బెనర్జీ మౌనాన్ని ప్రశ్నించారు. ఆమె దీనిపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.
- గతవారంలో కోల్‌కతాలో కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ మీడియా సమావేశం నిర్వహించారు. ఆ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "సమానత్వం న్యాయం గురించి మనం మాట్లాడుకోవడానికి ముందుగా త్రిపుల్ తలాక్‌పై మమత ఏమనుకుంటున్నారో తెలుసుకోవాలనుకుంటున్నాను." అన్నారు. కాని మమత దానిపై వ్యాఖ్యానించేందుకు తిరస్కరించారు.
- పశ్చిమ బెంగాల్‌లో తమ పార్టీని విస్తరించే ప్రయత్నంలో ఉన్న బిజెపి మాత్రం ముస్లింలను బుజ్జగించేందుకే ఆమె మౌనంగా ఉన్నారని వ్యాఖ్యానించింది.



మాలెగావ్ కేసులో పురోహిత్ విడుదల

ముంబయి: మాలెగావ్ పేలుడు కేసులో లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీకాంత్ ప్రసాద్ పురోహిత్ ముంబయిలోని తలోజా జైలు నుంచి బుధవారం విడుదలయ్యారు. తొమ్మిదేళ్లుగా జైలులో ఉంటున్న ఆయన ఇటీవల సుప్రీం కోర్టులో బెయిల్ మంజూరైన సంగతి తెలిసిందే. 2008 సెప్టెంబరు 29న జరిగిన మాలెగావ్ పేలుళ్ల కేసులో ఆయన అరెస్టయ్యారు. అప్పటి నుంచి ఆయన జైలులోనే ఉన్నారు. సుప్రీం కోర్టు ఇటీవలే ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే.

మెక్సికో గోడకోసం ప్రభుత్వాన్నైనా మూసేస్తా... ట్రంప్

వాషింగ్టన్: మెక్సికో గోడ కట్టడం కోసం తాను ప్రభుత్వాన్ని మూసేయ్యడానికైనా సిద్ధమేనని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' కార్యక్రమంలో భాగంగా తన మద్దతుదారులతో ఫోనిక్స్, అరిజోనాలలో జరిగిన ర్యాలీల్లో ఆయన మాట్లాడారు. ప్రతిపక్షం డెమొక్రటిక్‌లు ఈ గోడ నిర్మాణానికి ప్రతిబంధకంగా ఉందన్నారు. ర్యాలీలలో 80 నిమిషాల పాటు ప్రసంగించిన ఆయన మీడియాను కూడా లక్ష్యంగా చేసుకొని విమర్శలు గుప్పించారు. మెక్సికో బోర్డర్ వెంబడి అందమైన పెద్ద గోడ కట్టడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. గోడ నిర్మాణానికి వ్యతిరేకించడం ద్వారా డెమొక్రటిక్‌లు మొత్తం అమెరికన్ల భద్రతను ప్రమాదంలో ఉంచారన్నారు. ఆ ప్రాంతంలో అక్రమ వలసలను నివారించడం కోసం గోడ ఎంతో అవసరమన్నారు. అయితే గోడ నిర్మాణంతో ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తే ప్రభుత్వాన్ని మూసేస్తానన్నారు.

భారత సంతతి సిఇఓపై జాతి విద్వేష దాడి

న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన తరువాత కొంతమంది అమెరికన్లలో జాతి విద్వేషభావాలు విపరీతంగా పెరిగిపోయాయి. తాజాగా న్యూయార్క్ నగరానికి చెందిన ఒక సంస్థ సిఇఓపై ఒక మహిళ జాతి విద్వేష దుర్భాషలాడిన ఘటన ఇందుకు పరాకాష్టగా నిలుస్తోంది. నగరానికి చెందిన జిఎంఎం నాన్‌స్టిక్ కోటింగ్స్ అనే సంస్థకు వ్యవస్థాపక సిఇఓగా వ్యవహరిస్తున్న భారత సంతతి అమెరికన్ పౌరుడు రవిన్ గాంధీ, ఇటీవల చార్లెట్స్ విల్లె ఆందోళనల్లో అధ్యక్షుడు ట్రంప్ శ్వేతజాతి ఆధిపత్య వాదులను సమర్థించటాన్ని వ్యతిరేకిస్తూ ఒక వెబ్‌సైట్‌కు వ్యాసం రాశారు. ఈ వార్తను చదివిన ఓ ట్రంప్ అభిమానురాలు ఆయన్ను 'భారతీయ పందివి' అని దూషిస్తూ ఒక వాయిస్ మెయిల్ పంపింది. ఐరాసలో అమెరికా ప్రతినిధిగా వ్యవహరిస్తున్న నిక్కీ హేలీని తీసుకుని వెంటనే భారత్‌కు వెళ్లిపోవాలని ఆమె ఆ మెయిల్‌లో డిమాండ్ చేసింది. ఈ ఆడియో మెయిల్స్‌ను ఫేస్‌బుక్ ట్విట్టర్‌లలో పోస్ట్ చేసిన రవిన్ గాంధీ ఆ మహిళ తనపై జాతి విద్వేష వ్యాఖ్యలు చేసిందని వెల్లడించారు.

సిబిఐ ఎదుట కార్తీ చిదంబరం హాజరు

న్యూఢిల్లీ : కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరం బుధవారం సిబిఐ ఎదుట హాజరయ్యారు. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో ప్రశ్నించేందుకు బుధవారం నాడు సిబిఐ ఎదుట హాజరు కావాలని గత వారంలో సుప్రీం కోర్టు కార్తీ చిదంబరాన్ని ఆదేశించింది. ఐఎన్ఎక్స్ మీడియాపై వచ్చిన అవినీతి ఆరోపణలపై రెవెన్యూ శాఖ జరపనున్న దర్యాప్తును నిలిపివేసేందుకు తనకు సంబంధించిన ఒక కంపెనీ ద్వారా కార్తీ చిదంబరం లంచం తీసుకున్నారని సిబిఐ ఆరోపించింది. పీటర్, ఇంద్రాణి ముఖర్జీలకు చెందిన ఐఎన్ఎక్స్ మీడియా 2007లో దాదాపు రూ. 4.62 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ఫారిన్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎఫ్ఐపిబి) అనుమతి పొందింది. కాని షేర్ల అమ్మకం ద్వారా మారిషస్‌కు చెందిన రెండు కంపెనీల నుంచి రూ.305 కోట్లు మాత్రమే లభించాయి. ఎఫ్ఐపిబి నిర్ణయానికి వ్యతిరేకంగా విదేశీ నిధుల్లో 26 శాతం పెట్టుబడులను ఐఎన్ఎక్స్ మీడియా సంస్థకు కేటాయించాలంటూ ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకుంది. ఈ కేసుకు సంబంధించి సిబిఐ జూన్‌లో కార్తీతో పాటు సంబంధీకులకు సమన్లు జారీ చేసింది. దీనికి కార్తీ స్పందించలేదు.



నేపాల్ ప్రధానితో మోడీ భేటీ

న్యూఢిల్లీ: భారత్‌లో పర్యటిస్తున్న నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బా బుధవారం ప్రధాని మోడీతో భేటీ అయ్యారు. ఐదు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌లో అడుగుపెట్టిన దేవ్‌బాకు తన నివాసంలో మోడీ సాదర స్వాగతం పలికారు. అనంతరం పలు అంశాలపై నేతలిద్దరూ చర్చించారు. అనంతరం దేవ్‌బాను కలుసుకోవడం తనకు చాలా సంతోషంగా ఉందని, గురువారం నటి విస్తృత స్థాయి చర్చల కోసం ఎదురుచూస్తున్నానని మోడీ ట్వీట్ చేశారు. అంతకుమందు విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ ఇందిరాగాంధీ విమానాశ్రయంలో ఆయనకు స్వాగతం పలికారు. గురువారం ఇరు దేశాల మధ్య ప్రతినిధుల స్థాయి చర్చలు జరగనున్నాయి.

(మొదటిపేజీ తరువాయి)

క్యాంపుల జోరు

అధికార కాంగ్రెస్‌పార్టీ కుట్రలు పన్నుతోందనిఆరోపించాడు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ ఎంపి రాందాస్ కూడా పాల్గొన్నారు. రిసార్టు ప్రాంతంలో మినహా మిగిలిన ప్రాంతంలో ప్రశాంత వాతావరణం ఉంది. ఇక రిసార్టులోని ఎమ్మెల్యేలలో అండిపట్టి ఎమ్మెల్యే తంగటమిసెల్వం ఉదయం నడకకు బయటకు వెళ్లిరాగా, మిగిలిన వారు గదులకే పరిమితమయ్యారు. 50 గదులు నిండడంతో రిసార్ట్ బుకింగ్ ఆపేసింది. వీటిలో దినకరన్ స్నేహితుడు 19 గదులు బుక్ చేశాడు. వీటిలోనే ప్రస్తుతం ఎమ్మెల్యేలున్నారు. కేరళకు చెందిన ఒక కాంగ్రెస్ నేత ఈ రిసార్టులో భాగస్వామిగా ఉన్నారు. కాగా అన్నా డియంకెలోని రెండు గ్రూపులు ఏకం అయిన సందర్భంలో పళని, పన్నీరు చేతులు కలుపుతూ దర్శనం ఇచ్చిన గవర్నర్ ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో ఎక్కడా నోరు మెదపలేదు. దినకరన్ గ్రూపులోని 19 మంది శాసనసభ్యులతో పాటు అన్నాడిఎంకె భాగస్వామ్య పక్షాలైన మరో ముగ్గురు ఎంఎల్ఏలు ఇదే సమస్యపై గవర్నర్‌ను కలిశారు. ప్రధాన ప్రతిపక్ష నేత స్టాలిన్ వెంటనే అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసి బలపరీక్ష నిరూపించుకోవాలని గవర్నర్‌కు లేఖ రాశారు. కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్ష నేత కెఆర్ రామస్వామిదీ అదే మాట. అయితే గవర్నర్ విద్యాసాగర్ ఇంతవరకూ నోరు విప్పకపోవడం గమనార్హం. గవర్నర్‌పైన వత్తిడి ఎక్కువ రావడంతో ఈ విషయమై కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను గురువారం కలవనున్నట్లు సమాచారం.

బెంగళూరుకు ఎమ్మెల్యేలు...!

అధికార అన్నా డియంకె యంయల్‌ఎలపై వత్తిడి తీసుకురావటం, పుదిచ్చేరిలో ఉన్న లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడీ బిజెపి అనుచరురాలు కావటంతో రిసార్ట్‌లోని ఎమ్మెల్యేలను ఇపిఎస్-ఒపిఎస్ శిబిరం ప్రభావితం చేసే అవకాశం ఉండటంతో దినకరన్ ఎమ్మెల్యేలను బెంగళూరుకు మార్చే ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. కర్నాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో ఎమ్మెల్యేకు వసతి కల్పించడానికి, అధికార అన్నా డియంకె, బిజెపిల నుండి వారిని కాపాడుకోవటానికి అక్కడ తగిన రక్షణ లభిస్తుందని దినకరన్ శిబిరం భావిస్తున్నది.

పుదిచ్చేరి నుంచి బెంగళూరుకు క్యాంపు మార్చే ప్రయత్నాల్లో దినకరన్

పళణిస్వామికి వ్యతిరేకంగా శశికళ అనుచర ఎంఎల్ఏలు 19 మంది తిరుగు బావుటా ఎగురవేసిన విషయం విదితమే. శశికళ అక్క కొడుకు దినకరన్ నేతృత్వంలో 19 మంది ఎంఎల్ఏలకు మంగళవారం రాత్రి పుదిచ్చేరి సముద్రం ఒడ్డున ఉన్న విండ్‌ఫ్లవర్ రిసార్ట్స్‌లో 50 గదులను బుక్ చేశారు. పళణిస్వామి, పన్నీరుసెల్వం వెనుక బిజెపి హస్తం ఉందని భావించిన దినకరన్ పుదిచ్చేరి నుంచి క్యాంపును బెంగుళూరుకు మార్చే ప్రయత్నాలు చేస్తున్నారు. పుదిచ్చేరిలో బిజెపి అభిమానిగా ఉన్న కిరణ్‌బేడీ గవర్నర్‌గా ఉండడంతో, క్యాంపు రాజకీయాల్లో ఏదైనా ప్రలోభాలు చోటు చేసుకుంటాయేమోనన్న భయంతో బెంగుళూరుకు మార్చే ప్రయత్నం చేస్తున్నారు. కర్నాటక రాష్ట్రం బెంగుళూరులో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండడంతో పుదిచ్చేరి నుంచి బెంగుళూరుకు మార్చే ప్రయత్నం చేస్తున్నారు.

కరుణానిధిని కలిసిన వైగో

ఒకప్పటి కరుణానిధి ప్రియశిష్యుడు వైగో గురువు చెంతకు చేరారు. డిఎంకె కార్యనిర్వాహక అధ్యక్షులు స్టాలిన్ ఆహ్వానం మేరకు ఎండిఎంకె నేత వైగో చెన్నయ్ గోపాలపురంలోని కరుణానిధి ఇంటిలో మంగళవారం రాత్రి గంటన్నరపాటు కరుణానిధితో భేటీ అయ్యారు. ఎలాంటి రాజకీయ చర్చ జరగలేదని, కేవలం అనారోగ్యంతో ఉన్న గురువును పరామర్శించేందుకే వచ్చానని తనను కలిసిన మీడియాకు వైగో చెప్పారు. తమిళనాడు రాష్ట్రంలో ప్రస్తుతం ద్రవిడ పార్టీలలో డిఎంకె మాత్రమే బలంగా ఉంది. అన్నాడిఎంకె భవిష్యత్ ప్రశ్నార్థకం కావడంతో వైగో కరుణానిధిని కలవడం రాజకీయ చర్చగా మారింది. భవిష్యత్‌లో డిఎంకెతో జతకట్టే అవకాశం ఉండొచ్చనే చర్చ నడుస్తోంది. డిఎంకె పార్టీలో కీలక నేతగా ఉన్న వైగోను స్టాలిన్ ప్రవేశంతో కరుణానిధి పక్కన పెట్టారు. డిఎంకె నుంచి బయటకు వచ్చి వైగో ఎండిఎంకె పార్టీని ఏర్పాటు చేశారు. డిఎంకె ఎన్నికల చిహ్నం పొందేందుకు శతవిధాలా ప్రయత్నించి విఫలమయ్యారు. అప్పటినుంచి వైగో డిఎంకెకు వ్యతిరేకంగా ఉండే పార్టీలతో జతకట్టారు. 2016లో ప్రజా సంక్షేమ కూటమి కన్వీనర్‌గా వ్యవహరించారు. అయితే ఆ కూటమి పరాజయం పొందడంతో తటస్థంగా ఉంటూ వచ్చారు. ప్రస్తుతం ఎఐడిఎంకెలో చీలికలు ఏర్పడిన నేపథ్యంలో వైగో డిఎంకె అధినేతను కలవడం రాజకీయ చర్చగా మారింది.

మిత్రపక్షం హోదా కోల్పోతారు

పాక్‌పై ఒత్తిడి పెంచిన అమెరికా

వాషింగ్టన్ : ఉగ్రవాద గ్రూపులకు ఆశ్రయం కల్పించడాన్ని కొనసాగిస్తే రక్షణ రంగంలో మిత్రపక్షం హోదాను కోల్పోవాల్సి వస్తుందని అమెరికా మంగళవారం పాకిస్తాన్‌ను హెచ్చరించింది. ఆఫ్ఘన్‌పై కొత్త వ్యూహన్ని ప్రకటించిన ఒక రోజు తర్వాత ట్రంప్ ఈ హెచ్చరిక చేశారు. ఆఫ్ఘన్ తాలిబన్, హక్కానీ తీవ్రవాద నెట్‌వర్క్‌లకు మద్దతిస్తే తీవ్ర పర్యవసానాలు వుంటాయని ట్రంప్ హెచ్చరించారని విదేశాంగ మంత్రి టిల్లర్‌సన్ వెల్లడించారు. నాటోయేతర ప్రధాన మిత్రపక్షాల్లో ఒకటైన పాకిస్తాన్ ఏటా అమెరికా నుండి కోట్లాది డాలర్ల మేరకు ప్రయోజనాలు పొందుతోంది. అమెరికా సైనిక సాంకేతికతను కూడా పొందుతోంది. అయితే, తీవ్రవాదంపై పోరులో పాకిస్తాన్ తగిన రీతిలో వ్యవహరించడం లేదనే పేరుతో సైనిక నిధులకు సంబంధించిన 350 మిలియన్ డాలర్లను అమెరికా నిలుపుచేసింది. తాలిబన్‌పై పోరులో పాకిస్తాన్ తన మద్దతును ఆఫ్ఘన్‌కు అందచేస్తే పాకిస్తాన్‌తో కలిసి పనిచేయాలని అమెరికా భావిస్తోందని టిల్లర్‌సన్ చెప్పారు. కాగా, తీవ్రవాదులను పోషించే దేశంగా పాకిస్తాన్‌ను ప్రకటించాలని లేదా పాక్‌లో గల తీవ్రవాద స్థావరాలపై దాడులు జరపాలని అమెరికాలోని పాకిస్తాన్ విమర్శకులు కొంతమంది ట్రంప్‌ను కోరారు. అయితే దాడులు జరిపే అవకాశాలను తోసిపుచ్చలేమని టిల్లర్‌సన్ పేర్కొన్నారు.

బార్సిలోనా తీవ్రవాదులకు జైలు

మాడ్రిడ్ : గత వారం జరిగిన బార్సిలోనా తీవ్రవాద దాడి అనంతరం నిర్బంధంలోకి తీసుకున్న నలుగురిలో ఇద్దరికి ఏకాంత కారాగార వాస శిక్ష విధిస్తూ నేషనల్ కోర్టు (ఎఎన్) న్యాయమూర్తి ఫెర్నాండో ఆండ్రూ తీర్పు చెప్పారు. శిక్ష కాలంలో వారికి బెయిల్ కూడా లభించదు. గత గురువారం బార్సిలోనా, కాంబ్రిల్స్‌లో జరిగిన దాడుల్లో 15మంది మరణించగా, వందమందికి పైగా గాయపడ్డారు. ఆ దాడులకు పాల్పడిన జిహాదిస్ట్ సెల్ సభ్యులుగా భావిస్తున్న మహ్మద్ హౌలీ చెమ్లాల్, డ్రిస్ ఒకబీర్‌లకు న్యాయమూర్తి శిక్ష విధించారు. తీవ్రవాద సంస్థలో చేరడం, హత్యలు వంటి అభియోగాలను వారిపై మోపారు. రిపోల్ పట్టణంలో చిన్న టెలిఫోన్ కాల్ సెంటర్ నడుపుతున్న సాలాహ్ ఎల్ కరీబ్‌కు ఈ దాడుల్లో గల పాత్రపై నిర్ధారణ వచ్చేవరకు శిక్ష విధించే విషయమై 72గంటల పాటు న్యాయమూర్తి తన నిర్ణయాన్ని నిలుపు చేశారు. చివరకు అతనిని వదిలిపెట్టారు. కరీబ్‌పై చర్యలు తీసుకోవడానికి తగిన సాక్ష్యాధారాలు లేవని న్యాయమూర్తి స్పష్టం చేశారు.

ఆఫ్ఘన్ కొత్త విధానం
యుద్ధోన్మాదానికి సంకేతం



వాషింగ్టన్: దాదాపు పదహారేళ్ల నుండి అద్దూ, అదుపూ లేకుండా కొనసాగుతున్న అమెరికా సైనిక హింసలో నలుగుతున్న ఆఫ్ఘనిస్తాన్‌పై అనుసరించనున్న కొత్త విధానాన్ని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం నాడు ఆవిష్కరించారు. ఆఫ్ఘన్‌లో ఎటువంటి ప్రతిఘటన ఎదురైనా దానిని అణచివేసేందుకు సైన్యానికి అవసరమైన వనరులను, నియమ నిబంధనలను సమకూర్చుస్తామని ట్రంప్ ప్రకటించారు. శత్రువుతో పోరాటంపై రక్షణ మంత్రిత్వ, క్షేత్ర స్థాయి ఉన్నతాధికారులు సైన్యంపై విధించిన అన్ని ఆంక్షలను పూర్తిగా తొలగించనున్నట్లు ఆయన చెప్పారు. మరో మాటలో చెప్పాలంటే ఆఫ్ఘన్ ప్రజలు ఇప్పటి వరకు అనుభవించిన హింసాకాండ భవిష్యత్‌లో మరింత రాజుకోనుందని చెప్పవచ్చు. ట్రంప్ ప్రసంగం కేవలం ఆఫ్ఘనిస్తాన్‌కు మాత్రమే ఆగలేదు. వాస్తవానికి ఇది ప్రపంచంపై యుద్ధం ప్రకటించటమేనని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఆఫ్ఘన్ యుద్ధ విస్తరణకు మరిన్ని వనరులు, దళాలను సమకూర్చాలంటూ నాటో సభ్యదేశాలను ట్రంప్ చేస్తున్న డిమాండ్ అమెరికా, ఐరోపాలోని దాని మిత్ర దేశాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలను ప్రతిబింబిస్తోంది. ఉ.కొరియాపై ముందస్తు దాడి ప్రయత్నాలపై చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ట్రంప్ ఈ ప్రసంగం చేశారు. క్షిపణి, అణ్వాయుధ సంపత్తి పరిరక్షణతో సహా తమ ప్రభుత్వం సైన్యం ఆధునీకరణ కోసం వందల కోట్ల డాలర్లను ఖర్చుపెడుతోందని ట్రంప్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. ట్రంప్ ప్రసంగంలోని ఈ దాంబికాల వెనుక అనిశ్చితతో కూడిన భయం దాగి వున్నట్లు కన్పిస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రపంచంలో ఎక్కడ ఆర్థిక, సామాజిక, భౌగోళిక, రాజకీయ సంక్షోభాలు తలెత్తినా బాంబుల వర్షం కురిపించి ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేయడం ద్వారా అమెరికా సామ్రాజ్యవాదం వాటిని పరిష్కరించనున్నట్లు భావనలోనే తీవ్ర గందరగోళం కన్పిస్తోంది. నాటి సోవియట్ యూనియన్ పతనానంతరం గడచిన 25ఏళ్ల తరువాత కూడా ప్రపంచంలో యుద్ధోన్మాదానికి తెరపడకపోవటం పై భావన కేవలం ఎండమావి మాత్రమేనన్న విషయాన్ని మన కళ్లకు కడుతోంది. తాము బయటి శత్రువుతో కన్నా అమెరికా కార్మిక లోకం రూపంలో వున్న అంతర్గత శత్రువుతోనే పోరాడుతున్నామన్న విషయాన్ని అమెరికా పాలక వర్గాలు ఇప్పటికే గ్రహించాయి. దేశంలో అధ్యక్ష-సైనిక నియంతృత్వం పెరుగుతోందన్న భావన నానాటికీ బలపడుతున్న ప్రస్తుత సమయంలో ట్రంప్ చేసిన ప్రసంగం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆఫ్ఘనిస్తాన్‌కు ఎంత మంది సైనికులను పంపుతారు, వారు అక్కడ ఎంతకాలం వుంటారన్న ప్రశ్నలకు మౌనమే సమాధానమన్న సూత్రాన్ని ట్రంప్ బాగా వంటపట్టించుకున్నారని పరిశీలకులు చెబుతున్నారు. కాంగ్రెస్ అనుమతి లేకుండానే అన్ని నిర్ణయాలూ సైన్యమే తీసుకుంటోంది. విధ్వంసమైన ఒక దేశాన్ని తిరిగి కలిపే శక్తి సైన్యానికి మాత్రమే వుందన్న విషయాన్ని వారు పదేపదే చెబుతున్నారు. అమెరికాలో నానాటికీ పెరుగుతున్న సామాజిక, రాజకీయ ఘర్షణల నేపథ్యంలో సైన్యం కేవలం విదేశాలలో యుద్ధానికి మాత్రమే కాక దేశంలో శాంతి భద్రతల పరిరక్షణకు కూడా కీలక పాత్ర పోషించాలని ట్రంప్ ప్రసంగం చెబుతోంది. అమెరికాలో పెరుగుతున్న అసమానతలు, పేదరికం, యుద్ధోన్మాదం, సైనిక, పారిశ్రామిక, ఆర్థిక రంగాలలో పెరుగుతున్న కేంద్రీకరణ వంటి అంశాలు అమెరికన్ కార్మిక లోక ప్రజాతంత్ర, సామాజిక హక్కులకు పెనుముప్పుగా మారుతున్నాయి. యుద్ధాన్ని నిరంతరం కొనసాగిస్తామంటూ ట్రంప్ చేసిన ప్రకటన నేపథ్యంలో తాజాగా యుద్ధ వ్యతిరేక ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం వుంది. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరు కార్మిక లోకం నుండే ప్రారంభం కావాలి. పాలక వర్గాలు, పెట్టుబడిదారీ వ్యవస్థపై అంతర్జాతీయంగా పెరుగుతున్న వ్యతిరేకత ప్రాతిపదికగా ఈ పోరును ఉధృతం చేయాలి.

మానవ బాంబులుగా చిన్నారులు

నైజీరియాలో బొకోహారం దుశ్చర్య

బొగొటా : చిన్నారులను ముఖ్యంగా బాలికలను మానవ బాంబులుగా ఉపయోగించే నైజీరియా తీవ్రవాద సంస్థ బొకో హారం ఈ ఏడాది వాటి(మానవ బాంబుల) సంఖ్యను నాలుగు రెట్లు పెంచిందని యునిసెఫ్ తెలిపింది. ఈ ఏడాది జనవరి ఒకటవ తేదీ నుండి ఇప్పటివరకు 83మంది పిల్లలను బాంబు దాడులు నిర్వహించడానికి ఉపయోగించిందని ఐక్యరాజ్య సమితి బాలల సంస్థ తెలిపింది. గతేడాది కాలంలో ఉపయోగించిన మానవ బాంబుల కన్నా ఈ సంఖ్య నాలుగు రెట్లు ఎక్కువని పేర్కొంది. ఈ 83మందిలో 55మంది బాలికలేనని, పైగా 15ఏళ్ళ లోపు వారేనని తెలిపింది. ఈశాన్య నైజీరియాలో దాడులు జరిపేందుకు చిన్నారులను ముఖ్యంగా బాలికలను ఇంత దారుణమైన పనులకు ఉపయోగించడం పట్ల యునిసెఫ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పిల్లలను ఇలా ఉపయోగించడం అత్యాచారం కిందకే వస్తుందని యునిసెఫ్ పేర్కొంది. అయితే మానవబాంబుల సంఖ్య ఎందుకు పెరిగిందనే కారణాన్ని వెల్లడించలేదు. మహిళలను, పిల్లలను బొకోహారం ఇలా భయకంపితులను



చేస్తోందని యునిసెఫ్ చీఫ్ మిలెన్ కిడానె తెలిపారు. బయటకు వచ్చిన సంఖ్య కన్నా ఇంకా ఎక్కువమంది బాధితులు వున్నారని నైజీరియా మానవ హక్కుల కార్యకర్త హఫ్సత్ మహ్మద్ పేర్కొన్నారు. పిల్లలను బాంబర్లుగా ఉపయోగించడం ద్వారా అందరి దృష్టి అటు మళ్ళేలా చేస్తున్నారని అన్నారు.

ఫోనిక్స్‌లో ఆందోళనకారులపై పోలీసుల బాష్పవాయు ప్రయోగం

ముగ్గురు అరెస్టు

వాషింగ్టన్ : అరిజోనాలోని ఫోనిక్స్‌లో వేలాదిమంది నిరసనకారులను చెల్లాచెదురు చేసేందుకు పోలీసులు బాష్పవాయు గోళాలను ప్రయోగించారు. అధ్యక్షుడు ట్రంప్ ఫోనిక్స్‌కు సమీపంలో తన మద్దతుదారులతో ఎన్నికల ప్రచారం తరహాలో ర్యాలీ నిర్వహించారు. ఫోనిక్స్ కన్వెన్షన్ సెంటర్‌లో ట్రంప్ ప్రసంగం ముగిసిన వెంటనే సెంటర్ వెలుపల పెద్ద సంఖ్యలో నిరసనకారులు పోలీసులతో ఘర్షణ పడ్డారు. మంగళవారం రాత్రంతా ఆ ఘర్షణలు కొనసాగుతూనే వున్నాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఆ ప్రాంతాన్ని వెంటనే వీడి వెళ్ళాలంటూ అధికారులు హెచ్చరికలు జారీ చేయడంతో ప్రజలు అక్కడ నుండి వెళ్ళిపోయారు. అడ్డగించిన అధికారులపై ఆందోళనకారులు రాళ్ళు, సీసాలు విసిరారని పోలీసులు తెలిపారు. దాంతో పోలీసులు వెంటనే పెప్పర్ స్ప్రే, బాష్పవాయు గోళాలను ఉపయోగించారని ఫోనిక్స్ పోలీసు ప్రతినిధి జోనాథన్ హొవార్డ్ తెలిపారు.

వెనిజులా సంక్షోభ పరిష్కారంలో వాటికన్ మధ్యవర్తిత్వానికి రష్యా మద్దతు

మాస్కో : వెనిజులాలో ప్రభుత్వం, ప్రతిపక్షం మధ్య నెలకొన్న ప్రతిష్టంభనను పరిష్కరించడానికి మధ్యవర్తిత్వం వహిస్తామన్న వాటికన్ ప్రతిపాదనకు రష్యా మద్దతిచ్చింది. ప్రస్తుత పరిస్థితుల్లో అది మంచి ప్రతిపాదన అని, ఈ వైఖరి సరైనదని రష్యా విదేశాంగ మంత్రి సెర్గి లావ్‌రోవ్ వ్యాఖ్యానించారు. వెనిజులా సంక్షోభం తలెత్తినప్పటి నుండి ఉభయ పక్షాల మధ్య సామరస్యత నెలకొల్పడానికి వాటికన్ తీసుకుంటున్న చొరవలను సమర్ధిస్తూ వచ్చామన్నారు. వెనిజులాలో శాంతి నెలకొనడానికి శాయశక్తులా దోహదపడాలని ఈ సందర్భంగా లావ్‌రోవ్ విజ్ఞప్తి చేశారు. హింసాత్మక చర్యలకు పాల్పడేలా ప్రతిపక్షాలను రెచ్చగొట్టవద్దని విదేశీ ఏజెంట్లను కోరారు. వెనిజులా అధికార యంత్రాంగంతో కఠిన వైఖరి అవలంబించేలా ప్రతిపక్షాలను కొన్ని విదేశీ శక్తులు రెచ్చగొడుతున్నాయని, ఇటువంటి చర్యల వల్ల శాంతి పునరుద్ధరణకు జరుగుతున్న ప్రయత్నాలకు విఘాతం కలుగుతుందని అన్నారు. ఈ సంక్షోభ పరిష్కారంలో మాస్కో పాత్రను కూడా వాటికన్ విదేశాంగ మంత్రి, కేథలిక్ చర్చి ప్రతినిధి పీట్రో పారోలిన్ ప్రముఖంగా ప్రస్తావించారు.

చైనా, రష్యా సంస్థలు, వ్యక్తులపై అమెరికా ఆంక్షలు

వాషింగ్టన్ : ఉత్తర కొరియాతో వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించారంటూ చైనా, రష్యా సంస్థలపై, కొంతమంది వ్యక్తులపై ట్రంప్ ప్రభుత్వం మంగళవారం ఏకపక్షంగా ఆంక్షలు విధించింది. జులైలో క్షిపణి పరీక్షలు నిర్వహించిన ఉత్తర కొరియాపై ఐక్యరాజ్య సమితి కఠిన చర్యలు తీసుకోవాలంటూ భద్రతా మండలిలో ఈ నెల ప్రారంభంలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని చైనా, రష్యాలు వీటో చేశాయి. ఆ నేపథ్యంలో ట్రంప్ సర్కార్ ఈ చర్య తీసుకుంది. చైనాకు చెందిన ఆరు కంపెనీలు, రష్యా, ఉత్తర కొరియాలకు చెందిన ఒక్కో కంపెనీపై ఆంక్షలు విధించారు. నలుగురు రష్యన్లు, చైనా జాతీయుడు, ఉత్తర కొరియా జాతీయుడిపై కూడా ఆంక్షలు విధించారు. ఈ ఆంక్షల ఫలితంగా ఈ సంస్థలకు, వ్యక్తులకు అమెరికాలో ఎలాంటి ఆస్తులు, నిధులు వున్నా వాటిని స్తంభింపచేస్తారు. అమెరికా కార్పొరేట్ సంస్థలతో, అమెరికా బ్యాంకులు, ప్రజలతో వ్యాపార కార్యకలాపాలు జరపడానికి వీలు వుండదు. ఉత్తర కొరియా తన ఆయుధ కార్యక్రమాలను కొనసాగించేందుకు వీలుగా అవసరమైన ఆదాయాన్ని సమకూర్చేలా చైనా, రష్యా కంపెనీలు, వ్యక్తులు వ్యాపారాలు నిర్వహించడం ఆమోదయోగ్యమైన విషయం కాదని అమెరికా ఆర్థిక శాఖ మంత్రి స్టీవెన్ నుచిన్ వ్యాఖ్యానించారు. అయితే అమెరికా తాను చేసిన ఆరోపణలు వేటినీ నిరూపించలేదు. బొగ్గు, ఇతర ఖనిజాల ఎగుమతులను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా ఉత్తర కొరియా ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీయాలని అమెరికా భావిస్తోంది. ఇదిలావుండగా, అమెరికా న్యాయ విభాగం సింగపూర్, చైనాలకు చెందిన మరో రెండు కంపెనీలపై దావా వేసింది. జూన్‌లో ఇలాగే ఆంక్షలు విధించిన అమెరికా ఇప్పుడు రెండోసారి మళ్లీ ఆ చర్యలకు పాల్పడింది.

అణు ఒప్పందం ఉల్లంఘించిన అమెరికా

యురేనియం శుద్ధికి ఐదు రోజులు చాలు

ఇరాన్ హెచ్చరిక

టెహరాన్ : ఐదు రోజుల్లో యురేనియం శుద్ధి క్రమాన్ని తిరిగి ప్రారంభించగల సత్తా తమకు వుందని ఇరాన్ హెచ్చరించింది. అణు ఒప్పందాన్ని అమెరికా ఉల్లంఘించడంపై తీవ్రంగా స్పందించిన ఇరాన్ పై హెచ్చరిక జారీ చేసింది. ఇరాన్ అణు ఇంధన సంస్థ అధినేత అలీ అక్బర్ సలేహి మాట్లాడుతూ, ఇరాన్, ఆరు దేశాల మధ్య కుదిరిన అణు ఒప్పందాన్ని ఉల్లంఘించడం వల్ల తలెత్తే పర్యవసానాలను ప్రస్తావించారు. అధ్యక్షుడు హసన్ రౌహని చేసిన హెచ్చరికలు ఆషామాషీగా చేసినవి కావని, నిర్దిష్ట సమాచారం ప్రాతిపదికనే ఆయన మాట్లాడారని సలేహి తెలిపారు. యురేనియం శుద్ధిని కేవలం ఐదు రోజుల్లోనే 20శాతం వరకు పెంచే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం సెంట్రల్ ఫోర్డోలోని కర్మాగారంలో వుందని ఆయన చెప్పారు. అమెరికా గనుక ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోతే, రాజకీయ విశ్వసనీయతను కోల్పోతే కచ్చితంగా తాము ముందుకు సాగుతామని ఆయన స్పష్టం చేశారు. ఆరు దేశాలతో కుదిరిన అణు ఒప్పందాన్ని కఠినంగా, కచ్చితంగా అమలు చేయాల్సి వుందని, దీనివల్ల కేవలం ఇరాన్‌కే కాకుండా, పశ్చిమాసియా ప్రాంతానికీ ప్రయోజనాలు వున్నాయని చెప్పారు.

మొదటి పేజీ తరువాయి

'కాకినాడ' ఎన్నికల్లో 'ముద్ర'గడ

ముద్రగడ, ఆ సామాజిక తరగతికి చెందిన నేతలు మండిపడుతున్నారు. చంద్రబాబు మోసగించారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముద్రగడకు మద్దతుగా కిర్లంపూడితోపాటు ఉభయ గోదావరి జిల్లాల్లో ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ ప్రభావం కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో పడే అవకాశంపై నగరంలో సర్వత్రా చర్చలు సాగుతున్నాయి. ఈ అంశాన్ని గమనించిన టిడిపి.. సదరు సామాజిక తరగతికి రుణాలను ఇస్తున్న విషయాన్ని ప్రస్తావిస్తూ తమదే గెలుపు అనే ధీమాతో ఉంది. అయితే ముద్రగడ ఉద్యమ ప్రభావం తమకు మేలు చేస్తుందని వైసిపి భావిస్తోంది. కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో టిడిపిని ఓడించేందుకు గట్టిగా కృషి చేయాలని ఇప్పటికే ముద్రగడ, ఆయన ఉద్యమంలో ఉన్న నేతలు పిలుపునిచ్చారు. రిజర్వేషన్లను కల్పించకపోయినా రుణాల పేరుతో నిధులు మంజూరు చేసి, అధికార పార్టీలో కొంతమందికే దక్కేలా చేశారనే విమర్శలున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున ఎమ్మెల్యేగా ఎన్నికైన వెనుకబడిన తరగతులకు చెందిన వనమాడి వెంకటేశ్వరరావు గెలుపులో ముద్రగడకు చెందిన సామాజిక తరగతివారే కీలకంగా వ్యవహరించారు. తాజా పరిణామాల నేపథ్యంలో అధికార పార్టీ అభ్యర్థులకు ఏకపక్షంగా ఆ సామాజిక తరగతి మద్దతు పునరావృతమవడం సాధ్యమయ్యేది కాదని విశ్లేషకుల భావన. కాకినాడ కార్పొరేషన్ పరిధిలో ముద్రగడ సామాజిక తరగతికి చెందిన నేతలు టిడిపి, వైసిపిల్లో కీలకంగానే వ్యవహరిస్తున్నారు. ఈ నెల 29న జరగనున్న కార్పొరేషన్ ఎన్నికల్లో 2,36,000 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరిలో 45 వేల మంది కాపు సామాజిక తరగతికి చెందినవారుకాగా 41 వేల మంది మత్స్యకారులు ఉన్నారు. మత్స్యకారులుసహా బిసిల్లోని అన్ని కులాలు కలిపితే 62 వేల మంది వరకూ ఉన్నారు. ఎస్‌సిలు 22 వేల మంది, వ్యాపార వర్గాలకు చెందిన సామాజిక తరగతికి మరో 20 వేల మంది, మైనారిటీలకు 14 వేల మంది ఉండగా, మిగిలిన సామాజిక తరగతుల నుంచి మరో 73వేల మంది ఓటర్లుగా ఉన్నారు. టిడిపి, వైసిపిలు చెరో 15 మందిని కాపు సామాజిక తరగతికి చెందిన అభ్యర్థులను బరిలో దించాయి.

ఐఏఎస్‌ల మెడపై ఫిట్‌నెస్ కత్తి

పనిచేసే అధికారుల వల్ల ప్రభుత్వాలకు మంచి పేరు వచ్చే సందర్భాలుంటాయని కేంద్రం భావిస్తోంది. పాతికేళ్ల సర్వీసు, 50 ఏళ్ల వయసు దాటిన వారి సేవలు ఎంతవరకు ఉపయుక్తంగా ఉంటాయనే అంశంలో కేంద్రం కొన్ని సందేహాలు వ్యక్తం చేస్తోంది. అందువల్ల ఆ కేటగిరీ అధికారుల పనితీరును వారి సర్వీసు రికార్డుల ద్వారా సమీక్షించాలని నిర్ణయించింది. బాగా పనిచేయలేని వారిని ముందస్తు పదవీ విరమణ ద్వారా ఇంటికి పంపించే యోచన చేస్తోంది. అయితే ఇది క్రమశిక్షణ చర్యగా పరిగణించరాదని కేంద్ర డివోపిటి విభాగం చెబుతోంది. ఈ నేపథ్యంలో గత నిబంధనలను కూడా 2012లోనే సవరించారు. అధికారులకు పదోన్నతులు కల్పించే సమయంలో కూడా వారి ఫిట్‌నెస్‌ను పరిగణనలోకి తీసుకోవాలని భావిస్తున్నారు.

రెండుసార్లు వరుసగా పదోన్నతులకు అనర్హులుగా గుర్తిస్తే వారిని ముందస్తు పదవీ విరమణ ద్వారా పంపిం చేయాలని యోచిస్తున్నారు. ఈ సమీక్షలు నిర్వహించి నివేదికలు పంపించాలని 2016లోనే కేంద్రం ఆదేశించగా, ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్‌లో సమీక్షించలేదు. చివరకు ఒక కమిటీని ఏర్పాటుచేస్తూ బుధవారం నిర్ణయం తీసుకుంది. గత ఏడాది కేంద్రం నిర్వహించిన సమీక్షలో కేవలం ఎజిఎంయుటి (అరుణాచల్‌ప్రదేశ్, గోవా, మిజోరామ్, కేంద్రపాలిత ప్రాంతాలు) పరిధిలో ఒకే ఒక్క అధికారి పనితీరు బాగోలేదని నిర్ధరిస్తూ అతనిని ముందస్తు పదవీ విరమణ ద్వారా ఇంటికి పంపించాలని నిర్ణయించారు. మన రాష్ట్రంలో అధికారుల పనితీరు ఎలా ఉంది, ఎంత మంది ఇంటికి వెళ్లే పరిస్థితి ఉంటుందన్నది తేలాల్సి ఉంటుంది.

నిగ్గుతేలిన నిజం

టువంటి ఆధారాలు లేవని నాలుగేళ్ల క్రితం సిబిఐ ప్రత్యేక కోర్టు వెల్లడించిన తీర్పులో పేర్కొంది. హైకోర్టు తీర్పుపై విజయన్ హర్షం వ్యక్తం చేశారు.

రాజకీయ ప్రతీకారమే అని స్పష్టమైంది : సిపిఎం

లావలిన్ కేసుపై తమ వైఖరి సరైనదేనని హైకోర్టు తీర్పుతో మరోసారి రుజువైందని సిపిఎం వ్యాఖ్యానించింది. రాజకీయ ప్రతీకారంలో భాగంగానే విజయన్‌ను ఈ కేసులో ఇరికించారని పునరుద్ఘాటించింది. ఉద్దేశపూర్వకంగానే సిబిఐ ఈ కేసు నమోదు చేసిందని, విజయన్‌తోపాటు సిపిఎం ప్రతిష్టను దిగజార్చేందుకు జరిగిన కుట్రలో ఇది భాగమని వివరించింది.

'ఓటె'త్తిన నంద్యాల

(మొదటిపేజీ తరువాయి)

మధ్యాహ్నం 12 గంటల కల్లా ఫలితాలు వెల్లడవుతాయి. పోటీలో నిలిచిన రెండు ప్రధాన పార్టీలూ ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనిచేయడంతో నంద్యాల ఎన్నిక వాతావరణం వేడెక్కింది. గతంతో పోల్చుకుంటే ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. సాయంత్రం 3గంటల సమయంలో మంత్రి భూమా అఖిలప్రియ సోదరి మౌనికారెడ్డి అనుచరులతో ఏడోవార్డు పోలింగుబూత్‌లోకి వెళ్లారు. దొంగ ఓట్లు వేస్తున్నారని వైసిపి ఏజెంటు ఎదురు తిరగడంతో అతన్ని కొట్టారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు ఏ.వి.సుబ్బారెడ్డి, వైసిపి నేత శిల్పా చక్రపాణిరెడ్డి అక్కడకు చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఐజి ఇక్బాల్ వారిని అక్కడ నుండి పంపించేశారు. అదే సమయంలో మరో బూత్ వద్ద అఖిలప్రియ సోదరుడు జగత్‌విఖ్యాత్‌రెడ్డి, శిల్పా కుమారుడికి మధ్య తోపులాట జరిగింది. అంతకుమించి చెప్పుకోదగ్గ ఘర్షణలేవీ జరగకపోవడంతో పోలీసు, ఎన్నికల యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారికి గుండెపోటు రావడంతో వెంటనే తరలించి చికిత్స అందించారు. ఒక కానిస్టేబుల్ గుండెపోటుతో మృతి చెందారు. అతని కుటుంబానికి ఎన్నికల సంఘం తరపున రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. అతనికి 20 నెలల జీతాన్నిస్తామని ఎన్నికల అధికారి భన్వర్‌లాల్ ప్రకటించారు. నంద్యాల హోలి క్రాస్ హైస్కూల్‌లో 94, 95 కేంద్రాల్లో, ఎన్‌జిఓ కాలనీలోని కేంద్రాల్లో కొంతసేపు ఇవిఎంలు మొరాయించాయి. గోస్పాడు మండలంలో యాలూరు, కృష్ణాపురంలో ఇవిఎంలు మొరాయించడంతో గంట ఆలస్యంగా పోలింగ్ నమోదయ్యింది. మొత్తం 225 పోలింగు స్టేషన్లలో 23 కంట్రోలు యూనిట్లు, 14 ఓటర్ వెరిఫికేషన్ ప్లేట్స్ మిషన్లలో ఇబ్బందులు రాగా వాటిని వెంటనే మార్చారు. ఈ సమయంలో ఓ పోలింగు బూత్‌లో పోలింగు ఆలస్యమయ్యింది. ఎన్నికలు నిర్వహించిన తీరుపై ప్రధాన ఎన్నికల అధికారి భన్వర్‌లాల్ సంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం 7గంటలకు పోలింగు మొదలైనప్పటి నుండి పలువురు మంత్రులు, జడ్పీ ఛైర్మన్లు, ఎమ్మెల్యేలు నెంబర్లు లేని కార్లలతో తిరుగుతూ ఓటర్లను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించారు. అయినా వారి జోలికెళ్లని పోలీసులు ప్రతిపక్ష నాయకుల్ని మాత్రం తరిమేశారు. మధ్యాహ్నం 3గంటల నుండి అధికార పార్టీ నాయకుల దాడులు పెరిగాయి. ఎక్కడికక్కడ వైసిపి ఏజెంట్లు, ప్రభావం చూపుతున్న నాయకులపై దాడులకు దిగారు. వైసిపి కౌన్సిలర్‌ను చితకబాదారు. గాంధీనగర్ పోలింగ్ కేంద్రం వద్ద వైసిపి నాయకులు రాజగోపాల్‌రెడ్డిపై స్థానికేతరుడైన ఒంగోలు మాజీ ఎమ్మెల్యే రాంబాబు అనుచరులు దాడులకు పాల్పడ్డారు. టిడిపి కార్యకర్తలు పోలింగ్ కేంద్రం వద్దనే డబ్బులు పంపిణీ చేస్తుండడంతో వైసిపి నాయకులు తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. ఎన్నికను సిఈసి అనుక్షణం పర్యవేక్షించింది.

టిడిపిపై ఇసికి వైసిపి ఫిర్యాదు

నంద్యాల ఉపఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఎన్నికల కోడ్ ఉల్లంఘించిందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి శివకుమార్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈమేరకు బుధవారం సాయంత్రం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి భన్వర్‌లాల్‌కు వినతిపత్రం అందజేశారు.

జగన్‌కు నోటీసులివ్వడంలో తాత్సారం చేయలేదు : భన్వర్‌లాల్

ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి నోటీసులు అందజేసే విషయంలో ఎక్కడా తాత్సారం లేదని భన్వర్‌లాల్ స్పష్టం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం నుంచి 21న సాయంత్రం ఆరుగంటలకు తమకు లేఖ అందిందని, వెంటనే ఆ లేఖను ఎనిమిది గంటలకు రిటర్నింగ్ అధికారికి పంపామని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్ల పనులున్నందున బుధవారం నోటీసులు అందజేశామని తెలిపారు. దీనిపై పోలీస్ కేసు కూడా నమోదైందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నుంచి వచ్చిన లేఖను తొక్కిపెట్టాల్సిన అవసరం తమకు లేదన్నారు. వార్నింగ్ లెటర్ కంటే ఎన్నికల ఏర్పాట్లే తమకు ముఖ్యమని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారం ముగిసిన తరువాత ఎన్నికల గుర్తులను చూపిస్తూ సాక్షి ఛానెల్ ప్రసారం చేసిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎన్నికలకు ముందు కొన్ని ఛానెళ్ల ప్రీ-పోల్ సర్వేలు ప్రసారం చేసిన విషయాన్ని మీడియా భన్వర్‌లాల్ దృష్టికి తీసుకురాగా, నిబంధనల మేరకు ఆయా ఛానెళ్లపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఓటర్లను ప్రభావితం చేసేలా స్థానికేతర నాయకులు నంద్యాలలో తిష్టవేశారనే దానిపై ఆయన




జవాబిస్తూ స్థానికేతరులు ఎవరు లేరని, పోలింగ్ ముగిసినందున దీనిపై చర్చ అవసరం లేదని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అన్ని పార్టీల నుంచి ఫిర్యాదులు అందాయని, వాటిపై విచారణ చేయిస్తామన్నారు.

పోలింగు జరిగిందిలా...

నంద్యాల ఉప ఎన్నికల్లో రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. నంద్యాల అర్బన్‌లో 74.06, నంద్యాల రూరల్‌లో 87.06, గోస్పాడులో 90.08 కలిపి మొత్తంగా 79.02 శాతం నమోదైంది. నియోజకవర్గంలో 2,18,856 మంది ఓటర్లకుగాను ఉదయం తొమ్మిది గంటలకు 37,236 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 11 గంటలకు 70,909 మంది ఓట్లు వేశారు. మధ్యాహ్నం ఒంటి గంటకు 53 శాతం, మూడు గంటలకు 72 శాతం ఐదు గంటలకు 77.66 శాతం పోలింగ్ నమోదైంది.

జగన్మోహన్ రెడ్డిపై ఇసి కేసు



కర్నూలు జిల్లా నంద్యాలలో ఈనెల 3న బహిరంగసభలో 'చంద్రబాబును కాల్చి చంపినా తప్పులేదు' అని వైఎస్.జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేంద్ర ఎన్నికల కమిషన్ స్పందించింది. కమిషన్ సూచన మేరకు నంద్యాల 3వ పట్టణ పోలీసు స్టేషన్‌లో జగన్మోహన్ రెడ్డిపై కేసు నమోదు చేశారు. ఎన్నికల అధికారి, ఎఎస్‌పి రవిప్రకాష్ ఫిర్యాదు మేరకు ఐపిసి 188, 504, 506, 125 సెక్షన్ల కింద బుధవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



నంద్యాల రామకృష్ణ ఎయిడెడ్ పాఠశాల పోలింగు కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్న శిల్పామోహన్‌రెడ్డి

ఓటమి భయంతోనే టిడిపికి అసహనం : శిల్పా

ప్రజాశక్తి - కర్నూలు

తమను ఇబ్బందులు పెట్టేందుకు పోలీసులు పదే పదే ప్రయత్నించారని, తాము లొంగకపోవడంతో వెనుదిరిగారని వైసిపి అభ్యర్థి శిల్పా మోహనరెడ్డి తెలిపారు. ఎన్నికల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పోలింగు స్టేషన్లలో తమ ఏజెంట్లను టిడిపి నాయకులు బయటకు పంపేందుకు ప్రయత్నించారని, పోలీసులు వారి జోలికెళ్లలేదని ఆయన చెప్పారు. నంద్యాలకు సంబంధంలేని టిడిపి ఎమ్మెల్యేలు ఎస్‌వి మోహన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మణిగాంధీ, జనార్ధన్‌రెడ్డి, అఖిలప్రియ, ఎంపి టిజి వెంకటేష్ ఎన్నికల ప్రక్రియకు విఘాతం కల్పించారన్నారు. ఓటమి ఖాయం కావడంతోనే టిడిపి నేతలు అసహనానికి గురయ్యారని శిల్పా పేర్కొన్నారు. అవినీతి సొమ్మును నంద్యాలలో కుమ్మరించారని వైసిపి నాయకులు వాసిరెడ్డి పద్మ హైదరాబాద్‌లో విమర్శించారు.

టిడిపికి బ్రహ్మరథంపట్టారు: కళా వెంకట్రావు

నంద్యాల ప్రజలు టిడిపికి బ్రహ్మరథం పట్టారని టిడిపి ఎపి అధ్యక్షులు కళా వెంకట్రావు తెలిపారు. ఉప ఎన్నికల్లో ప్రతిపక్షం ఇష్టం వచ్చినట్లు వ్యవహరించిందని, దీనిపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశామని టిడిపి నాయకులు టి.డి.జనార్ధన్ తెలిపారు. టిడిపి గెలుపు ఖాయమని పేర్కొన్నారు. జగన్‌కు నష్టం జరగకూడదని ఇసి అధికారులు వ్యహరించారని, 21నే నోటీసులు వచ్చినా జగన్‌కు ఇవ్వలేదని, సగం ఓటింగు పూర్తయిన తరువాత ప్రకటన చేశారని పేర్కొన్నారు.

ప్రజానాట్యమండలి మధుసూధన్‌రెడ్డి మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు, 'నెలనెలా వెన్నెల' గౌరవాధ్యక్షులు పన్నాల మధుసూదన్‌రెడ్డి (50) మంగళవారం హైదరాబాద్‌లో అకస్మికంగా మృతి చెందారు. ఆయన అంత్యక్రియలు బుధవారం ఖమ్మంలో నిర్వహించారు. ఎన్ఎస్‌టీ రోడ్‌లోని మధు స్వగృహం నుంచి కాల్వొడ్డులోని హిందూ శ్మశానవాటిక వరకు అంతిమయాత్ర సాగింది. కళలపై మక్కువతో ప్రజానాట్యమండలిలో కళాకారుడిగా, యాక్టర్‌గా, డైరెక్టర్‌గా, 10 టివి ఎస్టేట్ మేనేజర్‌గా, హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం పర్యవేక్షులుగా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించారని అనంతరం జరిగిన సంతాప సభలో పలువురు కొనియాడారు. సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.వెంకట్, పోతినేని సుదర్శన్‌రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సాయిబాబు, నున్నా నాగేశ్వరరావు, ప్రజానాట్యమండలి సీనియర్



నాయకులు కె.దేవేందర్, 10టీవీ సిఓఓ సజ్జా ప్రసాద్ తదితరులు మధుతో తమ జ్ఞాపకాలను పంచుకున్నారు. మధుసూధన్ మృతి పట్ల ప్రజాశక్తి సంపాదకులు పాటూరు రామయ్య సంతాపం వ్యక్తం చేశారు. వివిధ బాధ్యతల్లో మధు నిబద్ధతతో పనిచేశారని ఆయన కొనియాడారు.

ఏపి ప్రజానాట్యమండలి సంతాపం

మధుసూధన్ రెడ్డి మృతి పట్ల ప్రజానాట్యమండలి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు ఎస్‌జిఎం భాషా, పులిమామిడి యాదగిరి, డి క్రాంతికుమార్ సంతాపం తెలిపారు. ఆంధ్రప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీ సభ్యునిగా పనిచేసిన మధుసూధన్ అందించిన సేవలను వారు కొనియాడారు.

జరిమానా కట్టాల్సిందే...

తప్పుడు ధ్రువపత్రాల కేసులో విజయరామరాజుకు చుక్కెదురు

ప్రజాశక్తి - హైదరాబాద్

తప్పుడు ధ్రువపత్రంతో ఎస్టీగా రిజర్వుడు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు జరిమానా కట్టాల్సిందేనని హైకోర్టు మరోసారి తేల్చి చెప్పింది. ఎమ్మెల్యేగా పనిచేసిన కాలానికి రూ.2.25 లక్షలు జరిమానా చెల్లించాలని, అదే విధంగా, నాలుగుసార్లు ఎమ్మెల్యేగా (1999 నుంచి 2004 వరకు) గెలుపొందిన ఒకో సింటింగ్‌కు రూ.500 చొప్పున జరిమానా చెల్లించాలన్న సింగిల్ జడ్జి గత ఏడాది అక్టోబర్‌లో ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకునేందుకు డివిజన్ బెంచ్ నిరాకరించింది. నెలలోగా జరిమానాను హైకోర్టు రిజిస్ట్రార్ (జుడీషియల్) వద్ద జమ చేయాలని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఈ ఆదేశాలిచ్చింది. 1999లో ఎస్టీ సీటు నుంచి (నాగూరు) శత్రుచర్ల గెలిచారని, ఆయన ఎస్టీ కాదని, క్షత్రియుడని మాజీ శాసనసభ్యుడు నిమ్మక జయరాజు వేసిన వ్యాజ్యానికి అనుకూలంగా హైకోర్టు తీర్పు వెలువడింది. తర్వాత ఈ తీర్పును సుప్రీంకోర్టు కూడా సమర్థించింది. తప్పుడు పత్రాలతో రిజర్వుడు సీటు నుంచి ఎమ్మెల్యేగా గెలిచి తీసుకున్న జీతభత్యాల్ని ఆయన నుంచి రాబట్టాలంటూ నిమ్మక జయరాజ్ మరో కేసు వేశారు. దీనిపై హైకోర్టు గత ఏడాది అక్టోబర్‌లో రాజ్యాంగంలోని 193 అధికరణ ప్రకారం ఒక్కో సిట్టింగ్‌కు రూ.500 చొప్పున జరిమానా చెల్లించాలని తీర్పు చెప్పింది. అంతేకాక తనకు కొండదొర (ఎస్‌టీ) ధ్రువపత్రం ఇచ్చేలా అధికారులను ఆదేశించాలంటూ విజయరామరాజు చేసిన అభ్యర్థనను న్యాయమూర్తి తిరస్కరించారు.



అను ఇమ్మానుయేల్

ఎన్టీఆర్‌కు జోడీగా అను

ఎన్టీఆర్ ప్రస్తుతం 'జై లవ కుశ' షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా సెట్ వేసి అందులో ఎన్టీఆర్, రాశీ ఖన్నాపై గీతం చిత్రీకరిస్తున్నారు. శుక్రవారం వినాయక చవితిని పురస్కరించుకుని ఆ సినిమా రెండో టీజర్, లుక్ గా లవ స్టిల్ విడుదల చేయనున్నారు. ఈ సినిమా దసరాకు విడుదల కానుంది. ఇది పూర్తయిన వెంటనే త్రివిక్రమ్ దర్శకత్వంలో మరో సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది. ఇందులో అను ఇమ్మానుయేల్‌ను కథానయికగా ఎంపిక చేశారు. మొదట ఈ అమ్మడు తెలుగులో 'మజ్ను'తో రంగ ప్రవేశం చేసింది. తర్వాత 'ఆక్సిజన్' చిత్రంలో గోపీచంద్‌తో చేసే అవకాశం పొందింది. ఇప్పుడు పెద్ద స్టార్స్ సినిమాల్లో చేసే ఛాన్స్‌లు వస్తున్నాయి. ప్రస్తుతం అల్లు అర్జున్ చిత్రం 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'లో నటిస్తోంది. దీంతో పాటు పవన్ కళ్యాణ్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమాలోనూ కథానాయికగా చేస్తోంది. ఈమె నటన మాటల మాంత్రికుడికి నచ్చిందో ఏమో కానీ ఆయన దర్శకత్వంలో తెరకెక్కన్న ఎన్టీఆర్ చిత్రంలో ఈమేనే హీరోయిన్‌గా తీసుకోవడం విశేషం.



పనిచేయడమే రిలాక్సేషన్

- ధనుష్

'రఘువరన్ బీటెక్'కు సీక్వెల్‌గా రూపొందిన చిత్రం 'వీఐపీ 2'. ధనుష్, అమలా పాల్ హీరో హీరోయిన్లు. బాలీవుడ్ కథానాయిక కాజోల్ ప్రతినాయకురాలుగా చేశారు. సౌందర్య రజనీకాంత్ దర్శకత్వం వహించారు. ఈ సినిమా తెలుగులో ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా సౌందర్య, ధనుష్ బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో ముచ్చటించారు.

'రఘు వరుణ్ బి.టెక్' హిట్టవడమే 'వీఐపీ-2'ను చేయడానికి కారణమా?

అవును. 'రఘు వరుణ్ బి.టెక్' హిట్టవ్వడంతో దీన్ని తెలుగులో కూడా చేయడం కరెక్ట్ అనుకున్నాను. నటుడిగా నాకు ఇదే మొదటి తెలుగు సినిమా.

తెలుగులో రిలీజ్ ఎందుకు ఆలస్యమైంది ?

ముందుగా రెండింటినీ ఒకేసారి విడుదల చేయాలని అనుకున్నాం. కానీ కొన్ని కారణాల వల్ల తెలుగు ఆలస్యమైంది. ఇక తమిళంలో ఈనెల 11 దాటితే మంచి రిలీజ్ డేట్ లేదు. అందుకే అక్కడ ముందుగా రిలీజ్ చేశాం. ఇక తెలుగులో ఈ నెల 25 అన్ని విధాలా మంచి తేదీ అని భావించి రిలీజ్ చేస్తున్నాం.

'వీఐపీ-2' కి 'రఘువరన్ బి.టెక్' కు తేడా ఏంటి ?

ఇందులో హీరో పాత్ర, సెంటిమెంట్స్. కామెడీ, మాస్ ఎలిమెంట్స్ అన్నీ 'రఘువరన్'లో ఉన్నట్టే ఉంటాయి. కాజల్ మేడమ్ పాత్రను నేను ఎలా ఎదుర్కొన్నాను అనేదే ఇందులో కొత్తగా కనిపించే పాయింట్.

స్క్రిప్ట్ పూర్తి చేయగానే సౌందర్యే డైరెక్టర్ అనుకున్నారా?

ఈ స్క్రిప్ట్ రాయగానే సినిమాను ఎలా స్టార్ట్ చేయాలి అనే దానిపై అస్సలు క్లారిటీ లేదు. అదే టైమ్‌లో ఈ చిత్ర నిర్మాత థానుతో ఒక సినిమా చేయాల్సి ఉంది. సౌందర్య ఆలోచనలు కూడా గ్రాండ్‌గానే ఉంటాయి. అందుకే ఈ సినిమాకు ఆమే కరెక్ట్ అని నిర్ణయించాం.

సినిమాను తెలుగులో కూడా చేస్తామని కాజోల్‌కి ముందే చెప్పారా?

ఆమెకు అన్నీ తెలుసు. ఆమె కేవలం తమిళ సినిమా మాత్రమే చేయాలని అనుకోలేదు. హిందీ కానిది ఏదైనా చేయాలని అనుకున్నారు. కానీ హిందీ కాకుండా ఆమెకు వచ్చిన భాష తమిళ్ కాబట్టి అందులో చేస్తే సౌకర్యంగా ఉంటుందని భావించారు. తెలుగులో చేయడం పట్ల ఆమెకు ఎలాంటి అభ్యంతరం లేదు.

రెండు భాషల్లో షూట్ చేయడానికి ఎన్ని రోజులు పట్టింది?

తమిళ్, తెలుగులో చేయడానికి 52 రోజులు పట్టింది. తెలుగులో చేసేటప్పుడు అందరూ తెలుగులో మాట్లాడితే కాజోల్ మేడమ్ ఒక్కరే తమిళంలో మాట్లాడేవారు. ఒకవేళ ఆమె తెలుగులో మాట్లాడి ఉంటే ఇంకా ఎక్కువ సమయం పట్టేది.

సౌత్ ఇండస్ట్రీని, బాలీవుడ్‌ని, హాలీవుడ్‌ని వేరు చేసే అంశాలు ఏమిటి?

నేను ఎలా పని చేస్తున్నాను? సినిమా చేసేవాళ్ళు ఎలా చేస్తున్నారనే అంశాల్లో ఎక్కడైనా తేడా కన్పిస్తుంది. బాలీవుడ్ నుండి కచ్చితత్వం ఎలా ఉంటుందో నేర్చుకున్నాను. ఇది నా వ్యక్తిగత ఉద్దేశం మాత్రమే.

మీరు చాలా రోజులుగా బిజీ బిజీగా ఉన్నారు కదా రిలాక్సేషన్ కోసం ఏం చేస్తారు?

నాకు పనిచేయడమే రిలాక్సేషన్. ఎప్పుడూ పని చేస్తూనే ఉంటాను. చిన్న పిల్లలకు ఆడుకోవడం ఎంత ఇష్టమో నాకు పనిచేయడమూ అంతే ఇష్టం. చేసే పనిని ఎంజాయ్ చేస్తూ చేయాలని అనుకుంటాను.

సౌందర్యగారు... ధనుష్ రాసిన స్క్రిప్ట్ మొదటిసారి చూడగానే ఏమనిపించింది?

చూడగానే చాలా బాగా అనిపించింది. ఎందుకంటే రఘువరన్ గురించి ఆయనకే బాగా తెలుసు. అందుకే ఆయన రాసిన కథ బాగా నచ్చింది.

జీవితాన్ని మలుపు తిప్పిన చిత్రం



రకుల్ ప్రీత్‌సింగ్, బెల్లంకొండ శ్రీనివాస్

'జయ జానకి నాయక' బోయపాటి మార్క్ సినిమా అని చిత్ర కథానాయకుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ అన్నారు. రెండువారాలు పూర్తయి మూడో వారంలోకి ప్రవేశించిన సందర్భంగా చిత్ర యూనిట్ విజయాన్ని గురించి తెలియజేస్తూ బుధవారం హైదరాబాద్‌లో మాట్లాడింది. సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ 'నా నటజీవితాన్ని మలుపు తిప్పిన సినిమా ఇది. సినిమా మొదలు పెట్టినప్పుడు ఇది ప్రతీ గుండెను తాకే చిత్రం అవుతుందని నమ్మకంతో తీశాం. ఇప్పుడు అలాగే ప్రేక్షకులు ప్రతి ఒక్కరూ గుండెల్లో ఈ సినిమా పెట్టుకుని చూస్తున్నారు. ఇతర సినిమాల పోటీ వున్నా ఎక్కడా తగ్గకుండా అనుకున్న సమయానికి రిలీజ్ చేసినందుకు ప్రేక్షకులు పెద్ద హిట్ ఇచ్చారు' అని చెప్పారు.

హీరోయిన్ రకుల్ ప్రీత్‌సింగ్ మాట్లాడుతూ 'చిత్రంలో బలమైన సందేశం ఉంది. ఎమోషన్స్, సెంటిమెంట్, డ్రామా సీన్స్‌ని బాగా క్యారీ చేశారు. ఇన్ని సినిమాలు చేసినా గానీ, జానకి క్యారెక్టర్‌కి వచ్చినంత రెస్పాన్స్ ఏ చిత్రానికీ రాలేదు. నేను చాలా ఎంజాయ్ చేస్తూ చేసిన సినిమా ఇది. బోయపాటిగారితో మరిన్ని చిత్రాల్లో నటించాలని ఉంది" అని తెలిపారు.

బోయపాటి శ్రీను మాట్లాడుతూ 'ఈ సినిమాని ఎంతగానో నమ్మి చేశాను. ఎన్ని తరాలు మారినా మానవ సంబంధాలు మారవు. ఆ పాయింట్‌తో ఎన్ని రకాల సినిమాలు అయినా తీయొచ్చు. అవి ఎప్పుడైనా సక్సెస్ అవుతాయి. దీనికి నిదర్శనమే ఈ చిత్రం' అని పేర్కొన్నారు.

ఛాలెంజింగ్ క్యారెక్టర్ చేశా



సచిన్ జోషి

సచిన్, ఇషా గుప్తా హీరో హీరోయిన్లుగా వై కింగ్ మీడియా అండ్ ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్‌పై తాతినేని సత్య దర్శకత్వంలో రైనా జోషి నిర్మించిన చిత్రం 'వీడెవడు'. ఈ సినిమా సెప్టెంబర్ 8న విడుదలవుతుంది. ఈ సందర్భంగా ప్రసాద్ లాబ్స్‌లో జరిగిన సమావేశంలో దర్శకుడు తాతినేని సత్య మాట్లాడుతూ ' నేను తెలుగులో చేసిన స్ట్రయిట్ మూవీ ఇది. సచిన్ జోషిగారు ఎక్సలెంట్‌గా నటించారు. మంచి థ్రిల్లర్ మూవీ. అన్ని ఎలిమెంట్స్ ఉంటాయి' అని చెప్పారు.

సి.కల్యాణ్ మాట్లాడుతూ 'డిఫరెంట్ కాన్సెప్ట్‌తో వస్తోన్న సినిమా ఇది. టైటిల్ చాలా ఆసక్తిగా ఉంది. దర్శకుడు సత్య సినిమాను ఎంతో ఇంటెలిజెంట్ స్క్రీన్‌ప్లేతో తెరకెక్కించాడు. సెప్టెంబర్ 2న సినిమా ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహిస్తాం' అని అన్నారు. సచిన్ జోషి మాట్లాడుతూ 'మంచి థ్రిల్లర్ మూవీ. నా రోల్‌లో పాజిటివ్ యాంగిల్, నెగటివ్ యాంగిల్ రెండూ ఉన్నాయి. ఛాలెంజింగ్ క్యారెక్టర్. యూనిక్ స్క్రీన్‌ప్లేతో సాగుతుంది. సినిమాలో అన్ని ఎలిమెంట్స్ ఉన్నాయి. లవ్, యాక్షన్, స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే మూవీ. ప్రేక్షకులు నా నుండి ఏదైతే ఆశించి వస్తారో ఆ ఎలిమెంట్స్ అన్ని సినిమాలో ఉంటాయి' అని పేర్కొన్నారు.



కొత్తవారితో 'వెళ్ళిపోమాకే'

నూతన నటీనటులు, సాంకేతిక నిపుణులతో నిర్మాత దిల్ రాజు మరోసారి కొత్త చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఆ చిత్రమే 'వెళ్ళిపోమాకే'. యాకూబ్ అలీ దర్శకత్వం వహిస్తున్నారు. ఇది ఫీల్ గుడ్ లవ్ స్టోరీ అని నిర్మాత చెప్పారు. విశ్వక్ సేన్ సహా ఏడెనిమిది క్యారెక్టర్స్ మధ్య సాగే ఫీల్ గుడ్ మూవీ ఇది. హీరో విశ్వక్ సేన్ అనుపమ్ ఖేర్ ఫిలిం ఇన్‌స్టిట్యూట్లో శిక్షణ తీసుకున్నారు. డైరెక్టర్ యాకూబ్ అలీ రామానాయుడు స్టూడియోలో దర్శకత్వ శాఖలోనూ మ్యూజిక్ డైరెక్టర్ ప్రశాంత్ విహారి రెహమాన్ మ్యూజిక్ స్కూల్‌లోనూ తర్ఫీదు పొందారు. ఈ సినిమా సెప్టెంబర్2న విడుదల కానుంది.



ముగ్గురూ మూడో సారి

ఫోర్బ్స్ జాబితాలో షారుఖ్, సల్మాన్, అక్షయ్‌లకు స్థానం

అమెరికన్ ప్రముఖ బిజినెస్ మ్యాగజైన్ ఫోర్బ్స్‌లో అత్యధిక పారితోషికం తీసుకుంటున్న టాప్ 10 నటుల జాబితాలో మన భారతీయులు మరోసారి చోటు దక్కించుకున్నారు. షారుక్ ఖాన్, సల్మాన్ ఖాన్, అక్షయ్ కుమార్ మొదట పది స్థానాల్లో నిలిచారు. అయితే వరుసగా మూడేళ్ల పాటు వీరి ముగ్గురూ ఫోర్బ్స్ స్థానం దక్కించుకోవడం విశేషం. అమిర్‌కు ఈసారి చోటు దక్కలేదు. ఆయన హీరోగా చేసిన 'దంగల్' చిత్రం ప్రపంచవ్యాప్తంగా బ్లాక్‌బస్టర్ హిట్ సాధించింది. ఇది ఒక్క చైనాలోనే రూ.2000 కోట్లు రాబట్టినప్పటికీ ఫోర్బ్స్ లిస్ట్‌లో అమిర్ ఖాన్ లేకపోవడం గమనార్హం. 2016 జూన్ 1 నుంచి సేకరించిన నివేదిక ప్రకారం అత్యధిక పారితోషికం పొందుతున్న 20 మంది జాబితాను ఫోర్బ్స్ విడుదల చేసింది.

బాలీవుడ్ నుంచి చోటు దక్కించుకున్న ముగ్గురు హీరోల్లో షారుఖ్ ఖాన్ మొదటి స్థానంలో ఉన్నారు. గత ఏడాది 33 మిలియన్ డాలర్లు (సుమారు రూ.211కోట్లు) పారితోషికంగా తీసుకుంటే, ఈ ఏడాది 38 మిలియన్ డాలర్ల(దాదాపు రూ.243కోట్లు)తో ఎనిమిదో స్థానంలో నిలిచాడు. 2016లో కూడా షారుఖ్ ఎనిమిదో వ్యక్తే కావడం విశేషం. ఈ ఏడాది చేసిన ఆయన చిత్రాలు 'రాయీస్', 'జబ్ హ్యారీ మెట్ సెజల్' బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి.

గత ఏడాది 28.5 మిలియన్ డాలర్ల(సుమారు రూ.182కోట్లు)తో 14వ స్థానంలో ఉన్న సల్మాన్ ఖాన్ ఏడాది 37 మిలియన్ డాలర్ల(సుమారు 237కోట్లు)తో తొమ్మిదో వ్యక్తిగా నిలిచారు. ఈ ఏడాది సల్మాన్ చేసిన సినిమాలు ఫ్లాప్ అయినా 'బిగ్ బాస్' రియాల్టీ షో వల్ల ఇంత ఎక్కువగా సంపాదించగలిగారని ఫోర్బ్స్ పేర్కొంది.

గత ఏడాది, ఇప్పుడు కూడా అక్షయ్ కుమార్ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద కాసులు కురిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆయన చేసిన 'టాయ్‌లెట్ : ఏక్ ప్రేమ్ కథ' చిత్రం ఎనిమిది రోజుల్లో వంద కోట్ల క్లబ్‌లో చేరిపోయింది. ఈ రెండేళ్ల అక్షయ్ అత్యధిక పారితోషికంగా పొందుతున్న పదో వ్యక్తిగా నిలిచారు. ఈయనను బాలీవుడ్ కింగ్‌గా ఫోర్బ్స్ పేర్కొనడం విశేషం. గత ఏడాది 31.5 మిలియన్ డాలర్ల(సుమారు 201కోట్లు) తీసుకుంటే, 2017లో 35.5 మిలియన్ డాలర్ల(సుమారు 227 కోట్లు)తో పాత స్థానాన్ని పదిలి పరుచుకున్నారు. ఈ ఏడాది అమితాబ్ బచ్చన్‌కు ఈ లిస్ట్‌లో చోటు లభించలేదు. హీరోయిన్లలో దీపికా కూడా అంతే.

ఎక్కువ పారితోషికం తీసుకుంటున్న నటుల్లో హాలీవుడ్ నటుడు మార్క్ వాల్‌బర్గ్ మొదటి స్థానంలో ఉన్నారు. డ్వెయిన్ జాన్సన్, విన్ డీజిల్, ఆడమ్ శాండ్లర్, జాకీ చాన్, జూ.రాబర్ట్ డౌనీ, టామ్ క్రూజ్ వరుసగా తర్వాత స్థానాల్లో నిలిచారు.





నాకైతే బోల్డ్ అనిపించడం లేదు

- 'అర్జున్ రెడ్డి' దర్శకుడు సందీప్ వంగ

'అర్జున్ రెడ్డి' ఎమోషనల్ ప్రతీకార కథ అని, రొమాన్స్ కూడా సహజంగా ఉండేలా చిత్రించామని దర్శకుడు సందీప్ వంగ అన్నారు. విజయ్ దేవరకొండ, షాలినీ పాండే జంటగా నటించిన చిత్రమిది. సందీప్ వంగ దర్శకత్వం వహించారు. ఈ శుక్రవారమే విడుదల కానున్న నేపథ్యంలో ఆయన బుధవారం మాట్లాడారు.

- చాలా కాలం తర్వాత ప్రేమికుల్లో సహజంగా ఉండే ఎమోషన్స్‌ను ఇందులో చూపించాం. కొన్ని కారణాల వల్ల ముద్దు సన్నివేశాలను పెట్టాల్సి వచ్చింది. అవి కూడా సన్నివేశపరంగానే ఉంటాయి. ఇది మెడికో బ్రేకప్ కథ. పతాక సన్నివేశంలో ఆ అమ్మాయి కలుస్తుందా! లేదా! అనేది తెరపై చూడాల్సిందే.
- కథ రియల్‌లైఫ్‌లో జరిగిన కొన్ని సంఘటల స్ఫూర్తిగా తీసుకుని చేశాను. ఫిజియోథెరపిస్ట్‌గా ప్రస్తుతం చేస్తున్నాను. నేను నాలుగేళ్ళు చదవాల్సిన కోర్సును ఆరేళ్లు చదివాను. అందుకు కారణం ఇలాంటి ప్రేమకథే. ఆ కోర్సు తర్వాత ఫిలింమేకింగ్‌పై ఇంట్రెస్ట్‌తో ఆస్ట్రేలియాలో కోర్సు చేసి తెలుగువాడిగా సినిమా తీయాలని చేసిన చిత్రమిది.
- నాగార్జున 'కెడీ' సినిమాకు పనిచేశాను. క్రాంతి మాధవ్ దర్శకత్వంలో వచ్చిన 'మళ్ళీమళ్ళీ ఇది రానిరోజు'కు పనిచేశాను. విజయ దేవరకొండకు ఈ కథను 'పెళ్లిచూపులు'కు ముందే చెప్పాను. నేను కథ చెప్పినప్పుడు ఆ సినిమా మొదలు కాలేదు. నేను ఆఫీసు ప్రారంభించగానే.. అప్పుడు ఆ సినిమా మొదలైంది. కథ ప్రకారం ఎక్కడెక్కడో షూటింగ్ చేయాల్సి వచ్చింది. అందుకే కాస్త ఆలస్యమైంది.
- సినిమాలో ముద్దు సన్నివేశాలంటే.. మోడ్రన్ సొసైటీలో ఇలాగే ఉంటుంది. పబ్లిసిటీలో ఆ సీన్ ఉండడంతో చాలా బోల్డ్‌గా పెట్టేశారేమిటి? అని అన్నారు. నాకైతే బోల్డ్ అనిపించడం లేదు. వారిద్దరి కళ్ళు మూసుకుపోయినట్లు ఉంటాయి. వాటిలో ఎక్స్‌ప్రెషన్స్‌ను క్యాచ్ చేస్తారనుకున్నా. కానీ ఇంత గొడవ అవుతుందని అనుకోలేదు. అందుకే వాటిని తీసేయాల్సి వచ్చింది. సినిమాలో కథ ప్రకారమే దాదాపు 25సార్లు అటువంటి సీన్లు ఉంటాయి. దీనికి సెన్సార్ కొన్నిచోట్ల అభ్యంతరాలు చెప్పింది. అలాగే కొన్ని డైలాగ్స్ కూడా అభ్యంతరకరంగా ఉందని తీసేశారు. అయితే సినిమాలో ఏం చూపించామనేది చూశాకే మీకే తెలుస్తుంది.
- ఈ సినిమాకు సంభాషణలు నేనే రాశాను. ఇందులో బయట వాడుకునే పదాలనే పెట్టాను. మాదర్‌చోత్, బాస్టర్. ఐ ఫక్‌యు, ఐ కిల్‌యు.. ఇవన్నీ బయట మాట్లాడే పదాలే. సందర్భానుసారంగా హీరో హీరోయిన్లు ఒక్కోసారి మాట్లాడతారు. నేను హైదరాబాదీగా ఇక్కడ మాట్లాడే పదాలనే పెట్టాను. దానికి సోషల్ మీడియాలో విమర్శలు వచ్చాయి. అందుకే ఇక ముందు సినిమా చేసేటప్పుడు పలు జాగ్రత్తలు తీసుకుంటా.

రోజుకు 18 గంటలు పని చేస్తేనే!



సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చారిత్రాత్మక చిత్రం 'పద్మావతి'. దీపికా పదుకొనే, రణవీర్ సింగ్, షాహిద్ కపూర్ ముఖ్య తారాగణంగా చేస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ప్రారంభం నుంచీ సమస్యలను ఎదుర్కొంటున్నాడు దర్శకుడు. సెట్స్‌పైకి వెళ్లిన తొలి వారంలోనే జైపూర్‌లోనూ, తర్వాత కోల్హాపూర్‌లోనూ ప్రతిఘటనలు ఎదురయ్యాయి. ఈ చిత్రాన్ని అక్టోబర్ 17వ తేదీన ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని ముందుగా ప్రకటించారు. మొదట చెప్పిన తేదీకి సినిమా విడుదల కావాలంటే రోజుకు 18 గంటలు పని చేయాలి. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఎందుకంటే తమకు బీమా కల్పించాలని, ఎనిమిది గంటలు పని వేళలుగా నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ ఉత్తర భారతదేశ సినీ ఉద్యోగులు(ఎఫ్‌డబ్ల్యూఐసీఈ) సమ్మె చేస్తున్నారు. ఈ ప్రభావం ఈ సినిమా షూటింగ్‌పై పడింది. ఉన్నఫలంగా షూటింగ్ షెడ్యూల్‌ను రద్దు చేసుకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం ఉన్న సిబ్బందితో కేవలం రోజుకు 10గంటలు మాత్రమే షూటింగ్ జరిపే అవకాశం ఉందట. అందువల్ల అనుకున్న తేదీకి చిత్రాన్ని విడుదల చేయడం కష్టం. ఇప్పటికే నిర్మాతలు తీవ్రంగా నష్టపోవడంతో దర్శకుడు భన్సాలీ ధైర్యం ఎటువంటి సాహసం చేసేందుకు ముందుకు రావడం లేదు.

దీపికా పదుకొనే


బ్లూ వేల్ ఛాలెంజ్..!

ఇదో సైకో గేమ్...



'బ్లూవేల్ ఛాలెంజ్ గేమ్..' ఇదో సైకో గేమ్. మనం కొత్తగా మెయిల్ లేదా ఫేస్‌బుక్‌ను ఓపెన్ చేసే విధంగానే ఈ గేమ్‌ను కూడా ఓపెన్ చేయాలి. ఆన్‌లైన్‌లో బయోడేటా నింపిన అనంతరం ఈ గేమ్ అప్లికేషన్ సిస్టమ్ లేదా స్మార్ట్‌ఫోన్‌లోకి డౌన్‌లోడ్ అవుతుంది. డౌన్‌లోడ్ అయిన 'బ్లూ వేల్ ఛాలెంజ్ గేమ్'ను మన స్మార్ట్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవడంతో ఈ సైకో ఆట మొదలౌతుంది. తొలుత సులభంగా పూర్తిచేయగలిగే ఆహ్లాదం, వినోదం, చిన్న చిన్న గేమ్స్, ఫజిల్స్ వంటి టాస్కులిస్తూ పిల్లల్లో ఆసక్తిని పెంచుతారు. ఆ టాస్క్‌లు పూర్తిచేసే క్రమంలో మళ్ళీ తర్వాతి టాస్క్ ఆన్‌లైన్‌లో వచ్చే సమయం తెలియజేస్తుంటారు. దీంతో గేమ్ ఆడేవారు సమయానికి కంప్యూటర్ల ముందు కూర్చునేలా మారిపోతారు. ఇలా 'బ్లూ వేల్ ఛాలెంజింగ్ గేమ్' టాస్క్‌లు పూర్తిచేసుకుంటూ... పూర్తిచేసినవాటిని తిరిగి బ్లూ వేల్ గేమ్‌కు పంపుతుంటారు. ఈ విధంగా మొత్తం 50 టాస్క్‌లు ఉంటాయి. గేమ్‌లోని టాస్కులు పూర్తి చేసే క్రమంలో.. 'బ్లూ వేల్ గేమ్' ప్లేయర్స్‌ను పూర్తిగా తన బానిసలుగా చేసుకొంటుంది. ఈ గేమ్‌లోని టాస్క్‌లు పూర్తిచేసి పంపే లింకులను బట్టి వారు ఏ స్థాయిలో తమ ఆధీనంలో ఉన్నారో 'బ్లూ వేల్ గేమ్' వారు తెలుసుకుంటారు.





పిల్లలు ఈ 'సైకో గేమ్' ఆడే క్రమంలో కొన్నిసార్లు అర్ధరాత్రులు బయట తిరగడం, ఒంటరిగా తిరుగుతున్న వీడియోలను, చిన్న చిన్న డాబాలపై నుండి దూకిన ఫొటోలు, నీళ్ళల్లో ఈత కొట్టడం, చేతులపై బ్లూ వేల్ బొమ్మను కత్తులతో కోసుకోవడం వంటి టాస్క్‌ల వీడియో లింక్‌లను తిరిగి పంపించాల్సి ఉంటుంది. మరికొన్ని టాస్క్‌లలో ఈ గేమ్ ఆడే పిల్లల నగ్న వీడియో లింక్‌లను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. వీరు చివరి అంకానికి వచ్చే క్రమంలో వారు కోరిన విధంగా చేయకపోతే వారి నగ్న వీడియో లింక్‌లను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తామని బెదిరిస్తారు. ఈ విషయాలను బయటవారికి చెప్పుకోలేక, వారు చెప్పినట్లు చేయలేక పిల్లలు తీవ్ర ఒత్తిడికి గురవుతుంటారు. చివరికి మరణాన్ని సైతం కొనితెచ్చుకోవాల్సిన పరిస్థితికి నెట్టబడతారు.

తొలుత 2013లో జపాన్‌లో ఈ 'బ్లూవేల్ ఛాలెంజింగ్ గేమ్' వెలుగులోకి వచ్చింది. అక్కడ అత్యధిక సంఖ్యలో పిల్లలు ఈ గేమ్‌కు బానిసలై మృతి చెందారు. అనంతరం ఈ గేమ్ రష్యా, అమెరికా ఇతర అగ్రదేశాలకు పాకి అనేకమంది పిల్లలను బలితీసుకుంది. దీంతో చాలా దేశాల్లో ఈ గేమ్‌ను నిషేధించారు. ఇప్పుడు 'బ్లూ వేల్ ఛాలెంజింగ్ గేమ్' ఇటీవల భారతదేశానికి కూడా పాకింది. పిల్లలే కాకుండా కొంతమంది పెద్దవారు కూడా ఈ 'బ్లూవేల్ గేమ్'కు బానిసవ్వడం చూస్తుంటే ఈ గేమ్‌ను తప్పనిసరిగా సైకో గేమ్ అనక తప్పదు.

ఇటీవల తిరువనంతపురంలో మనూ అనే బాలుడు ఈ గేమ్ బారిన పడి మృతి చెందిన విషయం తెలిసిందే. "2016 నవంబర్‌లో తమ కుమారుడు (మనూ) ఈ గేమ్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, రోజుకో టాస్క్ పూర్తి చేస్తూ చివరి దశకు చేరుకున్నాడు. ఆ సందర్భంలో మనూ చాలా వింతగా ప్రవర్తిస్తూ వుండేవాడు. ఒక్కోసారి రాత్రిళ్ల ఒంటరిగా బయట కూర్చునేవాడు. అంతేకాదు ఓసారి ఈత రాకపోయినా నదిలో దూకాడు. ఎందుకు దూకాడో అర్థం కాలేదు. మొత్తానికి ప్రాణాలతో బయటపడ్డాడు. మరికొన్నిసార్లు తను ఎవరినైనా చంపాలి లేదా తానే చనిపోవాలి అంటుండేవాడు. ఆ మాటలకు మేము షాక్ అయ్యాం. ఈ గేమ్ గురించి తెలుసుకొని మా కుమారుడ్ని అడియితే... 'బ్లూ వేల్ గేమ్' ఆడట్లేదని చెప్పేవాడు. ఆ తర్వాత కొద్దిరోజులకే ఇంట్లో ఫ్యాన్‌కి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనకు ముందు తన మొబైల్ నుంచి ఈ గేమ్‌ను తొలగించాడు' అని అతని మనూ తల్లి చెబుతోంది. అలా ఇండోర్‌లో మరో విద్యార్థి ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించాడు. ఇప్పటివరకు ఈ గేమ్ వల్ల మన దేశంలో ముగ్గురు పిల్లలు చనిపోయారు. అమాయక పిల్లల్ని తన బానిసలుగా చేసుకొని, బలితీసుకుంటున్న ఈ బ్లూవేల్ ఛాలెంజ్ గేమ్‌కు సంబంధించిన లింకుల్ని తొలిగించాలని విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి.

మన ముంగిట్లోకి వచ్చిన సాంకేతికత అనుబంధాలను హతమార్చుతోంది. కుటుంబమంతా కలిసి సరదాగా గడిపే సమయాలు దాదాపుగా తగ్గిపోయాయి. చిన్నాపెద్దా తేడాలేకుండా స్మార్ట్‌ఫోన్‌లకు బానిసవుతున్నారు. తమ పిల్లలకు స్మార్ట్‌ఫోన్‌లు కొనిచ్చే తల్లిదండ్రులు... తామూ స్మార్ట్‌ఫోన్‌ల ఊబిలో కూరుకుపోయి పిల్లలను పట్టించుకోకపోతే ప్రమాదం తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి తమ పిల్లలను ఓ కంట కనిపెట్టవలసిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది.

- పి.ఫాతిమా

సూర్యుడు వేడిగా చంద్రుడు చల్లగా ఎందుకుంటాడు?



ప్రశ్న : సూర్యుడు ఎందుకు వేడిగా వుంటాడు. చంద్రుడు ఎందుకు చల్లగా వుంటాడు?
- శ్రీమతి E.పద్మ, ఉపాధ్యాయిని,
ఆశ్రమ ఉన్నత పాఠశాల, కురవి, మహబూబాబాద్ జిల్లా

జవాబు : సూర్యుడ్ని తాకితే వేడిగా వుంటాడనీ, చంద్రుడ్ని తాకితే చల్లగా వుంటాడనీ మీ ఉద్దేశ్యం కాదని తెలుసు. అయినా మండే ఎండలు అనీ, చల్లని వెన్నెల అనీ నానుడులు ఉన్నాయి. సూర్యుడు ఓ నక్షత్రం. పూర్తిగా వాయుగోళం. దాదాపు 75 శాతం హైడ్రోజన్ వాయువుతోను, మిగిలిన 25 శాతం దాదాపు హీలియం వాయువుతోను నిండివుంది. అక్కడ సుమారు 600 కోట్ల సంవత్సరాల క్రితం పూర్తిగా హైడ్రోజన్ వాయువే వుండేది. హైడ్రోజన్ వాయువు హీలియం వాయువుగా కేంద్రక సంశ్లేషణ చర్య (Nuclear Fusion) తో మారుతుంది. ప్రతి సెకనుకు సుమారు 6.2×10^{11} కి.గ్రా హైడ్రోజన్ వాయువు హీలియం వాయువుగా మారుతోంది. ప్రతి ఘటన (event) లో నాలుగు పరమాణువుల హైడ్రోజన్ ఒక హీలియం పరమాణువుగా మారుతున్నాయి. అంటే సెకనుకు సుమారు 9×10^{37} ఇలాంటి ఘటనలలో సుమారు 3.6×10^{38} హైడ్రోజన్ పరమాణువులు (ప్రోటాన్లు) హీలియం కేంద్రకాలు (Alpha Particle) గా మారుతున్నాయి. ఈ తతంగం సూర్యుడి గర్భం (core) లో జరుగుతుంది. సూర్య గోళోపరితలానికి వెళ్లే కొలదీ ఈ దూకుడు క్రమేపీ తగ్గుతుంది.



ఇలా కేంద్రక సంలీన చర్యలో సూర్యుడిలో ప్రతి సెకనుకు సుమారు 3.8×10^{26} జౌళ్ల శక్తి ఫ్రత్పత్తి అవుతుంది. అల్బర్ట్ ఐన్‌స్టీన్ తన సాపేక్షతా సిద్ధాంతం (Theory of Relativity) లో ప్రస్తావించిన $E=mc^2$ సూత్రం ప్రకారం నాలుగు ప్రోటాన్ల ద్రవ్యరాశి, హీలియం కేంద్రక ద్రవ్యరాశి కన్నా ఎంత ఎక్కువ వుందో ఆ మేరకు శక్తిగా మారుతోంది. సూర్యుడి దేహమంతా పూర్తిగా వాయుమయమే అయినా గర్భ కేంద్రం వద్ద సూర్యుడి సాంద్రత నీటి సాంద్రతకన్నా సుమారు 150 రెట్లు ఎక్కువ. అంటే ఇనుము సాంద్రతకన్నా సుమారు 30 రెట్లు ఎక్కువ. తద్వారా సూర్యగర్భ ఉష్ణోగ్రత సుమారు 150 లక్షల సెంటిగ్రేడ్ వుంటుంది. తమాషా ఏమిటంటే ఈ ఉష్ణోగ్రత సూర్యోపరితలానికి వెళ్లేప్పటికి బాగా పడిపోతుంది. సూర్యుడి ఉపరితల ఉష్ణోగ్రత సుమారు 550 సెంటీగ్రేడు డిగ్రీలు మాత్రమే. విపరీతమైన తీవ్రస్థాయిలో పైన పేర్కొన్న శక్తి కాంతి, వేడి తదితర రూపాలలో బయటపడ్డం వల్ల సూర్యుడు భగభగ మండే అగ్నిగోళంలాగా ఉంటాడు. సూర్యుడి ద్రవ్యరాశి మన భూమి ద్రవ్యరాశికన్నా సుమారు మూడున్నర లక్షల రెట్లు వుంటుంది. భూమికి, సూర్యుడికి మధ్య సగటు దూరం సుమారు 15 కోట్ల కి.మీ. ఈ దూరాన్ని ఖగోళ ప్రమాణం (astronomical unit: au) అంటారు. ఇంతటి దూరంలో కూడా సూర్యుడి శక్తి ప్రతి చ.మీ. కు సుమారు 1400 వాట్టులు (సెకనుకు జౌలుశక్తి పంపిణీని ఒక వాట్టు అంటాము) వుంటుంది. భూ వాతావరణం వల్ల ఇందులో సుమారు 400 వాట్టులు చెల్లాచెదురు కాగా భూమి ఉపరితలానికి సుమారు (ప్రతి చ.మీ.కు) 1000 వాట్టులే చేరుతుంది. ఇందులో 50 శాతం మేరకు పరాయణ కాంతి (Infrared light), 40 శాతం మేరకు మనకు దృగ్గోచరం అయ్యే దృశ్యకాంతి (visible light), 10 శాతం అతినీలలోహిత కాంతి (Ultraviolet light) వుండగా, అతినీలలోహిత కాంతిలోని 70 శాతం భాగం వాతావరణ పైపొరల్లోనే ఓజోన్ పొర వడపోస్తుంది. తద్వారా ఈ ప్రమాదకర కాంతి భూమిని చేరడం దాదాపు 70 శాతం మేర తగ్గిపోతుంది. పరాయణ కాంతి వల్లే మనకు సూర్యరశ్మి వేడిగా ద్యోతకమవుతుంది.

ఇక చంద్రుడి గురించి.... చంద్రుడు సూర్యుడి లాగా నక్షత్రం కాదు. పుక్కిటి పురాణాల్లో సూర్యుడ్ని, చంద్రుడ్ని దిక్కూదివాణం లేని (ఇంతవరకూ ఎక్కడా కానరాని) రాహువు, కేతువు అనే అవాస్తవిక (non existent) పదార్థాల్ని కలగలిపి నవగ్రహాలని పేర్కొన్నారు. ఆ నవగ్రహాల్లో భూమి వుండదు. ఎందుకంటే పురాణ గ్రంథాల ప్రకారం భూమి చుట్టూ ఆ నవగ్రహాలు తిరుగుతున్నట్లు అర్థం. అది వేరే విషయం. చంద్రుడు నక్షత్రం కాకపోవడమే కాదు కనీసం గ్రహం కూడా కాదని మనకు తెలుసు. సుమారు లక్షన్నర కి.మీ. దూరంలో భూమిచుట్టూ ప్రదక్షిణం చేసే ఉపగ్రహం చంద్రుడు. చంద్రోపరితలం మీదగానీ, చంద్రుడి గర్భకోశంలో గానీ ఎలాంటి శక్తి ఉత్పాదక చర్యలు జరగవు. కాబట్టి చంద్రుడు సూర్యుడిలాగా మిగిలిన నక్షత్రాల్లాగా స్వయం ప్రకాశకం కాదు. కేవలం సూర్యకాంతిని పరావర్తనం చెందించే మట్టిదిబ్బ మాత్రమే. చంద్రుడు భూమి చుట్టూ తిరిగే పరిభ్రమణ కాలం (Orbital period), తన చుట్టూ తాను తిరిగే భ్రమణ కాలం (spin period) దాదాపు సమానం కావడం వల్ల చంద్రోపరితలపు ఒక పార్శ్వం మాత్రమే ఎపుడూ భూమివైపు వుంటుంది. అంటే మనం చంద్రుడికున్న అవతలి ఉపరితలాన్ని ఎపుడూ చూడలేము. కేవలం అంతరిక్షంలోకి అటువైపుగా వెళ్లి మాత్రమే పరికించగలం. చంద్రుడు అంతరిక్షంలో వేలాడే ఉపగ్రహం కావడం వల్ల చంద్రుడి సగభాగం మీద ఎపుడూ సూర్యకాంతి పడుతుంటుంది. మనం చూసే పార్శ్వం మీద ఎంతమేరకు సూర్యకాంతి పడుతుందో ఆ భాగాన్నే మనం వెన్నెల చంద్రుడి రూపంగా చూస్తాము. సౌరకాంతి పడని భాగం చిమ్మ చీకటిగా వుండడం వల్ల ఆ భాగం ద్యోతకం కాదు. అందుకే చంద్రుడి రూపం ప్రతిరోజూ మారుతున్నట్టు అనిపిస్తుంది. మనం చూసే భాగం మీద కాకుండా ఆవలివైపు భాగం మీద మాత్రమే సూర్యుడి కాంతి పడ్డట్టయితే ఆ దశ (phase) లో చంద్రుడు కనిపించడు కాబట్టి అమావాస్య (New Moon Day) అనీ మనం చూసే భాగం మొత్తం మీద సూర్యకాంతి పడేట్టయితే చంద్రబింబం మొత్తం ప్రకాశవంతంగా కనిపించడం వల్ల పౌర్ణమి (Full Moon Day) అనీ అంటాము. మనం చూసే భాగం మీద సూర్యుడికాంతి పూర్తిగా పడకుండా భూమి అడ్డం వచ్చినట్లయితే పౌర్ణమి బదులు ఉపరితలం చిమ్మచీకటిగా కనిపించడం వల్ల చంద్రగ్రహణం (Lunar Eclipse) ఏర్పడుతుంది.

చంద్రుడి మీద సూర్యకాంతి పడే భాగంలో గరిష్ట ఉష్ణోగ్రత సుమారు 120 డిగ్రీల సెల్షియస్ వుండగా, సౌరకాంతి పడని చీకటి భాగపు కనీస ఉపరితల ఉష్ణోగ్రత (అమావాస్య చంద్రుడి చీకటి ఉపరితరల ఉష్ణోగ్రత) సుమారు –170 డిగ్రీల సెల్షియస్ వుంటుంది. అంటే అమావాస్య నుంచి పౌర్ణమి వైపు మారే క్రమంలో చంద్రుడి ఉపరితల ఉష్ణోగ్రత సుమారు 300 సెంటీగ్రేడ్ డిగ్రీల మేర పెరుగుతుందన్నమాట. అలాగే పౌర్ణమి నుంచి అమావాస్యకు వెళ్లే 14 రోజుల్లోనే అదే మేరకు తగ్గుతుంది. చంద్రుడి కాంతి తన స్వంతం కాదు. పైగా చంద్రుడి నేలకు కాంతి పరావర్తన ప్రతిభ ఏమంత పెద్దగా వుండదు. కాబట్టి చంద్రుడి వెన్నెల కాంతి వేడిగా వుండదని అంటుంటాం. అంతేగానీ వెన్నెల చల్లగా వుంటుంది అనకూడదు. పున్నమి రాత్రి ఆరుబయట నీరు నింపిన గ్లాసును ఉంచితే, ఆ నీరు చల్లబడి ఐసుగా మారుతున్నట్టుగా గానీ కనీసం చల్లబడుతుందని గానీ (చల్లని) కబుర్లు చెప్పుకోకూడదు.



ప్రొ॥ ఎ. రామచంద్రయ్య
సంపాదకులు,
చెకుముకి, జనవిజ్ఞాన వేదిక.
email: allikayala@gmail.com

మీ చిట్కాలు :

కంప్యూటర్, మొబైల్, యాప్, ఇంటర్నెట్ టెక్నాలజీ వినియోగంలో మీకు మాత్రమే తెలిసిన చిట్కాలను మాకు పంపండి.'సైటెక్' పేజీలో ప్రచురిద్దాం... మన విజ్ఞానాన్ని అందరితో పంచుకుందాం.

పంపించాల్సిన చిరునామా :
సైటెక్ పేజీ, ప్రజాశక్తి
డోర్ నెం: 27-30-4
ఆకులవారి వీధి, గవర్నర్ పేట
విజయవాడ, కృష్ణాజిల్లా, ఎపి
ఇమెయిల్ : scitechpage@gmail.com



పొడుపు కథ

ఆ ఆటగత్తె ఎప్పుడూ లోనే నాట్యం చేస్తుంది ?

జోక్ :

రాజు : ఒరేయ్ రామూ..! డ్రైవింగ్ నేర్చుకునేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి ?
రాము : ఏం లేదురా సింపుల్..! ముందు బండి మనది కాకుండా చూసుకోవాలి ?
రాజు : ఆ..!



కుండపోతవాన అంటే ?


ఆకాశం మేఘాలు వ్యాకోచించడం వల్ల వాతావరణం చల్లబడి, వాటిలోని నీటిఆవిరి ద్రవీకరించబడి చిన్న చిన్న బిందువులుగా మారుతుంది. అయితే వ్యాకోచం చెందే మేఘాలు సెకనుకు ఒకటి నుంచి పదిమీటర్ల వేగంతో పైకి పోతూ ఉంటాయి. ఇలా పైకి పోయే మేఘాలతో పాటు చిన్న చిన్న బిందువులు కూడా పైకి వెళ్తున్నప్పుడు వాటికి మరికొన్ని నీటి బిందువులు తోడై పెద్ద బిందువుగా మారుతుంది. ఇలా బరువెక్కిన నీటి బిందువు పైకి వెళ్ళలేక భూమ్యాకర్షణ శక్తి కారణంగా కిందికి పడుతుంది. అంతేకాక స్వల్ప పరిమాణంలోని నీటిబిందువు తలతన్యత వల్ల గోళాకారం పొందుతుంది. గాలిలోని నీటిఆవిరి నీటిబిందువులుగా మారే ప్రక్రియ నెమ్మదిగా జరిగేది





కాబట్టి వర్షం బిందువులుగానే పడుతుంది. అయితే అల్పపీడనం ఏర్పడినప్పుడు ఎక్కువ మొత్తంలో ఎక్కువ నీటి ఆవిరి ద్రవీకరించబడటం వలన నీటిబిందువులు ఒకదాని వెంట మరొకటి పడుతూ పడుతూ వర్షపుధారవలె అనిపిస్తుంది. దీనినే మనం కుండపోతవాన అంటాం. ★

గుర్తించండి!



పిల్లలూ..! పైనున్న చిత్రంలో మొత్తం ఎనిమిది తేడాలు ఉన్నాయి. అవేంటో గుర్తించండి!

నేడు రెండో వన్డే



యుఎస్ ఓపెన్ నుంచి బాంబ్రీ నిష్క్రమణ

న్యూయార్క్ : యుఎస్ ఓపెన్ గ్రాండ్ స్లామ్ టోర్నీలో భారత ఆశాకిరణంగా భావించిన యుకె బాంబ్రీ పూర్తిగా నిరాశపర్చాడు. ఈ టోర్నీలో అర్హత పోటీల్లో తొలి దశ నుంచే నిష్క్రమించాడు. భారత భారత ఆటగాడు ప్రజ్నేష్ గున్నేశ్వరణ్ కూడా బాంబ్రీనే అనుసరించాడు. బుధవారం పురుషుల సింగిల్స్ క్వాలిఫయర్స్ తొలి రౌండ్ పోటీలో బాంబ్రీపై జపాన్‌కు చెందిన గో సోయిడా 6-1, 1-6, 3-6 స్కోరుతో విజయం సాధించాడు. ఒక గంటా నలభై నిమిషాలు పాటు సాగిన ఈ మ్యాచ్‌లో బాంబ్రీపై జపాన్ ఆటగాడు అధిక్యం చూపాడు. మరో మ్యాచ్‌లో ప్రజ్నేష్‌పై జర్మనీకి చెందిన యన్నిక్ హన్‌ఫ్మాన్న 6-1, 6-4 స్కోరుతో సునాయసంగా విజయం సాధించాడు. ఇక టోర్నీలో భారత్ ఆశలన్నీ రామ్‌కుమార్ రామనాథన్‌పైనే వున్నాయి. ప్రపంచ ర్యాకింగ్స్‌లో 156 స్థానంలో వున్న రామ్‌కుమార్ భారత్ నుంచి ఉత్తమ ర్యాంక్‌లో వున్న విషయం తెలిసిందే.

వన్డే కెప్టెన్సీకి డివిలియర్స్ గుడ్‌బై

జోహన్నస్‌బర్గ్ : దక్షిణాఫ్రికా వన్డే క్రికెట్ జట్టు కెప్టెన్ బాధ్యతల నుంచి ఎబి డివిలియర్స్ తప్పుకున్నాడు. బుధవారం ఈ విషయాన్ని ప్రకటించాడు. నాయకత్వ బాధ్యతలకు న్యాయం చేయలేకపోతున్నానే అభిప్రాయంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపాడు. అయితే మూడు ఫార్మట్లలోనూ జట్టుకు అందుబాటులో వుంటానని డివిలియర్స్ ప్రకటించాడు. కాగా, దక్షిణాఫ్రికా మాజీ ఆటగాళ్లు గ్రేమ్ స్మిత్, జాక్వస్ కలిస్, మార్క్ బౌచర్‌లు ఇక టీ20 కోచ్‌గా బాధ్యతలు నిర్వహించనున్నారు. నవంబర్‌లో దక్షిణాఫ్రికాలో జరిగే దేశవాళీ టీ20 టోర్నమెంట్‌లో ఈ ముగ్గురు కోచ్‌లుగా వ్యవహరించనున్నట్లు దక్షిణాఫ్రికా క్రికెట్ బుధవారం ప్రకటించింది. ఈ లీగ్‌లో వివిధ జట్లుకు వీరు కోచ్‌లుగా వుంటారు. అలాగే భారత్‌కు చెందిన రాబిన్ సింగ్, శ్రీరామ్ శ్రీధరన్ కూడా ఈ టీ20 లీగ్‌లో కోచ్‌లుగా బాధ్యతలు నిర్వహిస్తారు. న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ స్టీఫెన్ ఫ్లెమింగ్ కూడా ఈ లీగ్‌లో కోచ్‌గా వున్నాడు. ఈ లీగ్ కోసం త్వరలో ఆటగాళ్ల వేలం కార్యక్రమం జరుగనుంది. తూర్పు జోహన్నస్‌బర్గ్ కేంద్రంగా కొనసాగుతున్న జట్టు బెనోని జల్మికి గ్రేమ్ స్మిత్ కోచ్‌గా నియమించారు. మూడేళ్ల క్రితం అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్‌కు దూరమైన 36 ఏళ్ల స్మిత్ ఒక కోచ్‌గా పూర్తిస్థాయిలో బాధ్యతలు నిర్వహిస్తుండటం ఇదే మొదటిసారి.

ఉత్సాహంతో భారత్, ఒత్తిడిలో శ్రీలంక

మధ్యాహ్నం 2:30 గంటల నుంచి



పల్లేకలే : భారత్-శ్రీలంక క్రికెట్ జట్ల మధ్య గురువారం రెండో వన్డే జరుగనుంది. ఐదు మ్యాచ్‌లో ఈ సిరీస్‌లో తొలి వన్డేలో ఘన విజయం సాధించిన భారత్ అదే ఉత్సాహంతో నేడు జరిగే రెండో వన్డేలో బరిలోకి దిగుతోంది. మరో వైపు ఆతిధ్య శ్రీలంక జట్టు పరిస్థితి ఇందుకు భిన్నంగా వుంది. ఇప్పటికే టెస్టు సిరీస్‌ను 3-0తో కోల్పోయి, తొలి వన్డేలోనూ ఓటమి చెందడంతో ఆ జట్టుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో తీవ్ర ఒత్తిడితో ఆ జట్టు రెండో వన్డేలో బరిలోకి దిగుతుంది. నేడు జరిగే వన్డేలో విజయం సాధించి సిరీస్‌పై ఆశలు నిలుపుకోవాలని భావిస్తోంది. అయితే జట్టు పరిస్థితి ఆ విధంగా కనిపించడం లేదు. తొలి వన్డేలో 216కే ఆలౌట్ కావడం ఆ జట్టు పరిస్థితి తెలియచేస్తోంది. శ్రీలంక ఆటగాళు ఆత్మవిశ్వాసంతో కనిపించడం లేదు.

టెస్టు సిరీస్ ప్రదర్శన పట్ల వారంతా నిరాశలో వున్నారు. మరోవైపు నంబర్‌వన్ జట్టు భారత్‌తో ఆడుతూ తమను తాము నిరూపించు కోవడం శ్రీలంక ఆటగాళ్లకు సవాలే అని ఆ జట్టు మాజీ ఆటగాడు మహేల జయవర్ధనే అన్నాడు. భారత్‌తో సిరీస్‌కు ముందు జింబాబ్వే చేతిలోనూ 3-2తో వన్డే సిరీస్‌ను శ్రీలంక కోల్పోయింది. ఇప్పుడు భారత్‌ను ఎదుర్కొవడం శ్రీలంక కష్టమే అని జయవర్ధనే అభిప్రాయం వ్యక్తం చేశాడు.

భారత్ పూర్తి సామర్థ్యంతో నేటి మ్యాచ్‌లో దిగుతోంది. టెస్టు సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయడంతో పాటు తొలి వన్డేలో బౌలింగ్, బ్యాటింగ్‌లో రాణించడంతో ఆటగాళ్ల ఉత్సాహంతో వున్నారు. అయినా నేటి వన్డే కోసం బుధవారం నెట్స్‌లో కఠిన సాధన చేశారు. ముఖ్యంగా తొలి మ్యాచ్‌లో చోటు దక్కని మనీష్ పాండే రెండో మ్యాచ్ కోసం నెట్స్‌లో తీవ్రంగా శ్రమించాడు. తుది జట్టులో స్థానం కోసం పోటీ ఎక్కువ కావడంతో పాండే తొలి వన్డేకు తీసుకోలేదు. తొలి మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించడంతో నేటి మ్యాచ్‌లో ప్రయోగాలు చేసేందుకు భారత జట్టు యాజమాన్యం సిద్ధంగా వుంది. ఈ నేపథ్యంలో పాండేకు నేటి మ్యాచ్‌లో ఆవకాశం లభించే అవకాశం వుంది. రెండేళ్లలో ప్రపంచకప్ జరుగుతుండటంతో యువ ఆటగాళ్లందరినీ ఆడించి ప్రయోగాలు చేస్తామని భారత కెప్టెన్ కోహ్లి ఇప్పటికే పేర్కొనాడు. ఓడినప్పుడు విమర్శలు రావొచ్చని, అయితే సవాళ్లను ఆహ్వానించాల్సిందే అని తొలి వన్డే విజయం తరువాత కోహ్లి వ్యాఖ్యానించాడు. ప్రపంచకప్ లక్ష్యంగానే భారత్ ప్రయోగాలు చేస్తోంది.

మరోవైపు నేటి వన్డేలో విజయం సాధిస్తామని శ్రీలంక కెప్టెన్ ఉపుల్ తరంగ విశ్వాసం వ్యక్తం చేశాడు. తమ ఆటగాళ్లపై పూర్తి నమ్మకం వుందని, దురదృష్టవశాత్తు తొలి వన్డేలో బ్యాటింగ్‌లో విఫలమయ్యామని నేడు ఆ తప్పు మళ్లీ జరగనివ్వమని తరంగ విశ్వాసంగా తెలిపాడు.



లోథా సిఫార్సులు అమలులో నిర్లక్ష్యం

బిసిసిఐ అధికారులకు షోకాజ్ నోటీసులు

సెప్టెంబరు 19న హాజరుకావాలని సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : బిసిసిఐ యాక్టింగ్ ప్రెసిడెంట్ సికె ఖన్నా, యాక్టింగ్ సెక్రటరీ అమితాబ్ చౌదరి, యాక్టింగ్ ట్రెజరర్ అనిరుధ్ చౌదరిలకు సుప్రీంకోర్టు బుధవారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. లోథా ప్యానెల్ నివేదికను అమలుచేయనందుకు దేశ ఉన్నత కోర్టు ఈ చర్య తీసుకుంది. సెప్టెంబరు 19న జరిగే విచారణకు వ్యక్తిగతంగా హాజరుకావాలని బిసిసిసి సభ్యులకు జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఎ ఎం ఖన్విల్కర్, జస్టిస్ డి వై చంద్రచూడ్‌తో కూడిన ధర్మాసనం ఆదేశాల్చింది. అలాగే బిసిసిఐ కోసం ముసాయిదా రాజ్యాంగాన్ని తయారు చేయాలని కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్ (సిఓఎ)ను సుప్రీంకోర్టు ఆదేశించింది. ముసాయిదా రాజ్యాంగానికి బిసిసిఐ కూడా సూచనలు ఇస్తుందని తెలిపింది. 'మేం కొన్ని సమస్యలపై అవకాశాలు ఇస్తున్నాం. కానీ బిసిసిఐ ఏమీ చేయడం లేదు' అని సుప్రీంకోర్టు తీవ్రంగా వ్యాఖ్యానించింది. యాక్టింగ్ ప్రెసిడెంట్ సికె ఖన్నా, యాక్టింగ్ సెక్రటరీ అమితాబ్ చౌదరి, యాక్టింగ్ ట్రెజరర్ అనిరుధ్ చౌదరిలను ఆ పదవుల నుంచి తొలగించాలని సుప్రీంకోర్టును సిఓఎ ఆశ్రయించింది. ఆ పదవుల్లో వారి ప్రదర్శన సంతృప్తికరంగా లేదని, లోథా కమిటీ సిఫార్సులకు వారు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని సిఓఎ ఆరోపించింది. నిర్వహణ, పరిపాలన, పాలన నుంచి వీరి దూరంగా వుంచాలని కోరింది. కొత్తగా ఎన్నికలు జరిపించి, నూతన ఆఫీస్ బేరర్లను ఎంపిక చేయాలని సుప్రీంకోర్టుకు సిఓఎ విజ్ఞప్తి చేసింది.

కెప్టెన్‌గా రాణి రాంపాల్

యూరప్ పర్యటనకు హాకీ జట్టు ప్రకటన



న్యూఢిల్లీ : త్వరలో యూరప్ పర్యటనలో పాల్గొనే భారత మహిళా హాకీ జట్టును బుధవారం ప్రకటించారు. 18 మందితో కూడిన జట్టుకు ఫార్వర్డ్ రాణి రాంపాల్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేయగా, గోల్ కీపర్ సవితను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు. సెప్టెంబర్ 5 నుంచి 20వ వరకూ అంటే 15 రోజుల పాటు యూరప్ పర్య టనలో భారత మహిళా జట్టు పాల్గొం టుంది. నెద ర్లాండ్స్‌తో మ్యాచుల్లో పాల్గొ టుంది. ప్రస్తుతం బెంగళూరులో జరుగుతున్న మూడు వారాల శిక్షణలో జట్టు పాల్గొంటుంది. బుధవారం ఎంపిక చేసిన జట్టులో రష్మితా మింజ్, కరిష్మా యాదవ్, లల్రెమ్సియామి.. వంటి యువ క్రీడాకారిణిలకు స్థానం కల్పించగా, సుశీలా చాను, రితూ రాణి, ప్రీతి దుబే, అనుప బర్లా వంటి వారికి విశ్రాంతి ఇచ్చారు. యూరప్ టూర్ తరువాత ఆస్ట్రేలియా హాకీ లీగ్‌లో భారత జట్టు తలపడుతుంది. ఈ లీగ్ సెప్టెంబరు 28 నుంచి అక్టోబరు 9 వరకూ జరుగుతుంది. కాగా, కీలకమైన ఆసియా కప్ జపా న్‌లో అక్టోబరు 25 నుంచి నవంబర్ 5 వరకూ జరుగునుంది. వీటిని అన్నింటిని దృష్టిలో పెట్టుకునే కోచ్ స్జోఈర్డ్ మరిజ్నే తాజా జట్టును ఎంపిక చేశారు. ముందు వున్న సవాళ్లను దృష్టిలో పెట్టుకుని నూతన కాంబినేషన్లను పరీక్షించనున్నారు. ఆసియా కప్‌ను 2004లో చివరిసారిగా భారత్ గెలుచుకుంది. మరోసారి ఆ టైటిల్ సాధనపై దృష్టి పెట్టినట్లు కోచ్ తెలిపారు.

భారత మహిళా హాకీ జట్టు :

గోల్ కీపర్స్ : సవితా పూనియా, రజని ఈతిమర్పు, ఢిఫెండర్స్ : దీపా గ్రేస్ ఎక్కా, గుర్జిత్ కౌర్, నవ్‌దీప్ కౌర్, సునితా లక్రా, రష్మితా మింజ్. మిడ్ ఫీల్డర్స్: నమితా టొప్పో, నిక్కి ప్రధాన్, మోనికా, కరిష్మా యాదవ్, లిలిమా మింజ్, నెహా గోయాల్. ఫార్వర్డ్స్ : రాణి రాంపాల్, పూనమ్ రాణి, వందన కటారియా, రీనా ఖోఖర్, లల్రెమ్సియామి.



యుపి యోధా, తలైవాస్ మ్యాచ్ టై

లక్నో : ప్రొ కబడ్డీ లీగ్‌లో భాగంగా బుధవారం యుపి యోధా, తమిళ తలైవాస్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ టైగా ముగిసింది. నిర్ణీత సమయం ముగిసే సరికి ఇరు జట్లు 33-33 స్కోరుతో సమానంగా నిలిచాయి. బుధవారం మరొక మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీపై గుజరాత్ స్టీలర్స్ రెండు పాయింట్ల తేడాతో విజయం సాధించింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో చేలరేగిన గుజరాత్ 27-25 పాయింట్లతో ఢిల్లీపై పోరాడి గెలిచింది. ఈ మ్యాచ్‌లో తొలుత వెనకబడ్డ ఢిల్లీ తరువాత అద్భుతంగా పుంజుకుని స్టీలర్స్‌కు గట్టిపోటీ ఇచ్చింది. అయితే చివరి నిమిషంలో పట్టు సడలించడంతో ఆ జట్టు ఓటమి పాలైంది.

ప్రీక్వార్టర్స్‌లో సైనా, శ్రీకాంత్, ప్రణీత్



గ్లాస్గో : ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన సైనా నెహ్వాల్, కిదాంబి శ్రీకాంత్, బి. సాయి ప్రణీత్ ప్రీ క్వార్టర్స్ ఫైనల్స్‌కు చేరుకున్నారు. బుధవారం జరిగిన మహిళ సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లో స్విట్జర్లాండ్‌కు చెందిన సబ్రినా జాక్వెట్‌పై 21-11, 21-12 స్కోరుతో సునాయసంగా విజయం సాధించిన సైనా ఈ చాంపియన్‌షిప్‌లో తన ఆరంభాన్ని ఘనంగా చాటింది. కేవలం 33 నిమిషాల్లోనే సైనా మ్యాచ్‌ను ముగించింది. సైనా తన తదుపరి మ్యాచ్‌లో కొరియాకు చెందిన సుంగ్ జి హ్యున్‌ను ఢీకొటుంంది. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లో ఇండోనేషియాకు చెందిన అంటోని సినిసుకాపై 14-21, 21-18, 21-19 స్కోరుతో సాయి ప్రణీత్ విజయం సాధించాడు. ప్రణీత్ తన తదుపరి మ్యాచ్‌లో డెన్మార్క్‌కు చెందిన మార్క్ జ్విఎబ్లెర్‌తో తలపడతాడు. ఇక బుధవారం జరిగిన మరొక పురుషుల సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన లుకాస్ కోర్వీపై 21-9, 21-17 స్కోరుతో శ్రీకాంత్ సునాయసంగా విజయం సాధించాడు. ప్రీక్వార్టర్స్‌కు సునాయసంగా చేరుకున్నాడు. తదుపరి మ్యాచ్‌లో డెన్మార్క్‌కు చెందిన అండ్రూస్ అంటోన్‌సెన్‌ను శ్రీకాంత్ ఢీకొంటాడు.

ఏడాదిలో లక్ష ఎకరాల కాఫీ సాగా..?

- ప్రాజెక్టు అమలుపై అనుమానాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కాఫీ సాగు విస్తీర్ణం అనుమానాస్పదంగా కనిపిస్తోంది. ప్రభుత్వం చెపుతున్న లెక్కలకు, వాస్తవ పరిస్థితులకు పొంతన లేదనే విమర్శలు వస్తున్నాయి. లక్ష ఎకరాల్లో కాఫీ సాగు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది. కానీ ఈ సాగు పది వేల ఎకరాల్లోనే ఉంటుందంటున్నారు. ఈ ప్రాజెక్టుకు రూ. 524 కోట్లు మంజూరయ్యాయి. కాఫీ తోటల సాగు సాధారణ తోటల కన్నా భిన్నంగా ఉంటుంది. ఒక ఎకరం కాఫీ తోటను సాగులోకి తేవడానికి దాదాపు ఏడాది కాలం పడుతుంది. లక్ష ఎకరాల్లో ఒక్క ఏడాదిలో సాగులోకి తేవడమంటే అసాధారణమే కాగలదంటున్నారు. ఈ ప్రాజెక్టును చేపట్టిన నాటి నుంచి ఇంతవరకు 10 వేల ఎకరాల్లో సాగులోకి తేగా, మరో 12 వేల ఎకరాలు ప్లాంటేషన్‌కు సిద్ధమైనట్లు ఈ విధుల్లో ఉండే క్షేత్రస్థాయి అధికారుల ద్వారా తెలుస్తోంది. ఈ ప్రగతి కూడా నిర్విరామంగా కష్టపడితేనేనని వారు చెబుతున్నారు. ఏకకాలంలో ఎండా, నీడ నిచ్చే షేడ్ ట్రీస్ కింద కాఫీ సాగును చేపట్టాల్సి ఉంటుంది. ఈ చెట్ల పెంపకానికి సుమారు నాలుగు సంవత్సరాలు పడుతుంది. సిల్వర్ వోక్, సంపెంగ, పనస, మామిడి, నేరేడు వంటి చెట్లను షేడ్ ట్రీస్‌గా పెంచుతారు. వీటిలో సిల్వర్ వోక్ చెట్లయితే త్వరగా పెరుగుతాయని వాటికి ప్రాధాన్యత ఇస్తున్నారు. కాఫీ మొక్కను నాటే ముందు వీటిని పెంచుతారు. ఎకరానికి వెయ్యి నుంచి పదకొండు వందల వరకు కాఫీ మొక్కలు నాటుతారు.



నర్సరీలే ప్రశ్నార్థకం..

రాష్ట్రంలో ఎక్కడా లక్ష ఎకరాలకు సరిపడా మొక్కలు సరఫరా చేసే ఈ నర్సరీలు లేవు. పాడేరు ఐటిడిఏ పరిధిలో సుమారు ఆరు వేల నుంచి ఏడు వేల మొక్కల వరకే నర్సరీలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. లక్ష ఎకరాలకు సరిపడా కాఫీ మొక్కలు సరఫరా చేయాలంటే ప్రస్తుతం ఉన్న నర్సరీల సంఖ్య సరిపోదు. అందువల్ల పెద్ద ఎత్తున ముందుగా ఈ నర్సరీలనే గ్రామాల స్థాయిలో చేపట్టాల్సి ఉంటుందని వారు అభిప్రాయపడుతున్నారు. కాఫీ ప్లాంటేషన్ల సాగులో ప్రత్యేకంగా శిక్షణ పొందిన, అనుభవం గల కార్మికులూ పెద్ద సంఖ్యలో ఈ పనులకు అవసరమవుతారు. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకుని, తగిన సాధన సంపత్తితో ప్రాజెక్టు చేపడితే సుమారు లక్ష ఎకరాల సాగుకు సుమారు ఆరేడు సంవత్సరాలైనా పడుతుందని ఈ రంగంలో అనుభవం గల వారి అంచనా. పెద్ద ఎత్తున కాఫీ సాగు చేస్తున్నట్టు ప్రచారం చేసుకోవడం మినహా, ఆ స్థాయిలో కాఫీసాగు ఉండదని గిరిజన సంక్షేమ సంఘాల నేతలు విమర్శిస్తున్నారు. కాఫీ ప్రాజెక్టుకు మంజూరైన రూ.524 కోట్లలో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని కాఫీ బోర్డు రూ.160 కోట్లు మంజూరు చేయగా, మిగిలిన రూ. 364 కోట్లూ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈనేపథ్యంలో వాస్తవంగా ఎన్ని ఎకరాల్లో ఎక్కడెక్కడ ఈ సాగు చేపట్టి, ఇంతవరకు ఏమేరకు అందుకు నిధులు వ్యయం చేశారనే వివరాలు రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా వెల్లడించాల్సి ఉందని గిరిజన సంఘాలు కోరుతున్నాయి.

మాఫియా ఆగడాలు .. ఆపై అవినీతి

బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేశ్ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జూదం, కల్తీ, ఇసుక మాఫియా ఆగడాలు రాష్ట్రంలో పెచ్చుమీరుతున్నాయని, దీనికి అవినీతి తోడైందని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవ్యాంధ్ర మాఫియా కోరల్లో చిక్కుకుందని విమర్శించారు. మట్కా జూదం, క్రికెట్ బెట్టింగ్, డ్రగ్స్ మాఫియా, మద్యం, బెల్టుషాపులు, ఆహార కల్తీ, చందనం, ఇసుక అక్రమ రవాణా విచ్చలవిడిగా సాగుతున్నాయని, దీనికి అధికార యంత్రాంగానికి చెందిన కొందరి మద్దతు ఉందనేది పోలీసు విచారణలో తేలిందన్నారు. గూడూరు డివిజన్‌లో ఒక డిఎస్పీ ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని, నెల్లూరులో క్రికెట్ బెట్టింగ్ వెనుక పోలీసు అధికారులు ఉన్నారని చెప్పారు.

పేరుకే 'గురు' కులాలు..!

- వేలల్లో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ
- తాత్కాలిక సిబ్బందితో కాలక్షేపం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సంక్షేమ గురుకుల పాఠశాలల్లో సబ్జెక్టుల వారీగా శాశ్వత ఉపాధ్యాయులను ప్రభుత్వం భర్తీ చేయడం లేదు. కేవలం ఆయా పోస్టుల్లో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను మాత్రమే తాత్కాలికంగా నియమిస్తున్నారు. గత మూడేళ్లుగా ఈ పాఠశాలల్లో ఒక్క టీచర్ పోస్టునైనా శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేసిన దాఖలాలు లేవు. వేలాది పోస్టులు ఖాళీగా ఉంటే కొన్ని పోస్టులను మాత్రమే రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతులిస్తోంది. గురుకుల పాఠశాలల్లో సాంఘిక సంక్షేమం 200, గిరిజన 400, బిసిలకు కేవలం 13 పోస్టులు మాత్రమే ప్రభుత్వం మంజూరు చేసింది. ఇవి కూడా ఇటీవల సాంఘిక, గిరిజన సంక్షేమ వసతి గృహాలను గురుకులాలుగా మార్చిన పాఠశాలలకు, బిసిల్లో బెస్ట వారికి కొత్తగా ఏర్పాటు చేసిన కొన్ని పాఠశాలలకు మాత్రమే కావడం గమనార్హం.

గిరిజన గురుకుల పాఠశాలల్లో 1,380 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో 39 ప్రిన్సిపల్, 200 జూనియర్ లెక్చరర్, పిజిటి 181, టిజిటి 695, పిడి 21, పిఇటి 96, ఆర్ట్, క్రాఫ్ట్, అండ్ మ్యూజిక్ 95, లైబ్రేరియన్ 32 పోస్టులు ఖాళీ..! మరో 849 నాన్‌టీచింగ్ పోస్టులూ ఖాళీగానే ఉన్నాయి. బిసి గురుకుల పాఠశాలల్లో మొత్తం 850 పోస్టులకుగాను 291 పోస్టులు భర్తీ కాగా, 559 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. వీటిలో ప్రిన్సిపల్ 20, పిజిటి100, టిజిటిలు 102 ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ 43, స్టాఫ్‌నర్స్ 11, పిఇటి 24 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సాంఘిక సంక్షేమ గురుకులాల్లో సుమారు 4,125 ఉపాధ్యాయ పోస్టులు, మరో 1,929 నాన్ టీచింగ్ పోస్టులకుగాను 1,874 మంది టీచింగ్, 694 మంది నాన్‌టీచింగ్ రెగ్యులర్ ఉద్యోగులున్నారు. మిగతా 2,251 టీచింగ్ 1,335 నాన్ టీచింగ్ పోస్టులు నేటికీ భర్తీ కాలేదు. ఇటీవల కంటితుడుపుగా మంజూరు చేసిన పోస్టులను కూడా ఎప్పుడు, ఎలా భర్తీ చేస్తారనే అంశంపై స్పష్టత లేదంటున్నారు. ఈ పోస్టులను ఎపిపిఎస్‌సి ద్వారా నియమించాలని గిరిజన గురుకుల పాఠశాలల అధికారులు యోచిస్తుండగా, ఈ నియామకాలకు ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రావాల్సి ఉందని సాంఘిక సంక్షేమ, బిసి సంక్షేమ గురుకులాల అధికారులు చెబుతున్నారు.

సాగర జలాల్లో భారత్ పట్టుసాధించాలి

- భారత నౌకాదళధిపతి సునీల్‌లాంబ
- తూర్పునౌకాదళంలో ముగిసిన గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

సముద్ర జలాల్లో భారత్ తన పట్టును బిగించాలని భారత నావికాదళధిపతి సునీల్‌లాంబ ఉద్ఘాటించారు. తూర్పునౌకాదళం, నేషనల్ మెరిటైం ఫౌండేషన్ (ఎన్ఎంఎఫ్) సంయుక్త భాగస్వామ్యంతో తూర్పునౌకాదళంలో గోల్డెన్ ఉత్సవాల్లో భాగంగా సముద్రిక ఆడిటోరియంలో జాతీయస్థాయి అంశాలపై సెమినార్‌ను నిర్వహించాయి. గురువారం ముగింపు సందర్భంగా తూర్పునౌకాదళ మాజీ అధిపతులు, భారతనావికాదళ మాజీ అధిపతులు పలువురు అనేక అంశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా తొలుత స్వాగతోపన్యాసం తూర్పునౌకాదళధిపతి హెచ్‌సిఎస్ బిస్త్ ఇచ్చారు. ఇండియన్ నేవీ చీఫ్ సునీల్‌లాంబ కీలకోపన్యాసం చేస్తూ... సముద్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేలాగ, దేశాల మధ్య నేరాలను అదుపులో ఉండే శక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. మేరిటైం ఎకనామిక్స్, మేరిటైం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మేరిటైం ఎన్విరాన్‌మెంట్, మేరిటైం సెక్యూరిటీ, సేఫ్టీ, రీజనల్ మేరిటైం డైనమిక్స్ తదితర అంశాలపై సెమినార్‌లో వక్తలు ప్రసంగించారు.



రీజనల్ మెరిటైం డైనమిక్స్ అంశంపై జరిగిన సెమినార్‌కు రిటైర్డ్ నావికాదళ వైస్ అడ్మిరల్ సతీష్‌సోనీ అధ్యక్షత వహించారు. ఇండియన కోస్ట్ గార్డు అడిషనల్ డైరెక్టర్ జనరల్ వివిఎస్సార్ మూరిత మాట్లాడుతూ సముద్రంపై దేశాలతో జరిగే కార్యకలాపాల సందర్భంగా, ఒత్తిడులు, దాడులను ఎదుర్కొనేలాగ వ్యూహం రచించాలని సూచించారు. ఇండో-పసిఫిక్ రీజియన్‌లో నిర్మాణాత్మక తీర కార్యకలాపాలకు ప్రణాళికలు వేయాలని కమాండర్ ప్రకాష్ గోపాల్ వెల్లడించారు. సాగరజలాల్లో సవాళ్లను అధిగమించేందుకు కట్టుదిట్టమైన వ్యూహం అనుసరించాలని మాజీ నావికాదళాధిపతి అరుణ్‌ప్రకాష్ చెప్పారు. రెండు రోజుల పాటు జరిగిన సెమినార్‌లో 18 మంది వక్తలు, వ్యూహాత్మక అధ్యయన కర్తలు, ప్రాక్టీషనర్స్ (ఇండియన్ నేవీ,కోస్ట్‌గార్డు) కు చెందిన అధికారులు పాల్గొన్నారు. తీర ప్రాంతంలో మన సత్తా చాటుకునేందుకు కావల్సిన సాధన సంపతి, సామర్థ్యాలను పెంపొందించుకునే విధంగా రెండు రోజుల పాటు జరిగిన చర్చలు ఉపయోగపడ్డాయని వారు అభిప్రాయపడ్డారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68